
శతారుణ గీతాంజలి
రూ॥180/-
పేజీలు:180
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★



వచ్చేనెల భారత్ - అమెరికా వాణిజ్య ఒప్పందం

'విబి-జి రామ్ జి'ని ఉపసంహరించుకోవాలి 05



సంపుటి 09, సంచిక: 69 | శుక్రవారం | 06-02-2026 | ఖమ్మం | Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00




## బిజెపి, బిఆర్‌ఎస్‌ది ఫెవికాల్ బంధం

### రాష్ట్రంలో ఆ రెండు పార్టీలూ కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయ్

- కాళేశ్వరంపై సిబిఐ విచారణ చేయాలంటూ అసెంబ్లీలో తీర్మానం చేసి పంపినా కేంద్రం ఎందుకు చర్యలు తీసుకోవడంలేదు?
- పాలమూరు రంగారెడ్డికి జాతీయ హోదా ఎందుకివ్వలేదు?
- మెట్రోరైల్, మూసీ ఊసెత్తని బిజెపి నాయకులు రాష్ట్రంలో ప్రచారానికి ఎలా వస్తారు?
- మున్సిపల్ ఎన్నికల్లో బిజెపికి ఒక్క సీటుకూడా దక్కనియ్యం
- గత పదేళ్లలో బిఆర్‌ఎస్, పన్నెండేళ్లలో మోదీ ఏం చేశారో చర్చిద్దాం రండి
- బిజెపి, బిఆర్‌ఎస్ నేతలకు సిఎం రేవంత్‌రెడ్డి సవాల్
- కరీంనగర్ జిల్లా చొప్పదండిలో 'ప్రజాపాలన- ప్రగతి బాట'



ప్రజాపక్షం/కరీంనగర్

రాష్ట్రంలో బిజెపి, బిఆర్‌ఎస్ పార్టీలు కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయని, ఆ రెండు పార్టీలది ఫెవికాల్ బంధమని, గత పార్లమెంట్ ఎన్నికల్లో అవయవదానం చేసినట్టు 8 సీట్లను బిజెపికి దానం చేశారని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. అసెంబ్లీ సాక్షిగా తీర్మానం చేసి కాళేశ్వరంపై సిబిఐ విచారణ చేయాలని కేంద్రానికి పంపించామని ఆరు నెలలైనా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. కాళేశ్వరం కెసిఆర్‌కు ఎటిఎంగా మారిందన్న ప్రధాని ఎందుకు సిబిఐ విచారణ చేపట్టడం లేదని, ఫార్ములా ఈ రేసు కేసులో ఐఎఎస్‌పై విచారణకు అనుమతి కోరుతూ లేఖ రాస్తే ఇప్పటికీ స్పందన లేదన్నారు. గురువారం ఆయన కరీంనగర్ జిల్లాలో పర్యటించారు. రామడుగులో రూ.45.15 కోట్లతో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్, రూ. 5 కోట్లతో గంగాధర మండలం మధురానగర్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణానికి తరువాయి 2లో



## రాజ్యసభలో ప్రధాని ప్రసంగం బహిష్కరణ

- మల్లికార్జున ఖర్గేను మాట్లాడేందుకు అనుమతించని చైర్మన్
- నిరంకుశత్వం చెల్లదని, అవమానాలను సహించబోమని కాంగ్రెస్ సభ్యులనినాదాలు

**న్యూఢిల్లీ:** రాజ్యసభలో గురువారం తీవ్ర గందరగోళ పరిస్థితిమధ్య ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రసంగాన్ని ప్రతిపక్షాలు బహిష్కరించి వెళ్ళిపోయాయి. ''నిరంకుశత్వం చెల్లదు..అవమానాలను సహించబోం'' అని నినాదాలు చేశారు. వాకౌట్ చేశారు. అనంతరం మోదీ లోక్‌సభలో ప్రతిపక్షనాయకుడు రాహుల్‌గాంధీ, ఇతర ప్రతిపక్ష నాయకులపై తీవ్ర విమర్శలతో విరుచుకుపడ్డారు. వంద నిమిషాలపాటు చేసిన తన ప్రసంగంలో పూర్తిగా ప్రతిపక్షాలను తిట్టిపోయడంపైనే దృష్టి కేంద్రీకరించారు. కాగా, ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గేను రెండు నిమిషాలపాటు మాట్లాడేందుకు అనుమతించాల్సిందిగా సభాపతిని ప్రతిపక్ష సభ్యులు మొదట కోరారు. కానీ సభాధ్యక్షుడు సి.పి.రాధాకృష్ణన్ అందుకు అనుమతించలేదు. ప్రధానమంత్రి నరేంద్రమోదీని ప్రసంగించడానికి అనుమతించారు. దీంతో సభలో తీవ్ర గందరగోళం చెలరేగింది. బడ్జెట్ సమావేశాలు ప్రారంభిస్తూ ఉభయ సభలనూ ఉద్దేశించి రాష్ట్రపతి చేసిన ప్రసంగానికి ధన్యవాదాలు తెలియజేసే తీర్మానంపై చర్చకు ప్రధానమంత్రి సమాధానమిస్తూ, ఎన్నికల్లో వరుస అపజయాలను ప్రతిపక్షాలు జీర్ణించుకోలేకపోతున్నాయని, తనకు వ్యతిరేకంగా లోతుగా ప్రజల్లో ద్వేషాన్ని పెంచిపోషించినాగానీ తన గోతిని తవ్వే తరువాయి 2లో

## రాష్ట్రపతిని అవమానించారు

### రాహుల్ గాంధీపై మోదీ ఆరోపణ



లోక్‌సభలో రాహుల్‌గాంధీ కేంద్రమంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టూను ద్రోహి అంటూ అవమానిం చారని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆరోపిం చారు. రాజ్యసభలో ధన్యవాదాల తీర్మానంపై చర్చకు సమాధానమిస్తూ, కేంద్రమంత్రిని ద్రోహి అని విమర్శించడం సిక్కు మతానికే అవమానమన్నారు. అదేవిధంగా దేశంలో ఆదివాసీ జాతి నుండి వచ్చిన మొట్టమొదటి మహిళా రాష్ట్రపతి, అత్యున్నతమైన రాజ్యాంగ సంరక్షకురాలిని ప్రతిపక్షం లోక్‌సభలో అవమానించిందని అన్నారు. సభకు అంతరాయం కలిగినందుకు మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఇది కేవలం ఒక పేద ఆదివాసీ మహిళ రాష్ట్రపతికి మాత్రమే తరువాయి 2లో

### ప్రధాని సమాధానం లేకుండానే తీర్మానం ఆమోదం

లోక్‌సభలో గురువారం అనూహ్య ఘటన చోటు చేసుకుంది. ప్రతిపక్షాల తీవ్ర నిరసనల మధ్య, ప్రధాని నరేంద్ర మోదీ సంప్రదాయ ప్రసంగం లేకుండానే రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానాన్ని సభ ఆమోదించింది. ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన ధన్యవాద తీర్మాన సవరణలను లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఓటింగ్‌కు పెట్టినప్పుడు ప్రధాని సభలో లేరు. ఆ తరువాత ఆ సవరణలను తిరస్కరించారు. అనంతరం, జనవరి 28న పార్లమెంటు ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి చేసిన ప్రసంగంపై ధన్యవాద తీర్మానాన్ని స్పీకర్ చదివి వినిపించారు. ప్రతిపక్ష సభ్యుల నినాదాల మధ్య ఈ తీర్మానం మూజువాణి ఓటుతో ఆమోదం పొందింది. రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై జరిగిన చర్చకు ప్రధాని జవాబు ఇవ్వకుండా ఆమోదించడాన్ని రాజ్యాంగ నిపుణుడు పిడిటి ఆచార్య గతంలో ఎన్నడూ లేని పరిణామంగా వివరించారు. 2004లో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ సభలో ఉన్నప్పటికీ, అప్పటి ప్రతిపక్ష బిజెపితో కుదిరిన అవగాహన ప్రకారం ప్రసంగం చేయలేదని చెప్పారు. 'స్పీకర్ గారూ, రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానాన్ని నేరుగా ఓటింగ్‌కు పెట్టి ఏకగ్రీవంగా ఆమోదించాలని ఇరుపక్షాల రాజకీయ పార్టీల మధ్య ఒక అవగాహన కుదిరినట్లు నేను తెలుసుకున్నాను. కాబట్టి, దయచేసి ఆ తీర్మానాన్ని ఓటింగ్‌కు పెట్టాలని నేను మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాను' అని మన్మోహన్ సింగ్ 2004 జూన్ 10న అన్నారు.

## రైతాంగాన్ని అగాధంలోకి నెట్టొద్దు

- సార్వభౌమత్వానికి ముప్పు తలపెట్టొద్దు
- ఒత్తిళ్లకు తలొగ్గి రాయితీలిచ్చి జీవనోపాధి దెబ్బతీయొద్దు
- అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై సిపిఐ ఆగ్రహం

**న్యూఢిల్లీ:** అమెరికాతో భారత్ కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందం దేశ సార్వభౌమత్వానికి, రైతాంగానికి ముప్పు కలిగిస్తుందని సిపిఐ హెచ్చరించింది. పారదర్శకతసమానత్వం లేకుండా సర్దుకుపోవాలనేలా భారతీయ సాగుదారులను తీవ్ర ఒత్తిడికి గురిచేస్తూ... అమెరికాకు ఆర్థిక, వ్యూహాత్మక ప్రయోజనాలు కల్పించేలా ఈ ఒప్పందమున్నట్లు సిపిఐ జాతీయ కార్యదర్శి వర్గం ఒక ప్రకటనలో దుయ్యబట్టింది. మార్కెట్ విస్తరణ ప్రగల్భాల వెనుక దేశ వాణిజ్య, ఆర్థిక విధానాన్ని నీరుగార్చే చేదు నిజం దాగివుందని వ్యాఖ్యానించింది. ఏయే షరతులతో ఒప్పందం చేసుకున్నారో ప్రజలకు, పార్లమెంటుకు చెప్పాలని డిమాండ్ చేసింది. విదేశాల ప్రయోజనాల కోసం దేశ రైతాంగాన్ని అగాధంలోకి నెట్టవద్దని, బాహ్య ఒత్తిళ్లకు తలొగ్గి... మినహాయింపులు ఇచ్చి రైతుల జీవనోపాధికి హాని తలపెట్టవద్దని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. అమెరికాతో వాణిజ్య ఒప్పందం వల్ల కలిగే నష్టాల దృష్ట్యా ఆ దేశ ప్రయోజనాలకు తీసుకున్న నిర్ణయాలన్నీ మార్చుకోవాలని కోరింది. భారతీయ ఉత్పత్తులపై అమెరికా సుంకాల తగ్గింపును తరువాయి 2లో

## గ్రూప్ 1 అభ్యర్థులకు భారీ విజయం



### సింగిల్ బెంచ్ తీర్పును రద్దు చేసిన హైకోర్టు

ప్రజాపక్షం/హైదరాబాద్

గ్రూప్‌-1 కొలువులకు ఎంపికైన అభ్యర్థులకు హైకోర్టులో విజయం లభించింది. గ్రూప్‌-1 నియామకాలపై సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును పూర్తిగా రద్దు చేసింది. గ్రూప్‌-1 జనరల్ ర్యాంకింగ్ లిస్టును రద్దు చేస్తూ గతంలో సింగిల్ జడ్జి తీర్పును రద్దు చేయాలంటూ తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్, ఎంపికైన అభ్యర్థులు వేర్వేరుగా దాఖలు చేసిన అప్పీల్ పిటిషన్లను అనుమతించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఏకే సింగ్, మొహియుద్దీన్‌లతో కూడిన డివిజన్ బెంచ్ గురువారం 123 పేజీల కీలక తీర్పు వెలువరించింది. సింగిల్ జడ్జి తీర్పును రద్దు చేసింది. గ్రూప్‌-1 పరీక్షల నిర్వహణలో అక్రమాలు జరిగాయనే ఆరోపణలకు తగిన ఆధారాలు లేవని తేల్చింది. అవకతవకలు జరిగినట్లుగా ఆధారాలు కూడా లేవని స్పష్టం చేసింది. గ్రూప్‌-1 జనరల్ ర్యాంకింగ్ లిస్టును రద్దు చేయడమే కాకుండా తరువాయి 2లో

## బొగ్గు గనిలో భారీ పేలుడు...

## 18మంది కూలీలు మృతి

- శిథిలాల కింద చిక్కుకుపోయిన మరికొందరు
- మేఘాలయలోని తూర్పు జైంతియా హిల్స్ జిల్లాలో విషాద ఘటన
- సహాయక చర్యలు చేపట్టిన విపత్తు బృందాలు



**షిల్లాంగ్ :** మేఘాలయలో అక్రమ బొగ్గుగని 18మంది కూలీల ప్రాణాలను పొట్టన పెట్టుకుంది. గురువారం ఉదయం ఓ బొగ్గు గని తవ్వకాల సమయంలో చోటుచేసుకున్న ఒక భారీ పేలుడు దుర్ఘటనలో 18మంది కూలీలు దుర్మరణం చెందారు. మేఘాలయ రాష్ట్రం తూర్పు జైంతియా హిల్స్ జిల్లాలో ఈ ఘోర ప్రమాద ఘటన చోటుచేసుకుంది. కాగా, మరికొంతమంది కూలీలు కూడా గనిలో చిక్కుకుపోయి ఉంటారని మేఘాలయ డిజిపి ఐ.నాన్‌గ్రాంగ్ చెప్పారు. మృతులు, చిక్కుకుపోయిన వారిలో ఎక్కువ మంది అసోంకు చెందిన వారుగా భావిస్తున్నట్లు తెలిపారు. సమాచారం అందిన వెంటనే సంఘటనా తరువాయి 12లో

## 12 మంది మావోయిస్టులు లొంగుబాటు

- వారిపై సమష్టిగా రూ.46 లక్షల రివార్డు
- లొంగిపోయిన వారిలో ఎనిమిది మంది మహిళలు
- బిజాపూర్ ఎన్‌కౌంటర్‌లో సీనియర్ మావోయిస్టు మృతి



**బిజాపూర్:** ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు దఫాదఫాలుగా లొంగుపోతున్నారు. తాజాగా బిజాపూర్ జిల్లాలో గురువారం రూ. 46 లక్షల సామూహిక రివార్డు కలిగిన పన్నెండు మంది నక్సలైట్లు పోలీసుల ఎదుట లొంగిపోయారని ఒక సీనియర్ అధికారి తెలిపారు. మావోయిస్టుల 'సౌత్ సబ్ జోనల్ బ్యూరో'కు చెందిన ఈ క్యాడర్లలో ఎనిమిది మంది మహిళలు ఉన్నారని, వీరు బస్తర్ పోలీసుల 'పూనా మార్గెం' (పునరావాసం నుండి సామాజిక పునరేకీకరణ వరకు) కార్యక్రమం కింద ఇక్కడ సీనియర్ పోలీసు అధికారుల ముందు లొంగిపోయారని బిజాపూర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ జితేంద్ర కుమార్ యాదవ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ లొంగుబాటు, పునరావాస విధానం కూడా వారిని ప్రభావితం చేసిందని ఆ అధికారి చెప్పారు. వీరిలో, డివిజనల్ కమిటీ సభ్యుడు, మావోయిస్టుల కటేకల్యాణ్ ఏరియా కమిటీ ఇన్‌ఛార్జి అయిన సోమడు మడ్కామ్ (42), అలాగే వేర్వేరు యూనిట్లకు చెందిన పార్టీ సభ్యులైన హుంగి కుంజమ్ (19), తరువాయి 2లో

## సైబర్ నేరాల నివారణే లక్ష్యం

- సైబర్ సెక్యూరిటీ కాంక్లేవ్ 'షీల్డ్ 2026'ను ప్రారంభించిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు



ప్రజాపక్షం/హైదరాబాద్

సైబర్ నేరాల నివారణే లక్ష్యంగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రతిష్టాత్మక సైబర్ సెక్యూరిటీ కాంక్లేవ్ 'షీల్డ్ 2026' రెండవ ఎడిషన్‌ను హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని టిజిసిసిసిలో బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, డిజిపి బి. శివధర్ రెడ్డితో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉన్నతాధికారులు, వివిధ రాష్ట్రాల లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు, పరిశ్రమల ప్రతినిధులు, తరువాయి 12లో






## టీచర్లకు న్యాయం చేయండి

- దేశవ్యాప్తంగా ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలి
- ఎఐజెఎసిటిఒ డిమాండ్
- ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద భారీ ధర్నా

ప్రజాపక్షం/హైదరాబాద్

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)పై సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలోకేంద్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే ఆర్‌టిఈ చట్టాన్ని సవరించడంతో కోర్టు తీర్పుపై రివ్యూ పిటిషన్ దాఖలు చేసి ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని ఆల్ ఇండియా జాయింట్ యాక్షన్ కమిటీ ఆఫ్ టీచర్స్ ఆర్గనైజేషన్స్ (ఎఐజెఎసిటిఒ) నేతలు డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎఐజెఎసిటిఒ ఆధ్వర్యంలో గురువారం న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద భారీ ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంఘాల నేతలు సిఎన్.భారతి (ఎస్‌టిఎఫ్ఐ), కె.నరసింహారెడ్డి (ఎఐఎస్‌టిఎఫ్), బస్వరాజ్ గురికర్ (ఎఐపిటిఎఫ్), సి.ఎల్.రోజ్ (ఎఐఎఫ్‌టిఒ) తరువాయి 2లో

### డిజిపి నియామకంలో జాప్యం

## మా దృష్టికి తేండి

- యుపిఎస్‌సికి సుప్రీంకోర్టు అధికారం
- తెలంగాణలో శాశ్వత డిజిపి నియామక సిఫారసు కోసం సమావేశం ఏర్పాటుకు నాలుగు వారాలు గడువు

**న్యూఢిల్లీ :** డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డిజిపి) నియామకాల విషయంలో సుప్రీంకోర్టు ఒక కీలక ఆదేశం జారీ చేసింది. డిజిపి నియమాకం ప్రతిపాదనలను పంపించే విషయంలో పలు రాష్ట్రాలు చేస్తున్న తీవ్రజాప్యాన్ని అత్యున్నత న్యాయస్థానం తీవ్రంగా పరిగణించింది. అటువంటి సందర్భాలను తన దృష్టికి తీసుకురావడానికి గురువారం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యుపిఎస్‌సి)కు అధికారం ఇచ్చింది. 2017లో చివరి డిజిపి పదవీ విరమణ చేసిన తెలంగాణకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ నియామకానికి సిఫార్సు కోసం యుపిఎస్‌సి సమావేశం తరువాయి 12లో

# నాలుగేళ్ళలో 55 వేలమంది సైనికులు మృతి

## సంఖ్య తక్కువ చెబుతున్న జెలెన్స్కీ!

**కీవ్:** నాలుగేళ్ళుగా జరుగుతున్న యుద్ధంలో 55,000 మంది సైనికులు మరణించారని ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ ప్రకటించారు. ఫ్రాన్స్ ఇన్ఫోసంస్థకు బుధవారం ఇచ్చిన ఇంటర్వ్యూలో జెలెన్స్కీ మృతులసంఖ్యను 55వేలగా పేర్కొన్నారు. యుద్ధభూమిలో దేశం నలుదిశలా భారీసంఖ్యలో సైనికులు జాడ తెలియకుండా పోయారని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంకోసం ప్రాణాలు అర్పించిన సైనికులకు ఆయన నివాళులు అర్పించారు. తీవ్ర సంతాపం ప్రకటించారు. ఇప్పటికే రెండు దేశాలు మూడు విడతలుగా మరణించిన సైనికుల మృతదేహాలను, ఖైదీలుగా ఉన్న సైనికులను ఇచ్చిపుచ్చుకున్నాయని, ఇక మరో విడత కూడా ఇరు దేశాలూ ఖైదీల పరస్పర మార్పిడి కార్యక్రమాన్ని చేపడతాయని చెప్పారు. అబుధాబిలో చర్చలు ప్రయోజనాత్మకంగా ఉన్నాయన్నారు. అబుధాబిలో చర్చలవేళ జెలెన్స్కీ పైవిధంగా స్పందించారు. ఐతే రష్యన్ పత్రిక మాత్రం జెలెన్స్కీ పత్రికను తీవ్రంగా తప్పుపట్టింది. వాస్తవంగా మరణించిన సైనికులకంటే ఆయన సంఖ్య తక్కువచేసి చూపిస్తున్నారని విశ్లేషణ ప్రచురించింది.
ఇరుదేశాలు నెలవారీ ప్రాతిపదికపై సైనికుల అవశేషాలను ఇచ్చిపుచ్చుకుంటున్నాయని, ఈ మేరకు చూస్తే జెలెన్స్కీ దేశానికి తిప్పిపంపిన మృతదేహాల లెక్కలు జోడించకుండా గణాంకాలను ప్రకటిస్తున్నారని పేర్కొంది. గతనెలలో ఎన్‌బిసికి ఇచ్చిన ఇంటర్వ్యూలో 46 వేలమంది సైనికులు మరణించినట్లు జెలెన్స్కీ చెప్పారని, 9వేలమందికంటే ఎక్కువ మృతదేశాలు యుద్ధభూమి నుండి ఉక్రేన్‌కు తిరిగి వెళ్ళాయని పత్రిక పేర్కొంది.

# లొంగుబాటు

(మొదటి పేజీ తరువాయి)

పాయకి కుంజమ్ (22)లకు ఒక్కొక్కరికి రూ. 8 లక్షల రివార్డు ఉంది. మరో ముగ్గురు క్యాడర్లకు ఒక్కొక్కరికి రూ. 5 లక్షలు, ఒక క్యాడర్‌కు రూ. 2 లక్షలు, ఐదుగురు క్యాడర్లకు ఒక్కొక్కరికి రూ. 1 లక్ష చొప్పున రివార్డు ఉందని ఆయన తెలిపారు. వారు ఒక ఎకె 47 రైఫిల్, రెండు సెల్ఫ్ లోడింగ్ రైఫిల్స్ (ఎస్‌ఎల్‌ఆర్), 250 జిలెటిన్ స్టిక్స్, 400 డిటోనేటర్లు, మందుగుండు సామగ్రితో నింపిన ఒక ప్లాస్టిక్ డ్రమ్, ఒక కార్డెక్స్ వైర్ కట్టను కూడా లొంగిపోయినట్లు ఆ అధికారి చెప్పారు. లొంగిపోయిన నక్సలైట్లందరికీ తక్షణ సహాయంగా ఒక్కొక్కరికి రూ. 50,000 చొప్పున అందజేస్తామని, ప్రభుత్వ విధానం ప్రకారం వారికి తదుపరి పునరావాసం కల్పిస్తామని ఆయన తెలిపారు. బిజాపూర్‌లో జనవరి 1, 2024 నుండి ఇప్పటివరకు 888 మంది నక్సలైట్లు హింసను విడనాడి ప్రధాన స్రవంతిలోకి తిరిగి వచ్చారని, 1,163 మందిని అరెస్టు చేశారని, వేర్వేరు ఎన్‌కౌంటర్లలో 231 మందిని హతమార్చారని ఆ అధికారి తెలిపారు.

**బిజాపూర్ ఎన్‌కౌంటర్‌లో సీనియర్ మావోయిస్టు మృతి**

ఛత్తీస్‌గఢ్‌లో ఒకవైపు మావోయిస్టుల లొంగుబాటు పర్వం కొనసాగు తుండగా, మరోవైపు ఎన్‌కౌంటర్లు జరుగుతున్నాయి. బిజాపూర్ జిల్లాలో గురువారం భద్రతా బలగాలతో జరిగిన ఎదురుకాల్పుల్లో తలపై రూ. 8 లక్షల రివార్డు ఉన్న ఒక సీనియర్ నక్సలైట్ హతమయ్యాడని పోలీసులు తెలిపారు. అతడిని నిషేధిత కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మావోయిస్ట్) దక్షిణ బస్తర్ డివిజన్‌కు చెందిన డివిజనల్ కమిటీ సభ్యుడు ఉధమ్ సింగ్‌గా గుర్తించారు. సింగ్ దక్షిణ బస్తర్ డివిజన్‌లోని ప్లాటూన్ నంబర్ 13కు ఇన్‌ఛార్జ్‌గా ఉన్నాడని అధికారి తెలిపారు. తర్రెమ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అటవీ, కొండ ప్రాంతాలలో సింగ్, ఇతర సాయుధ కేడర్‌ల ఉనికి గురించి అందిన నిర్దిష్ట నిఘా సమాచారం ఆధారంగా, భద్రతా సిబ్బంది ఆపరేషన్‌ను ప్రారంభించారని బిజాపూర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ జితేంద్ర కుమార్ యాదవ్ తెలిపారు. ఈ ఆపరేషన్‌లో డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ (డిఆర్‌జి), సిఆర్‌పిఎఫ్ ఉన్నత కోబ్రా (కమాండో బెటాలియన్ ఫర్ రిజల్యూట్ యాక్షన్) కమాండోలు పాల్గొన్నారని ఆయన చెప్పారు. 'ఉదయం 7.30 గంటల ప్రాంతంలో భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య కాల్పులు జరిగాయి. కాల్పులు ఆగిపోయిన తర్వాత, ఉధమ్ సింగ్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నాం. ఎన్‌కౌంటర్ స్థలం నుండి ఒక ఎకె 47 రైఫిల్, 28 రౌండ్లతో రెండు మ్యాగజైన్‌లు, కార్డెక్స్ వైర్, ఒక వైర్‌లెస్ సెట్, ఒక మొబైల్ ఫోన్, పౌచ్, బ్యాక్‌ప్యాక్, టిఫిన్ బ్యాగ్, ఇతర మావోయిస్టు వస్తువులను స్వాధీనం చేసుకున్నాం' అని ఎస్‌పి తెలిపారు. బిజాపూర్ జిల్లాలోని బసగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొట్టగూడ గ్రామానికి చెందిన సింగ్, 2002–03లో పార్టీ సభ్యుడిగా మావోయిస్టు సంస్థలో చేరాడు. ఛత్తీస్‌గఢ్–తెలంగాణ సరిహద్దులో చురుకుగా ఉన్నాడు. గత మూడేళ్లుగా అతను పామెడ్ ఏరియా కమిటీతో సంబంధం కలిగి ఉన్నాడని అధికారి తెలిపారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో అతనిపై నక్సలైట్ సంఘటనలకు సంబంధించిన తొమ్మిది కేసులు నమోదయ్యాయి. తర్రెమ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గుండం అటవీ ప్రాంతంలో 2023లో పోలీసు బృందంపై జరిగిన దాడి, బసగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని పుట్‌కెల్–చిపుర్‌భట్టి అడవిలో 2024లో జరిగిన పోలీసుమావోయిస్టుల ఎదురుకాల్పులు, 2024లో జిద్పల్లి క్యాంప్‌పై జరిగిన దాడిలో అతను పాల్గొన్నట్లు ఆరోపణలు ఉన్నాయి అని ఎస్పీ తెలిపారు.

# డాన్‌బాస్‌ను రష్యా భూభాగంగా ప్రకటించాలి

**అబుదాబి చర్చల్లో అదే ప్రధానాంశం!**
**318 మంది యుద్ధ ఖైదీల విడుదల**
**మళ్ళీ సమావేశానికి త్వరలో తేదీలు ఖరారు**

**మాస్కో :** నాలుగు సంవత్సరాలుగా ఉక్రేన్‌లో జరుగుతున్న యుద్ధం ముగించేపకు అబుదాబిలో వరుసగా రెండోరోజు గురువారం జరిగిన త్రైపాక్షిక చర్చల్లో సానుకూల పరిణామాలు ఏర్పడ్డాయి. కొద్దివారాల్లో ఉక్రేన్‌లో శాంతికి మరింత ప్రగతి సాధించగలమని అమెరికా ప్రతినిధులు చెప్పారు. 314 మంది ఖైదీలను పరస్పరం మార్పిడి చేసుకోవడానికి ఉక్రేన్–రష్యా ప్రతినిధులు మొదటిరోజు చర్చల్లో అంగీకరించారు. రెండోరోజు గురువారం చర్చల నాటికి అంగీకారం ప్రకారం రెండు దేశాలు ఖైదీలను విడుదల చేశాయని టాస్‌వార్తా సంస్థ ప్రకటించింది. ఐతే వీరు ఇంకా ఆ దేశాలకు చేరుకోవాల్సి ఉంది. 157 మంది రష్యా సైనికులను ఉక్రేన్ విడుదల చేయగా, రష్యా కూడా 157 మంది యుద్ధ ఖైదీలను జైళ్ళ నుండి విడుదల చేసింది. ముగ్గురు రష్యన్ పౌరులను, కుర్స్క్ రీజియన్ పౌరుణ్ణి కూడా ఉక్రేన్ అదనంగా విడుదల చేసింది. ఐతే వీరికి ఇంకా మానసిక,వైద్య చికిత్సలు చేసి స్వదేశాలకు పంపుతారని టాస్ వార్తాసంస్థ ప్రకటించింది. పూర్తయ్యాక ఒక ఉమ్మడి ప్రకటన కాకుండా చర్చలకు ఆతిథ్యం ఇచ్చిన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ స్వయంగా ఒక ప్రకటనను తర్వాత విడుదల చేస్తుంది. రెండు దేశాలూ పరస్పర దాడులు, యుద్ధ ఆరోపణలు చేసుకుంటున్నప్పటికీ, చర్చలు ఆటంకం లేకుండా మధ్యవర్తుల సహాయంతో చర్చలు కొనసాగాయి. 314 మంది యుద్ధ ఖైదీలను విడుదల చేసేందుకు రెండు దేశాలు అంగీకరించాయని, అబుదాబిలోనే తదుపరి చర్చలు కొనసాగించేందుకు తిరిగి కొత్త తేదీలను నిర్ణయించేందుకు కూడా రెండు దేశాల ప్రతినిధులు అంగీకరించారని డోనాల్డ్ ట్రంప్ ప్రత్యేకదూత స్టీవ్ విట్‌కాఫ్ ఎక్స్ వేదికగా చెప్పినట్లు టాస్ వార్తాసంస్థ ప్రాథమికవార్తగా తెలియజేసింది. పరస్పర ప్రయోజనాత్మకంగా చర్చలు కొనసాగుతున్నందుకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా డాన్‌బాస్ ప్రాంతాన్ని అన్ని దేశాలూ గుర్తించేవిధంగా రష్యా భూభాగంగా ప్రకటించాలన్నదే చర్చల్లో ప్రధాన ఒప్పంద ప్రతిపాదనగా రష్యా ప్రతినిధులు భావిస్తున్నారు. చర్చలు ప్రధానంగా వివాదాస్పద భూభాగాల విషయంపైనే జరుగుతున్నాయి. దీనికితోడు ఈ చర్చలపట్ల అమెరికా–రష్యా ప్రతినిధులు ఉన్నంతవరకూ సానుకూల స్పందనలు వ్యక్తం చేయడం కొత్త పరిణామం. చర్చలు ప్రయోజనాత్మకంగా జరిగాయని జెలెన్స్కీ కీవ్ నుండి ప్రకటించారు.
నిజమైన శాంతిసాధన దిశగా చర్చలు ముందుకు సాగాలని ఆయన కోరారు. రష్యా ప్రతినిధులు కూడా చర్చలపట్ల ప్రాథమికంగా సంతృప్తి వ్యక్తం చేశారు. యుద్ధ దాడులు ఆపేవిధంగా రష్యాపై ఒత్తిడి తీసుకురావాలని ఆయన మిత్రదేశాలను, మధ్యవర్తి దేశాలను సోషల్ మీడియా వేదికగా కోరారు. అమెరికా తరపున స్టీవ్ విట్‌కాఫ్, జారెడ్ కుష్నెర్, ఉక్రేన్ రక్షణ మంత్రి రుస్టెమ్ ఉమరోవ్, జెలెన్స్కీ కార్యాలయ అధిపతి కిరిల్ బుడనోవ్, రష్యా సైనిక విభాగం అధిపతి అడ్మిరల్ ఇగోర్ కోస్ట్యుకోవ్ బృందం తదితరులు పాల్గొన్నారు. యూరప్‌లో నాటో కమాండర్ జనరల్ అలెక్స్ గ్రైన్క్‌విచ్ తదితరులు చర్చల్లో పాల్గొన్నారు.
శాంతి ఒప్పందం కుదిరిన తర్వాత కూడా రష్యా తమపై ఎలాంటి దాడులూ చేయకుండా భద్రతా హామీలు కావాలని ఈ నేపథ్యంలో జెలెన్స్కీ విజ్ఞప్తి చేశారు. చర్చల్లో నిజమైన పురోగతి ఉండాలన్నారు. ఒకవైపు చర్చలు జరుగుతుంటే రెండోవైపు రష్యా దాడులు కూడా కొనసాగిస్తోందన్నారు. శీతాకాలంలో ఇంధన వనరులపై దాడులవల్ల లక్షలమంది ప్రజలు విద్యుత్ కొరతతో, హీటర్లు లేక చలి బారినపడ్డారని సోషల్ మీడియాలో పోస్టింగ్ పెట్టారు. ఉక్రేన్ తూర్పు, దక్షిణ ప్రాంతాలలో రష్యాతో 1000 కి.మీ పొడవునా సరిహద్దులు ఉన్నాయి.

**చర్చలు అడ్డుకునేందుకు ఇ.యు– బ్రిటన్ యత్నం**

ఉక్రేన్‌లో శాంతి యూరప్‌కు ఇష్టంలేదని, యూరోపియన్ శక్తులు ఈ చర్చల ప్రగతిని తప్పుతోవ పట్టించేందుకు తమ యత్నాలను ముమ్మరం చేశాయని పుతిన్ దూత, చర్చల్లో కీలక ప్రతినిధి కిరిల్ దిమిత్రియేవ్ అబుదాబిలో గురువారం పాత్రికేయులవద్ద విమర్శించారు. ముఖ్యంగా బ్రిటన్, యూరప్ దేశాలే చర్చల్లో పురోగతిని అడ్డుకోవాలని చూస్తున్నాయన్నారు. చర్చలు ప్రధానంగా వివాదాస్పద భూభాగాల గురించే జరుగుతున్నాయని ఆయన చెప్పారు. అదేవిధంగా అమెరికా–రష్యా మధ్య కూడా ఆర్థిక సంబంధాల పునరుద్ధరణకు రెండు దేశాలు క్రియాశీల కృషి చేస్తున్నాయని చెప్పారు.
ఈ చర్చల్లో ఖచ్చితంగా సానుకూలమైన ప్రగతి ఉందని, చర్చలు ముందుకు వెళుతున్నాయని అన్నారు.



# చైనాకు పోటీగా అమెరికా 'ప్రాజెక్ట్ వాల్ట్'

**వాషింగ్టన్ :** సమకాలీన సాంకేతిక ప్రపంచంలో ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్‌కు అవసరమైన కీలక ఖనిజవనరుల పరిశ్రమలో ప్రపంచవ్యాప్తంగా చైనా అధిపత్యాన్ని దెబ్బతీసేందుకు ''ప్రాజెక్ట్ వాల్ట్'' పేరుతో ట్రేడ్‌జోన్ ఏర్పాటుకు అమెరికా తొలి అడుగులు వేసింది. ఈ మేరకు మెక్సికో,జపాన్,యూరోపియన్ యూనియన్‌లతో కార్యాచరణ ఒప్పందాలు చేసుకుంది. గడచిన నాలుగు రోజులుగా డోనాల్డ్ ట్రంప్ ప్రాజెక్టు వాల్ట్ గురించి అట్టహాసంగా చెబుతున్నారు. గురువారం వాషింగ్టన్‌లో అనేక భాగస్వామ్యదేశాల సమక్షంలో అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్,విదేశీమంత్రి మార్కో రుబియో ఈ మినరల్ మినిస్టీరియల్ ఈవెంట్‌లో పాల్గొన్నారు. యూరప్, ఆఫ్రికా,ఆసియాల నుండి అనేక దేశాల ప్రతినిధులు సదస్సులో పాల్గొన్నారు. ఏడాదికాలంగా అమెరికా–చైనా మధ్య జరుగుతున్న వాణిజ్య యుద్ధంద్వారా ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలకు చైనాయే ఈ ఖనిజాల సరఫరాలో కీలకంగా ఉందన్న విషయం ప్రధానాంశంగా బయటకు వచ్చింది. అమెరికా చేస్తున్న స్వీయ రక్షణ చర్యలకు ఈ ప్రాజెక్టు ప్రతిరూపం. ప్రాజెక్టు వాల్ట్ పేరుతో 12 బిలియన్ డాలర్లు విలువైన ఒక ఖనిజ నిల్వను సృష్టిస్తున్నట్లు ట్రంప్ ఇప్పటికే చెప్పారు. అంతరిక్షం, స్మార్ట్‌ఫోన్లు,ఆటోమొబైల్స్,ఎలక్ట్రానిక్స్,పవన విద్యుత్, రక్షణ పరికరాలు,అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ, జెట్ ఇంజన్ల తయారీ,సెల్‌ఫోన్‌ల తయారీ, ఇతర అవసరాల నిమిత్తం ఉపయోగించే ఖనిజాల కొరత రాకుండా తక్కువ ఖర్చుతో, నామ మాత్రపు టారిఫ్‌లతో చైనాకు వ్యతిరేకంగా తనను తాను రక్షించుకునేందుకు ఈ ప్రాజెక్టు చేపట్టింది. ఈ సదస్సులో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, అర్జెంటీనా దేశాలు అమెరికాతో కీలక ఖనిజ ఒప్పందాలపై సంతకాలు చేశారు. దక్షిణ కొరియాకూడా ఈ జాబితాలో ఉంది. భాగస్వామ్యదేశాలు,మిత్రులు ఒక ట్రేడింగ్ బ్లాక్‌గా ఏర్పడి అమెరికా పారిశ్రామిక శక్తి సత్తా చాటేందుకు భరోసాగా ఉండాలని జె.డి.వాన్స్ సదస్సు ప్రారంభంలో చెప్పారు.

# ఫెవికాల్ బంధం

(మొదటి పేజీ తరువాయి)

శంకుస్థాపనలు చేశారు. చొప్పదండి మండలం గుమ్లాపూర్‌లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన ప్రగతి బాట కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అధ్యక్షతన జరిగిన ఈ సభలో జిల్లా ఇంచార్జీ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో పాటు మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, విజయ రమణారావు, మక్కాన్ సింగ్, సంజయ్ కుమార్, రాజేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, సుడా చైర్మన్ కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేశం, వెలిచాల రాజేందర్ రావు, అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు చేస్తామని కరీంనగర్ గడ్డపై నుంచి సోనియా గాంధీ మాట ఇచ్చారని, ఇచ్చిన మాటకు కట్టుబడి ఎన్ని అవాంతరాలు ఎదురైనా సర్వం కోల్పోయినా.. ఇచ్చిన మాట ప్రకారం సోనియా గాంధీ తెలంగాణ ఏర్పాటు చేశారన్నారు. పదేళ్ల అంది వచ్చిన అధికారాన్ని అవకాశాన్ని ఉపయోగించుకుని బిఆరెస్ నాయకులు వేల కోట్లు సంపాదించుకున్నారు తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. పదేళ్ల తర్వాత ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుంటే ఇప్పుడు వాళ్లు విషం చిమ్ముతున్నారని, పదేళ్లలో కనీసం పేదలకు డబుల్ బెడ్రూంలు కూడా ఇవ్వలేదని, ప్రజా ప్రభుత్వంలో పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నామని అన్నారు. రైతులకు ఉచిత కరెంట్ కాంగ్రెస్ పార్టీ పేటెంట్ అని అన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ. 10 లక్షల వరకు పేదలకు ఉచిత వైద్యం అందిస్తున్నామన్నారు. గతంలో పాలమూరుకు వచ్చిన ప్రధాని మోదీ పాలమూరు రంగారెడ్డిని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటిస్తామన్నారు. ఢిల్లీ నుంచి పాలమూరుకు వచ్చిన జాతీయ అధ్యక్షుడు ఆ విషయాన్ని ఎందుకు ప్రస్తావించలేదని ప్రశ్నించారు. మెట్రో రైలు రెండో విడత గురించి మాట్లాడలేదని, కాళేశ్వరం విచారణపై మాట్లాడలేదు. మూసీ ప్రక్షాళన నిధుల ఊసు ఎత్తలేదు. ఏం మొహం పెట్టుకుని బిజెపి జాతీయ నాయకులు రాష్ట్రానికి ప్రచారానికి వస్తున్నారు..? అని విమర్శించారు. బండి సంజయ్, కిషన్ రెడ్డి, డికె అరుణ జాతీయ నాయకులందరినీ తీసుకురండీ, కాంగ్రెస్ కార్యకర్తలు మున్సిపల్ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా బిజెపిని గెలవనీయరని అన్నారు.
రెండేళ్లలో ఏం చేశారని బిజెపి, బిఆరెస్ మమ్మల్ని ప్రశ్నిస్తోందని, పదేళ్లలో బిఆర్‌ఎస్ ఏం చేసింది.. పన్నెండేళ్లల్లో మోదీ ఏం చేశారో చర్చిద్దాం రండని సవాల్ విసిరారు. రెండేళ్లలో మేం ఏం చేశామో చెబితే మీ గుండెలు పగులుతాయని, నిరుద్యోగులకు 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశామన్నారు. వంద నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నామని, హాస్టల్ విద్యార్థులకు కాస్మొటిక్, డైట్ చార్జీలు పెంచామన్నారు. చొప్పదండి నియోజకవర్గంలో డిగ్రీ కాలేజీ నిర్మిస్తున్నామన్నారు. రైతులకు 25 లక్షల 35 వేల మంది రైతులకు రూ.2 లక్షలు రుణమాఫీ చేశామన్నారు. 9 రోజుల్లో 9 వేల కోట్లు రైతు భరోసా అందించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని అన్నారు. కేవలం రైతుల కోసమే రెండేళ్లలో లక్ష కోట్లు ఖర్చు చేశామన్నారు. వరి వేస్తే ఉరి అని మీరంటే.. రైతులు పండించిన ప్రతీ గింజ కొంటుమన్నారు. సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ అందిస్తున్నామన్నరు. ఆడబిడ్డలు కట్టుకునే చీరల్లో కూడా గత ప్రభుత్వంలో కమిషన్లు తీసుకున్నారని విమర్శించారు. మా ప్రభుత్వం ఆడబిడ్డలకు ఆర్‌టిసి బస్సులో ఉచిత ప్రయాణ సౌకర్యం కోసం రెండేళ్లల్లో రూ. 9 వేల కోట్లు ఖర్చు చేశామన్నారు. రెండేళ్లలో రూ. 27 కోట్లు మహిళలకు రుణాలు అందించి వ్యాపారంలో ప్రోత్సహిస్తున్నామని, ఆర్‌టిసి బస్సులకు యజమానులను చేశామన్నారు. రాష్ట్రంలో సహజవనరులను దోపిడి చేసి మున్సిపల్ ఎన్నికల్లో గెలవాని చూస్తున్నారని విమర్శించారు. 2027 లో రాబోతున్న గోదావరి పుష్కరాల సందర్భంగా బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి పరివాహక ఆలయాలన్నిటీని అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఎకో టూరిజంను అభివృద్ధి చేసి పర్యాటక క్షేత్రంగా తీర్చి దిద్దుతామన్నారు. బిఆరెస్ ఎన్ని శాపనార్థాలు పెట్టినా మరో ఎనిమిదేళ్లు అధికారం మాదేనని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణను దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని, కరీంనగర్ కు ఔటర్ రింగ్ రోడ్డు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. వరంగల్, కరీంనగర్ జంట నగరాలుగా అభివృద్ధి చేసి రెండింటి మధ్యలో డంప్ యార్డు ఏర్పాటు చేసి విద్యుత్ ఉత్పత్తి చేస్తామన్నారు. బండి సంజయ్ మాపై రంకెలేయడం కాదు. కాళేశ్వరంపై సిబిఐ విచారణ చేయించి చర్యలు తీసుకోవాలన్నారు. ఢిల్లీ నుంచి కరీంనగర్ మున్సిపల్ అభివృద్ధికి ఏం నిధులు తెచ్చారో బండి సంజయ్ చెప్పాలన్నారు. ఎవ్వరు ఏం ఇచ్చినా ఇవ్వకపోయినా తెలంగాణ అభివృద్ధి ఆగదని, మున్సిపల్ ఎన్నికల్లో మంచి వాళ్లను ఎన్నుకోండి. మున్సిపల్ ఎన్నికల్లో కరీంనగర్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరాలని పిలుపునిచ్చారు. అంతకుముందు మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పొన్నం ప్రభాకర్ దుద్దిళ్ళ శ్రీధర్ బాబు తుమ్మల నాగేశ్వరరావు ప్రసంగించారు. కార్యక్రమంలో చివరగా 2676 మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ.110 కోట్ల 10 లక్షల 12 వేల రూపాయల చెక్కులను ముఖ్యమంత్రి పంపిణీ చేశారు.

# భారీ విజయం

(మొదటి పేజీ తరువాయి)

మెయిన్స్ జవాబు పత్రాలు తిరిగి మూల్యాంకనం చేయాలని టీజీపీఎస్సీని ఆదేశిస్తూ సింగిల్ జడ్జి వెలువరించిన తీర్పును రద్దు చేసింది. జవాబు పత్రాలు తిరిగి మూల్యాంకనం చేయాలని లేకుంటే తిరిగి మెయిన్స్ పరీక్ష నిర్వహించాలన్న తీర్పు చెల్లదని తేల్చింది. సింగిల్ జడ్జి తీర్పు అమలును పూర్తిగా నిలిపివేసింది.

**తీర్పులో ఏముందంటే..**

గ్రూప్–1 మెయిన్స్ పరీక్ష నిర్వహణ, మూల్యాంకన విధానం, హాల్ టికెట్ల జారీ, పరీక్ష కేంద్రాల కేటాయింపు తదితర అంశాలపై ఆరోపణలకు ఆధారాలు లేవని డివిజన్ బెంచ్ తీర్పులో వివరించింది. ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షలకు రెండు హాల్ టిక్కెట్లు ఇవ్వడం వల్ల ఎవరికీ నష్టం వాటిల్లలేదని, ఈ విధానం ఇతర పరీక్షల్లో కూడా అమలు జరిగిందని తెలిపింది. అభ్యర్థికి అన్యాయం జరిగినట్లు ఆదారాలు చూపలేదంది. పరీక్ష కేంద్రాల కేటాయింపులో మహిళా అభ్యర్థులను ప్రత్యేక కేంద్రాలకు కేటానయింపు వివక్ష కాబోదని,దివ్యాంగుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారని తెలిపింది. పరీక్షకు హాజరైన అభ్యర్థుల సంఖ్యలో తేడాలున్నాయని చెప్పి అక్రమాలు జరిగాయంటే ఎలాగని ప్రశ్నించింది. రెండు సార్లు చేశాక మార్కుల్లో వ్యత్యాసం ఉంటే మూడో మూల్యాంకం చేయడం వల్ల నిష్పక్షపాతంగా జరిగిందని, మొదటి, రెండో మూల్యాంకనాల్లో 15 శాతానికి మించి మార్కుల్లో తేడా ఉంటే మూడో మూల్యాంకనం చేయడం పారదర్శకతకు నిదర్శమని స్పష్టం చేసింది. వ్యక్తిగత ఆరోపణల ఆధారంగా పరీక్షల ప్రక్రియ ఆగడానికి వీల్లేదని చెప్పింది. పరీక్షల్లో అక్రమాలు, ప్రశ్నాపత్రాల లీక్, సామూహిక కాపీయింగ్ వంటి జరిగాయని ఎవరూ చెప్పలేదని, ఆ తరహా ఆధారాలు కూడా ఎవరూ చూపలేదని తెలపింది. పోస్టుల భర్తీ వ్యవహారంలో కోర్టు జోక్యానికి కచ్చితమైన ఆధరాలు ఉండాలంది. కాబట్టి సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును రద్దు చేస్తున్నట్లు డివిజన్ బెంచ్ ప్రకటించింది. గ్రూప్–1 పరీక్షల నిర్వహణ, మూల్యాంకనంలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ అనుసరించిన విధానాలు, నిబంధనలు చట్టబద్ధంగానే ఉన్నాయని ధర్మాసనం తేల్చింది. పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు పరీక్షల నిర్వహణ, మూల్యాంకన విధానాలను నిర్ణయించే స్వేచ్ఛ ఉందని తేల్చి చెప్పింది. పరీక్షల నిర్వహణలో అక్రమాలు, జరిగాయనే ఆరోపణలకు కచ్చితమైన ఆధారాలు లేనప్పుడు, తీవ్ర స్థాయిలో ఉన్నాయని చెబుతున్న లోపాలు రుజువుకానప్పుడు కోర్టులు జోక్యం చేసుకోరాదని వెల్లడించింది. ఈ మేరకు సుప్రీం కోర్టు తీర్పులు కూడా ఉన్నాయని వాటిని ఉదహరించింది. గ్రూప్–1 మెయిన్స్ పరీక్షల నిర్వహణ వ్యవహారంలో పరీక్ష మొత్తం న్యాయసమ్మతంగా జరగలేదనే ఆరోపణలకు ఆధారలు లేవని అభిప్రాయపడింది. అభియోగాలను నిర్ధారించే స్థాయిలో ఆధారాలు లేవని వెల్లడించింది.

# అగాధంలోకి నెట్టొద్దు

(మొదటి పేజీ తరువాయి)

గొప్ప ప్రయోజనంగా చేస్తున్న ప్రచారాన్ని ఖండించింది. ఈ మినహాయింపులు పరిమితం... షరుతలభరితమని సిపిఐ స్పష్టంచేసింది. దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా వాణిజ్య అవసరాలకు మించి దిగుమతులకు భారత్ కట్టుబడేలా దొడ్డిదారుల్లో వెళితే... పారదర్శకతకు, ప్రజాస్వామిక నిఘాకు, ఆర్థిక సార్వభౌమత్వానికి హాని తప్పదని హెచ్చరించింది. ఈ ఒప్పందం భారతీయ రైతులు, వ్యవసాయ కార్మికులపైనే అధిక ప్రభావం చూపుతుందని పేర్కొంది. అమెరికా వ్యవసాయ వాణిజ్యపరమైన భారీ సబ్సిడీలతో పోటీ మీద భారతదేశ వ్యవసాయ రంగం ఆధారపడదని... సుంకాలు, ఆంక్షలు, ప్రొక్యూర్‌మెంట్ యంత్రాంగాలతో గ్రామీణ జీవనోపాధికి లభించే భద్రతే దీనికి ఆధారపమని సిపిఐ స్పష్టం చేసింది. ఈ భద్రత కోల్పోతే సుంకాల్లో కోతలు, టారిఫ్ కోటాలు లేదా భవిష్యత్ సర్దుబాట్లు లక్షల మంది రైతుల ప్రయోజనాలను కాపాడలేవని హెచ్చరించింది.
అన్ని పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ), ఎంఎస్‌పీకి చట్టబద్ధత, సరసరమైన ధరలకు సముచితంగా ఎరువుల సరఫరా, ఇతర అవసరాల కోసం దేశ రైతాంగం డిమాండ్ చేస్తుంటే ఇలాంటి ఒప్పందం చేసుకోవడం ద్వారా వ్యవసాయ సంక్షోభం మరింత తీవ్రమవుతుందని పేర్కొంది. అమెరికా వ్యవసాయోత్పత్తులకు, ఆహార ఉత్పత్తులకు పరిమిత మార్కెట్ కల్పించినాగానీ దేశీయంగా ధరాఘాతం... స్థానిక విపణులు డీలా పడటం, సంక్షోభం మరింత తీవ్రమవడం వంటి పరిణామాలు చోటుచేసుకుంటాయని వెల్లడించింది. వ్యవసాయ రంగానికి, పాడి పరిశ్రమకు సంపూర్ణ మద్దతు అంటూ ఇచ్చిన అనేక హామీలు ఒట్టి మాటలుగా మారిందని... బాహ్య ఒత్తిళ్లకు యంత్రాంగం తలొగ్గిందని సిపిఐ వ్యాఖ్యానించింది. ఈ ఒప్పందం క్రమంలో భారత్‌లో వ్యవసాయాధారిత వాణిజ్యం, కోఆపరేటివ్‌లు, ఆహార శుద్ధీకరణ పరిశ్రమ తీవ్రంగా ప్రభావితమవుతాయని పేర్కొంది. ఈ ఒప్పందం భౌగోళికరాజకీయ లక్షణం కూడా ఆందోళన కలిగిస్తోందని, ముడి చమురు దిగుమతులు సైతం ప్రభావితం కాగలవని సిపిఐ వెల్లడించింది. వాషింగ్టన్ వ్యూహాత్మక అజెండాకు అనుకూలంగా ఆర్థికవిదేశాంగ విధానపరమైన నిర్ణయాలు తీసుకునేలా అమెరికా యంత్రాంగం భారత్ చెయ్యి మెలిపెడుతోందని సిపిఐ వ్యాఖ్యానించింది. ఇలాంటి పరిస్థితి భారత్ వ్యూహాత్మక స్వావలంబన, సహకార సంప్రదాయానికి తూట్లు పొడుస్తూ... బలవంతపు ఆధారం (కోయర్సివ్ డిపెండెన్సీ) మూలంగా తీసుకునే స్వతంత్ర నిర్ణయాల పద్ధతికి దారితీస్తుందని హెచ్చరించింది. కార్మికులు, కర్షకులు, సాగుదారుల ప్రయోజనాలకు అనుగుణంగా వాణిజ్య ఒప్పందం ఉండాలేగానీ అధికారపరమైన ఒత్తిడికి అస్త్రంగా కాదని సిపిఐ స్పష్టం చేసింది. ఈ ఒప్పందం వివరాలన్నీ పార్లమెంటుకు తెలపాలని సిపిఐ డిమాండ్ చేసింది. రైతుల జీవనోపాధికి ముప్పు తలపెట్టే అన్ని రకాల మినహాయింపులు ఉపసంహరించుకోవాలని, దేశ సార్వభౌమత్వంతో రాజీ పడేందుకు బలవంతపెట్టే అనేక రకాల ఆర్థికభౌగోళిక రాయకీయ చర్యలను తిరస్కరించాలని భారత కమ్యూనిస్టు పార్టీ డిమాండ్ చేసింది.

# బహిష్కరణ

(మొదటి పేజీ తరువాయి)

శక్తిసామర్థ్యాలు ప్రతిపక్షాలకు ఎన్నటికీ ఉండవని తీవ్ర పదజాలం ప్రయోగించారు.
మల్లికార్జునఖర్గేను మాట్లాడేందుకు అనుమతించాలని ప్రతిపక్ష ఎంపీలు సభాపతిని అడుగుతూ ఉండగానే ప్రధానమంత్రి మాట్లాడతారంటూ సభాపతి రాధాకృష్ణన్ ప్రకటించారు. ప్రధానమంత్రి లేచి నిలబడగానే ప్రతిపక్ష ఎంపీలు ఖర్గేను మాట్లాడేందుకు అనుతించాలని కోరారు. అందుకు రాధాకృష్ణన్ తిరస్కరించారు. అప్పటికే ప్రధానమంత్రి మోదీ ఏ మాత్రం ఆగకుండా మాట్లాడటం ప్రారంభించారు.
దీంతో సభలో పరిస్థితి నిరసనలకు దారితీసింది. ప్రతిపక్ష సభ్యులు తమ తమ స్థానాల లో లేచి నిలబడి ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాల తీర్మానంపై ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీని అడున్డకున్న ఉదంతాన్ని ఎంపీలు ప్రధాని ఎదుట ప్రస్తావించి నిరసన తెలియజేశారు. దిగువసభలో ఏ ఒక్క ప్రతిపక్ష ఎంపీని ప్రసంగించేందుకు అనుమతించలేదంటూ రాజ్యసభలో ప్రతిపక్షాలు నిరసన తెలియజేశాయి.

**ప్రజాస్వామ్య మూలస్తంభాలను నాశనం చేయలేరు : ఖర్గే**

రాజ్యసభలో ధన్యవాదాల తీర్మానంపై చర్చకు సమాధానం చెప్పేందుకు ప్రధానమంత్రి ప్రసంగం ప్రారంభించగానే 'నిరంకుశత్వం,ఏకఛత్రాధిపత్యం చెల్లదు...అవమానాలను మేం సహించం' అంటూ ఎంపీలు నినాదాలు ప్రారంభించారు. తర్వాత పార్లమెంటు మకర ద్వారం నుండి వాకౌట్ చేశారు. మకరద్వారం వెలుపల ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే మీడియాతో మాట్లాడుతూ, రాజ్యసభలో మమ్మల్ని (ప్రతిపక్ష ఎంపీలను) మాట్లాడనివ్వలేదని చెప్పారు. ''వారు మమ్మల్ని మాట్లాడేందుకు అనుమతించడంలేదు..లోక్‌సభ–రాజ్యసభ రెండూ ప్రజాస్వామ్యానికి మూలస్తంభాల వంటివి, ఈ రెండూ మూలస్తంభాలలో ఏ ఒక్కదాన్నీ వారు ధ్వంసం చేయలేరు, మీ చేష్టల ద్వారా నాశనం చేయలేరు..'' అని విమర్శించారు. సిపిఐ(ఎం) ఎంపి జాన్ బ్రిట్టాస్ మాట్లాడుతూ, రెండు నిమిషాలు సభలో ఖర్గేను మాట్లాడనివ్వమని ప్రతిపక్ష ఎంపీలు సభాపతిని కోరారని, అందుకు ఆయన తిరస్కరించారని చెప్పారు. గౌరవనీయుడైన ''లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని రెండు నిమిషాలు కూడా మాట్లాడాలన్నది మా ఉద్దేశం, కానీ వారు ఒప్పుకోలేదు, ఆ అవకాశం ఇవ్వలేదు, ఆయన ప్రసంగాన్ని పూర్తిచెయ్యనివ్వలేదు. పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతిపక్ష నాయకుడికి కూడా ప్రధానమంత్రితో సమానహోదా ఉంటుంది, ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ తన అభిప్రాయాలు చెప్పేందుకు లేచి నిలబడ్డారు,మాట్లాడటం ప్రారంభించారు, కానీ మాట్లాడనివ్వలేదు'' అని జాన్ బ్రిట్టాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు.
డిఎంకె ఎంపి తిరుచ్చి శివ మాట్లాడుతూ, రాజ్యసభలో రెండు నిమిషాలు మాట్లాడేందుకు ఖర్గేకు అనుమతి ఇవ్వాలని కోరామనీ, అందుకు సభాపతి తిరస్కరించారన్నారు. ''ఖర్గేజీ, చాలా ముఖ్యమైన, విలువైన అంశాన్ని సభలో ప్రస్తావించాలని కోరుకున్నారు, కానీ ఆ యత్నం ఫలించలేదు, ఎవ్వరూ మా గోడు వినలేదు, పార్లమెంటు ఎంతమాత్రం తమను విశ్వాసంలోకి తీసుకోలేదు, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుణ్ణి గౌరవించలేదు, రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుణ్ణి మాట్లాడేందుకే అనుమతించలేదు, అందువల్లనే వాళ్ళ ప్రసంగాలు వింటూ కూర్చోవడానికి బదులుగా వాకౌట్ చేసి వచ్చేశాం'' అని తిరుచ్చి శివ చెప్పారు. గురువారం మధ్యాహ్న భోజన విరామానికి ముందు కూడా ఇదే సమస్యపై ప్రతిపక్షాలు సభ నుండి వాకౌట్ చేశాయి.

# అవమానించారు

(మొదటి పేజీ తరువాయి)

అవమానం కాదని, రాజ్యాంగ సంరక్షకురాలికి జరిగిన అవమానమన్నారు. అదేవిధంగా పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, టిఎంసి అధినేత్రి మమతా బెనర్జీపై కూడా తీవ్ర విమర్శలు గుప్పించారు. పశ్చిమ బెంగాల్‌లోకి చొరబాటుదారులను ఆమె ప్రోత్సహిస్తున్నారని ఆ రాష్ట్రంలో యువకుల ఉద్యోగాలను, హక్కులను, గిరిజన భూములను లాక్కుపోయారో అలాంటి చొరబాటుదారులను ఆమె ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. ప్రధానమంత్రి పదవిని కాంగ్రెస్‌పార్టీ కుటుంబం తన సొంత జాగీరుగా భావిస్తోందని విమర్శించారు. వారు ఎన్నటికీ తన గోతిని తవ్వలేరన్నారు. ప్రతిరోజు వారు నన్ను నిందిస్తున్నారని, ఎందుకంటే నా లాంటి పేదవాడు దేశ అత్యున్నతమైన పదవిని అలంకరించడాన్ని వారు జీర్ణించుకోలేక పోతున్నారని ఆరోపించారు. భారత పౌరులను కాంగ్రెస్‌పార్టీక సమస్యగా చూస్తుంటే, తమ పార్టీమాత్రం దేశ ప్రజలను సవాళ్ళ పరిష్కారానికి ఒక పెద్ద బలంగా భావిస్తోందన్నారు. ఇక తర్వాత ప్రధానమంత్రి బిజెపి ప్రభుత్వం సాధించిన విజయాలను ఒక్కొకటిగా చెబుతూ వచ్చారు. ఇటీవల యూరప్‌తో జరిగిన వాణిజ్య ఒప్పందం, అమెరికాతో జరిగిన ఒప్పందాలను ప్రస్తావించారు. బడ్జెట్‌లో చెప్పినట్టుగా రిఫామ్స్ ఎక్స్‌ప్రెస్ గురించి చెప్పారు.

# దయచేసి వాకౌట్ చేయకండి

**అమెరికాకు ముస్లిం, అరబ్ దేశాల విజ్ఞప్తి**

**మస్కట్ :** ఇరాన్–అమెరికా ప్రతినిధుల మధ్య ఒమన్ రాజధాని మస్కట్‌లో అణుచర్చలు ప్రారంభం కానుండటంతో సర్వత్రా ఉత్కంఠ నెలకున్నది. మరోవైపు చర్చల నేపథ్యంలో చమురు మార్కెట్‌లో ధరలు గణనీయంగా క్షీణించాయి. న్యాయబద్ధమైన,గౌరవ ప్రదమైన చర్చలకు తాము కట్టుబడి ఉన్నామని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ చెప్పారు. ఇరాన్ తరపున అరాఘ్చీ,అమెరికా తరపున స్టీవ్ విట్‌కాఫ్, జారెడ్ కుష్నెర్ పాల్గొంటారు.

# టీచర్లకు న్యాయం చేయండి

(మొదటి పేజీ తరువాయి)

అధ్యక్షవర్గంగా వ్యవమరించారు. ధర్నాలో సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ కె.నారాయణ,రాజ్యసభ సభ్యులు సెల్వరాజ్ (సిపిఐ), జాన్ బ్రిట్టాస్, వి.శివదాసన్ (సిపిఐ(ఎం), కుమార్ నాయక్ (కాంగ్రెస్), రాజారామ్ సింగ్(సిపిఐఎంఎల్ ), ఉపాధ్యాయ ఎంఎల్‌సి గోపీ మూర్తి (ఎపి), శ్రీపాల్ రెడ్డి (తెలంగాణ), వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ పాల్గొని ఉపాధ్యాయులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సమస్యలను పార్లమెంట్‌లో లేవనెత్తుతామని ఎంపిలు హామీ ఇచ్చారు. ఎఐజెఎసిటిఓ స్టీరింగ్ కమిటీ సభ్యులు, ఎఐఎస్‌టీఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎస్‌టియు టిఎస్ రాష్ట్ర అధ్యక్షులు జి.సదానందం గౌడ్, నాయకులు చావా రవి, కమలాకాంత్ త్రిపాఠి, రామ్మూర్తి స్వామి, పి. దామోదర్ రెడ్డి, వరల్డ్ టీచర్స్ ఫెడరేషన్ అధ్యక్షులు అమియకుమార్ మోహంతీ, ఎఐఎఫ్‌యుసిటిఓ ప్రధాన కార్యదర్శి డాక్టర్ అరుణ్ కుమార్, ఎఐఎఫ్‌ఆర్‌టిఇ కార్యదర్శి ప్రొఫెసర్ వికాస్ గుప్తా, ఎఐఎస్ఈసి కార్యదర్శి శారదా దీక్షిత్, ఎఐఐటిఎ అధ్యక్షుడు రిజ్వాన్ తదితరులు సభను ఉద్దేశించి ప్రసంగించారు. సుప్రీంకోర్టు తీర్పు పూర్తిగా ఎన్‌సిటిఇ నోటిఫికేషన్‌కు విరుద్ధమని ఎఐజెఎసిటిఓ నాయకులు అన్నారు. ఈ నోటిఫికేషన్ ప్రకారం, టెట్ నిబంధన 2010 తర్వాత నియమితులైన ఉపాధ్యాయులకు మాత్రమే వర్తిస్తుందని, ఇన్‌సర్వీస్ టీచర్లకు మినహాయింపు ఇచ్చారని గుర్తు చేశాయి. గత 15 ఏళ్లుగా అదే విధానం అమలులో ఉందని పేర్కొన్నాయి. కాని సుప్రీంకోర్టు తీర్పు కారణంగా ఐదేళ్లకు మించి సర్వీసు ఉన్న ఉపాధ్యాయులు రెండేళ్లలోపు టెట్ ఉత్తీర్ణత సాధించకపోతే ఉద్యోగం కోల్పోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదేళ్లు లేదా అంతకంటే తక్కువ సర్వీస్ ఉన్న వారికి టెట్ మినహాయింపు ఉన్నప్పటికీ, పదోన్నతులు మాత్రం లభించవని ఇది తీవ్ర అన్యాయమన్నారు. ఎఐఎస్‌టిఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎస్‌టియు టియస్ రాష్ట్ర అధ్యక్షులు జి.సదానందం గౌడ్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల గౌరవాన్ని అన్యాయంగా తగ్గించే కుట్రలో భాగంగానే కేంద్ర ప్రభుత్వం టెట్ అనే అంశాన్ని తెరపైకి తెచ్చిందని విమర్శించారు. టెట్ అర్హత దేశంలో సుమారు 25 లక్షల మంది ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు గుదిబండగా మారిందని అన్నారు. ఉపాధ్యాయుల హక్కులు, ప్రయోజనాల కోసం నిరంతరం పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఈ ధర్నాలో ఎస్‌టియు టిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుట్టుగజేందర్‌తో పాటు 33 జిల్లాల నుండి పెద్ద ఎత్తున సంఘ బాధ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ బకాయిలు విడుదల చేయండి

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చాడ వెంకట రెడ్డి లేఖ**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర వ్యాపితంగా 2024 సంవత్స రం నుండి ఇప్పటి వరకు దాదాపు 21 నెలల నుండి పదవీ విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన పదవీ విరమణ బకాయిలను వెంటనే విడుదల చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పదవీ విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ బకాయిలను ప్రభుత్వం చెల్లించకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డికి చాడ వెంకట రెడ్డి గురువారం లేఖ రాశారు. చివరి దశలో ఉద్యోగంలో జమ చేసిన డబ్బులను ఇవ్వకపోవడంతో వద్ధాప్యంలో వారు ఇతరులపైన ఆధారపడే పరిస్థితి వచ్చిందన్నారు. పదవీ విరమణ పొందిన వారికి వెంటనే వారి వారి పదవీ విరమణ బకాయిలను వెంటనే ఇప్పించాలని వారు తమ దృష్టికి తీసుకొస్తున్నారని చాడ వెంకట రెడ్డి సిఎంకు రాసిన లేఖలో పేర్కొన్నారు.

## కేంద్ర నిధులతోనే గ్రామాల అభివృద్ధి

**కాంగ్రెస్- బిఆర్ఎస్ రెండు ఒక్కటే : కిషన్‌రెడ్డి**



**ప్రజాపక్షం/రామాయంపేట:** కేంద్ర నిధులతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం రామాయంపేటకు వచ్చిన సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కేంద్ర మంత్రి మాట్లాడారు. నరేంద్రమోడీ చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలతో ఎంతో మంది నిరుపేదలకు న్యాయం జరుగుతుందన్నారు. కేంద్రం తెలంగాణ ప్రజల కోసం తెచ్చిన ఉచిత వైద్యాన్ని కెసిఆర్ అడ్డుకున్నాడన్నారు. ప్రజలను మోసం చేయడంలో కాంగ్రెస్, బిఆర్ఎస్ రెండు పోటీపడ్డాయని, అవినీతి పార్టీలు గా పేరొందిన కాంగ్రెస్, బిఆర్ఎస్‌లకు ఓట్లు అడిగే హక్కులేదన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులను గెలిపిస్తే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఎంపి రఘునందన్‌రావు మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న బిజెపి అభ్యర్థులను కొంతమంది బెదిరిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని మా కార్యకర్తల జోలికి వస్తే ఎవరిని చూడమని అలాంటి వారిని తొక్కేస్తామని, తీహార్ జైల్లో చిప్పకూడు తినిపిస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మల్లేష్‌గౌడ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఓట్ల కోసం మోసగాళ్లు వస్తున్నారు... జాగ్రత్త





● కొత్తగూడెం కార్పొరేషన్‌పై ఎర్రజెండా ఎగరాలి ● సిపిఐ,టిడిపి, ప్రజా సంఘాల కూటమిని గెలిపించండి ● సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఈ ఎన్నికల్లో ఘన విజయాన్ని సాధించి కొత్తగూడెం కార్పొరేషన్‌పై ఎర్రజెండా ఎగురవేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు అన్నారు. కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఆయన 57 డివిజన్ అభ్యర్థి సహేరా మహ్మద్, 56 విడిజన్ అభ్యర్థి గడ్డం శాంతిప్రియ, 55 డివిజన్ అభ్యర్థి చల్లా భాస్కర్ రావు, 28వ డివిజన్ అభ్యర్థి కోలపూరి ధర్మరాజు, 29వ డివిజన్ అభ్యర్థి మాచర్ల శ్రీనివాస్, 30వ డివిజన్ అభ్యర్థి బ్యాండు దుర్గ, 52వ డివిజన్ అభ్యర్థి బానోత్ కళావతి, 53వ డివిజన్ అభ్యర్థి బండి నర్సింహారావు, 54వ డివిజన్ అభ్యర్థి పల్లపోతు భాగ్యలక్ష్మి విజయాన్ని కాంక్షిస్తూ విస్తృత ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ, సిపిఐ, టిడిపి, ప్రజాసంఘాల కూటమిగా పోటీలో ఉన్న సిపిఐ అభ్యర్థిలను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. తాను ఎంఎల్ఎగా గెలిచిన ఈ రెండేళ్ల కాలంలో కోట్లాది రూపాయల నిధులు తీసుకొచ్చి మారుమూల ప్రాంతాలను సైతం అభివృద్ధి చేశామని చెప్పారు. ప్రభుత్వంతో మాట్లాడి పెద్ద ఎత్తున నిధులను తీసుకొచ్చి సమగ్రాభివృద్ధిని చేస్తామన్నారు. సిపిఐ కూటమి అభ్యర్థులకు ఓట్లు వేయడమంటే తనకు ఓట్లు వేసినట్లే అని, గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆశీర్వదించినట్లుగానే ఈ కార్పొరేషన్ ఎన్నికల్లో కూడా గెలిపించాలని, తద్వారా మరింత అభివృద్ధి చేసుకునేందుకు వీలుంటుందన్నారు. నిత్యం ప్రజలతో మమేకమై ఉండే సిపిఐకి ప్రజా సమస్యలపై ఎక్కువ అవగాహన ఉంటుందని, అలాంటిది మన అభ్యర్థిలే కార్పొరేటర్లుగా ఉండటం ద్వారా ప్రజలకే మేలు చేకూరుతుందని, కంకి కొడవలి గుర్తుకు ఓట్లు వేసి సిపిఐ, టిడిపి, ప్రజా సంఘాల కూటమి అభ్యర్థును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ ఎన్నికల సమయంలో పూటకో పార్టీ మారుతూ, నిమిషానికో కండువా కప్పుకునే కంత్రీగాళ్లు మీ వద్దకు వస్తుంటారని, కల్లబొల్లి మాటలు చెప్పిన ఓట్లు దండుకుని ముఖం చాటేస్తారని, అలాంటి వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలు ప్రలోభాలకు లొంగకుండా మం చివారైన సిపిఐ కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. కాంగ్రెస్‌తో సీట్ల సంఖ్య సర్దుబాటు కాని కారణంగా సిపిఐ కూటమి 60 డివిజన్ల వ్యాప్తంగా పోటీలో ఉందని, ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షలు, అభిష్టాల మేరకు ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. ఈ ప్రచార కార్యక్రమాల్లో కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళీ, దుర్గరాశి వెంకన్న, చలిగంటి శ్రీనివాస్, వై ఉదయ్ భాస్కర్, భూక్యా దస్రు, కొమారి హన్మంతరావు, కందుల భాస్కర్, గెద్దాడు నగేష్, నెరేళ్ల రమేష్, మునిగడప వెంకటేశ్వర్లు, మునిగడప పద్మ, వంగా వెంకట్, రమణమూర్తి, నిమ్మగడ్డ వెంకటేశ్వర్లుతో పాటు తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పాలనతో ప్రజల జీవితాల్లో స్పష్టమైన మార్పు

**మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**



**ప్రజాపక్షం/కోదాడ :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల జీవితాల్లో ప్రత్యక్ష మార్పును తీసుకొస్తున్నాయని రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. గురువారం కోదాడలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.13,600 కోట్ల వ్యయంతో రాష్ట్ర వ్యాప్తంగా మూడు కోట్ల 17 లక్షల మందికి ప్రతినెల ఒక్కొక్కరికి ఆరు కిలోల ఉచిత సన్నబియ్యం అందిస్తున్నామని తెలిపారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వ ల్యాండ్ మార్క్ గేమ్‌చెంజర్ పథకమని, స్వతంత్ర్య భారత దేశ చరిత్రలో తొలిసారిగా ఇంత పెద్ద స్థాయిలో సన్నబియ్యం పంపిణీ జరుగుతొందని చెప్పారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో కొత్త రేషన్‌కార్డులు ఇవ్వలేదని, కుటుంబ సభ్యులను చేర్చే అవకాశం కూడా కల్పించలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హులైన ప్రతి ఒక్కరికి కొత్త రేషన్‌కార్డులు ఇవ్వాలని చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల వల్ల రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన సానుకూల వాతావరణం ఏర్పడిందన్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు అభిప్రాయం పూర్తిగా కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కోదాడ, హుజూర్‌నగర్, నేరేడుచర్ల మున్సిపాలిటీలలో కాంగ్రెస్ క్లీన్ స్వీప్ ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కోదాడలో 35 వార్డులకు 35 వార్డులు, హుజూర్‌నగర్‌లో 28 వార్డులకు, 28 వార్డులు, నేరేడుచర్లలో 15 వార్డులకు 15 వార్డులు కాంగ్రెస్ గెలుస్తుందని పేర్కొన్నారు. కోదాడ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వివరిస్తూ 30 పడకల ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రి గా అభివృద్ధి చేస్తున్నామని, రూ.26 కోట్లతో కొత్త ఆసుపత్రి భవనం నిర్మాణంతో పాటు సిటి స్కాన్ వంటి ఆ ధునిక వైద్య సదుపాయాలు అందుబాటులోకి తెస్తున్నామని చెప్పారు. రూ.200 కోట్లతో అండర్ డ్రైనేజీ నిర్మాణం, ఆధునిక బస్టాండ్, బస్ డిపో, కోదాడ హైద్రాబాద్‌కు ఎసి బస్ షటిల్ సేవలు, బాలాజీనగర్‌లో 50 కోట్లతో జవహర్ నవోదయ విద్యాలయం నిర్మాణం జరుగుతుందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పారదర్శకమైన ప్రజాస్వామ్య పరిపాలన అందిస్తోందని అన్నారు. ఫిబ్రవరి 11న జరిగే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తుపై ఓటు వేసి వార్డు కౌన్సిలర్లను గెలిపించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల మృతి చెందిన కర్ల రాజేష్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపి, వారి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని స్పష్టంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చింతకుంట్ల లక్ష్మి నారాయణరెడ్డి, జిల్లా గ్రంధాలయ చైర్మన్ వంగవీటి రామారావు, కందుల కోటేశ్వరరావు, రామినేని శ్రీనివాస్, ఈదుల కృష్ణయ్య, బాల్‌రెడ్డి, చింతలపాటి శ్రీనివాస్, పంది తిరపయ్య పాల్గొన్నారు.

## పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులు

● తొలి విడతగా రూ.259.36 కోట్లు విడుదల ● హర్షం వ్యక్తం చేసిన మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణలోని గ్రామ పంచాయతీలకు ఊరటనిస్తూ 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదలకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కేంద్ర ఆర్థిక శాఖ ఉత్తర్వుల మేరకు గ్రామ పంచాయతీలకు తొలి విడతగా రూ.259.36 కోట్లను విడుదల చేసింది. రెండు సంవత్సరాలుగా నిధుల కోసం ఎదురుచూస్తున్న గ్రామ పంచాయతీలకు ఇది ఊరటనిచ్చే పరిణామంగా మారింది. ఎన్నికల జాప్యంతో గత రెండేళ్లుగా 2024–25, 2025–26 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయి. బిసి రిజర్వేషన్‌ల పెంపు అంశంపై సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో గ్రామ పంచాయతీ ఎన్నికలు ఆలస్యం కావడంతో కేంద్ర ప్రభుత్వం ఎన్నికలు పూర్తయ్యే వరకు నిధుల విడుదల సాధ్యం కాదని స్పష్టం చేసింది. దీనివల్ల గ్రామ పంచాయతీలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.

**మంత్రి సీతక్క చొరవ..**

ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క కేంద్ర ప్రభుత్వంపై నిరంతర ఒత్తిడి తెచ్చారు. ఢిల్లీలో కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో పాటు ఇతర కేంద్ర పెద్దలను పలు దఫాలు కలిసి రాష్ట్ర పరిస్థితిని వివరించారు. గ్రామ స్థాయిలో అభివృద్ధి పనులు నిలిచిపోవడం, ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులను కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. అయినప్పటికీ ఎన్నికలు పూర్తికాకపోవడంతో నిధుల విడుదలకు కేంద్రం ముందుకు రాలేదు. ఎన్నికల అనంతరం మార్చి 31 లోపు నిధులు విడుదల కాకపోతే అవి శాశ్వతంగా రద్దయ్యే ప్రమాదం ఉండటంతో మంత్రి సీతక్క ప్రత్యేకంగా ప్రక్రియను వేగవంతం చేశారు. సంబంధిత శాఖ అధికారులతో సమీక్షలు నిర్వహించి కేంద్రంతో నిరంతర సంప్రదింపులు కొనసాగించారు. రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్. శ్రీధర్‌తో పాటు ఇతర అధికారులు కూడా కేంద్రంతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపి నిధుల విడుదలకు కృషి చేశారు. ఈ సమిష్టి ప్రయత్నాల ఫలితంగా కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదల ప్రక్రియను ప్రారంభించింది. 15వ ఆర్థిక సంఘం సిఫారసుల ప్రకారం రాష్ట్రానికి మొత్తం సుమారు రూ.3000 కోట్ల వరకు నిధులు రావాల్సి ఉంది. అందులో తొలి విడతగా రూ.259.36 కోట్ల విడుదలతో గ్రామ పంచాయతీల్లో ఆశలు చిగురించాయి. మిగిలిన నిధులు కూడా దశలవారీగా విడుదల చేయాల్సి ఉంది. నిధుల విడుదలపై మంత్రి సీతక్క హర్షం వ్యక్తం చేశారు. ఈ నిధులతో గ్రామాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపడతాయని, అభివృద్ధి పనులు వేగవంతం అవుతాయని తెలిపారు. మిగిలిన పెండింగ్ నిధులను కూడా ఆలస్యం చేయకుండా వెంటనే విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. గ్రామ స్వరాజ్యం బలోపేతం కావాలంటే గ్రామ పంచాయతీలకు సమయానికి నిధులు అందడం అత్యంత అవసరమని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.



## మేధావుల మౌనం దేశానికి, రాష్ట్రానికి ప్రమాదకరం

**బిఆర్ఎస్ఎల్‌పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్‌రావు**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** వికృత భాషతో తెలంగాణ ప్రతిష్ట దెబ్బతినే విధంగా వ్యవహరిస్తున్న సిఎం రేవంత్ రెడ్డి వైఖరి పట్ల తెలంగాణ మేధావులు ఆలోచించాల్సిన, స్పందించాల్సిన సమయం ఆసన్నమైందని బిఆర్ఎస్ఎల్‌పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్‌రావు కోరారు. మేధావుల మౌనం దేశానికి, రాష్ట్రానికి ప్ర మాదకరమని,అందుకే వారు ఆలోచించాలన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బిఆర్ఎస్ఎల్‌పి విప్ కె.పి.వివేకానంద,ఎంఎల్ఎ ముఠాగోపాల్‌తో కలిసి హరీశ్‌రావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం కోసం అందరూ కలిసి కొట్లాడామని, పోరాటం చేశామని గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమ చరిత్రను చి న్నబుచ్చే ప్రయత్నం, ఔన్నత్యాన్ని రేవంత్ రెడ్డి తగ్గించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.జాబ్ క్యాలెండర్ ఇస్తానని నిరుద్యోగులను మోసం చేసిన రేవం త్.. నెలకోక స్కామ్‌తో స్కాం క్యాలెండర్‌ను అమలు చేస్తున్నారని, పాలనను గాలికి వదిలి, జేబులు నింపుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్నారని హరీశ్ రావు ఆరోపించారు. అమెరికా పర్యటన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు చూస్తుంటే చాలా ఆవేదన కలుగుతుందన్నారు.

## 120 ఎకరాల విస్తీర్ణంలో వ్యవసాయ కళాశాల

**నేడు శంకుస్థాపన చేయనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** వ్యవసాయ విద్య విస్తరణలో భాగంగా నిజామాబాద్ జిల్లాలో కొత్త వ్యవసాయ కళాశాల కు సిఎం రేవంత్ రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేయనున్నారని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు వెల్లడించారు. ప్రతి ఉమ్మడి జిల్లాలో వ్యవసాయ కళాశాల ఉండేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. రాష్ట్రంలో వ్యవసా య విద్యను మరింత విస్తరించి, రైతు సంక్షేమానికి, వ్యవసాయ అభివృద్ధికి బలమైన పునాదులు వేయాలనే లక్ష్యంతో నిజామాబాద్ జిల్లాలో కొత్త వ్యవసాయ కళాశాల నిర్మాణానికి ముఖ్యమంత్రి ఆమోదించారని గురువారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లాలోని సుద్దపల్లి, నడపల్లి గ్రామాల పరిధిలో ఉన్న తెలంగాణ యూనివర్సిటీ క్యాంపస్‌లోని సర్వే నంబర్లు 265/1, 277, 334లో మొ త్తం 120 ఎకరాల విస్తీర్ణంలో ఆధునిక వ్యవసాయ కళాశాల నిర్మించనున్నారని, వ్యవసాయ రంగంలో నూతన సాంకేతికత, పరిశోధన, శిక్షణ,రైతు సేవలను ఒకేచోట అందించేందుకు ఈ కళాశాల రూపుదిద్దుకోనుందని పేర్కొన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఏర్పడనున్న ఈ కళాశాల రాష్ట్ర వ్యవసాయ రంగానికి ఒక ముఖ్య మైలురాయిగా నిలవనుందన్నారు. విద్యార్థులకు ఆధునిక వ్యవసాయ విద్య అందించడంతో పా టు రైతులకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరే విధంగా ప్రణాళికలు రూపొందించామన్నారు. రాష్ట్రంలో వ్యవసాయాన్ని ఆధునీకరించి, యువతను వ్యవసాయ రంగంలో ఆకర్షించేందుకు, రైతుల ఆదాయాన్ని పెంచడమే లక్ష్యంగా రాష్ట్ర ప్ర భుత్వం కొత్త వ్యవసాయ కళాశాల నిర్మాణాన్ని చేపట్టిందని మంత్రి వివరించారు. వ్యవసాయ కళాశాల శంకుస్థాపన కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొనాలని తుమ్మల కోరారు.

**కళాశాల ప్రత్యేకత ...**

- 5 ఎకరాలలో ఆధునిక అకడమిక్ బ్లాక్, పరిపాలన భవనాలు
- 2 ఎకరాలలో అత్యాధునిక 10 ప్రయోగశాలలు
- 2 ఎకరాలలో 1000 మంది విద్యార్థులకు వసతి గృహాలు .
- 1 ఎకరంలో లైబ్రరీ.
- 50 ఎకరాలలో విస్తృత పరిశోధన ఫార్మ్‌లు,సీడ్ ఫార్మ్‌లు.
- 20 ఎకరాలలో విద్యార్థుల ప్రాక్టికల్ శిక్షణ కోసం ప్రత్యేక ఫార్మ్‌లు.
- 10 ఎకరాలలో మోడల్ ఫార్, రైతు శిక్షణ బ్లాక్.
- 10 ఎకరాలలో సైన్స్ మ్యూజియం, బొటానికల్ గార్డెన్.
- 8 ఎకరాలలో స్పోర్ట్స్ కాంప్లెక్స్,ఇండోర్ స్టేడియం
- 3 ఎకరాలలో ఆడిటోరియం, గ్యాలరీ సెమినార్ హాళ్లు
- 3 ఎకరాలలో అధ్యాపకులు,సిబ్బందికి నివాస వసతులు
- 1 ఎకరంలో ఆరోగ్య కేంద్రం1,ఇతర మౌలిక సదుపాయాలు

## ఏ ఒక్క హామీ కాంగ్రెస్ అమలు చేయలే

**బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్**



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ఇచ్చిన ఏ ఒక్క హామీని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదని అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చి అందరినీ కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ విమర్శించారు. మున్సిపల్ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా సిరిసిల్ల పట్టణంలోని బి వై నగర్ చౌరస్తా, వెంకంపేట, గాంధీ నగర్, కొత్త బస్టాండ్,శాంతినగర్‌లలో పట్టణ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ మాటలు నమ్మి కాంగ్రెస్‌కు ఓటు వేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి ప్రజలను మోసం చేయడం ఖాయం అన్నారు. ఈ మున్సిపల్ ఎన్నికల పోటీ, గత 10 సంవత్సరాల పాటు ప్రజలకు అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేసిన పార్టీకి రెండు ఏళ్ళలో ఉన్న సంక్షేమ పథకాలను ఎత్తివేసిన కాంగ్రెస్ పార్టీకి మధ్య జరిగే ఎన్నికలు అన్నారు. మరోసారి కెసిఆర్ ను ముఖ్యమంత్రి చేస్తేనే తగిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు తిరిగి ప్రారంభమవుతాయని, ఆ దిశగా ఈ మున్సిపల్ ఎన్నికలతోనే కెసిఆర్‌ను ముఖ్యమంత్రిని చేసుకునే కార్యక్రమం ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ ఎన్నికల తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుబంధు వేస్తానని చెబుతున్నారని ఇప్పటికీ ఎన్ని పంట కాలాలు గడిచాయో? ఎన్నిసార్లు రైతుబంధు వేసిండో చెప్పాలని ప్రశ్నించారు. కెసిఆర్ ఏర్పాటు చేసిన చిన్న జిల్లాలను తీసివేయాలని కాం గ్రెస్ ప్రభుత్వం కుట్ర పన్నుతుందని, జిల్లా కేంద్రాలను రద్దు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీకి ఓటేయాలో చిన్న జిల్లాలు ఏర్పాటు చేసి పాలనను సులభతరం చేసిన పార్టీకి ఓటేయాలో నిర్ణయించుకోవాలని విజ్ఞప్తి చేశారు. మరోసారి సిరిసిల్ల మున్సిపల్ పైన బిఆర్ఎస్ జండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ ప్రచారంలో తుల ఉమ, జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, కొండూరి రవీందర్ రావు, జిందం కళ చక్రపాణి, చీటీ నర్సింగరావు, చిక్కాల రామారావు, వార్డ్ అభ్యర్థులు పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పట్టణ ప్రగతికి ‘ప్రజా ప్రభుత్వం’ పెద్దపీట



- రెండేండ్లలోనే రూ. 17,472 కోట్ల కేటాయింపు
- 130 మున్సిపాలిటీల్లో 3,994 అభివృద్ధి పనులు
- మున్సిపల్ శాఖలో కీలక సంస్కరణలు
- మున్సిపల్ మంత్రిగా ముఖ్యమంత్రి ‘స్పెషల్ ఫోకస్’

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్ల వ్యవధిలోనే రాష్ట్రంలోని నగరాలు, పట్టణాల అభివృద్ధికి భారీ ఎత్తున నిధులు కేటాయిస్తూ రికార్డు సృష్టించింది. వివిధ పథకాల ద్వారా రాష్ట్రంలోని 130 మున్సిపాలిటీలకు మొత్తం రూ.17,472.22 కోట్లను విడుదల చేసి, దాదాపు 3,994 అభివృద్ధి పనులను చేపట్టింది. ఈ నిధులతో రహదారులు, డ్రైనేజీ వ్యవస్థలు, వరద నియంత్రణ చర్యలు, చెరువుల కాలుష్య నియంత్రణ, కాలనీలు, బస్తీల్లో మౌలిక సదుపాయాల కల్పన, పబ్లిక్ పార్కుల అభివృద్ధి, తాగునీటి సరఫరా, మురుగునీటి వ్యవస్థల ఆధునీకరణ వంటి పనులను ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తోంది. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా మున్సిపల్ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తూ, పట్టణాభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మున్సిపల్ శాఖలో కీలక సంస్కరణలను అమలు చేస్తూ, పరిపాలనా సౌలభ్యం, మెరుగైన పౌర సేవలు, సమర్థవంతమైన పర్యవేక్షణకు మార్గం సుగమం చేశారు. ఉమ్మడి రాష్ట్రం నుంచి ఒకే శాఖగా ఉన్న మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ (ఎంఎయుడి) విభాగాన్ని రెండు భాగాలుగా విభజించారు. తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని జిహెచ్ఎంసి, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను ఒక అర్బన్ విభాగంగా ఏర్పాటు చేసి ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని నియమించారు. కోర్ అర్బన్ ఏరియా వెలుపల ఉన్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల కోసం మరో విభాగాన్ని ఏర్పాటు చేసి, సీనియర్ ఐఎఎస్ అధికారిని బాధ్యతలు అప్పగించారు. హైదరాబాద్ తరహాలోనే రాష్ట్రంలోని అన్ని నగరాలు, పట్టణాలను అభివృద్ధి చేయాలనే భవిష్యత్తు దృక్పథంతో ముఖ్యమంత్రి స్వయంగా ప్రణాళికలు రూపొందించేందుకు చొరవతీసుకున్నారు. 2019 నుంచి పెండింగ్‌లో ఉన్న స్టాంప్ డ్యూటీ నిధులు రూ.996.27 కోట్లను పట్టణాభివృద్ధికి విడుదల చేయడం విశేషం. గతంలో రాష్ట్ర వాటా నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో అనేక అభివృద్ధి పనులు ప్రారంభం కాలేదు. ప్రజా ప్రభుత్వం రాష్ట్ర వాటాను వెంటవెంటనే విడుదల చేయడంతో, ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పనులు క్షేత్రస్థాయిలో ప్రారంభమయ్యాయి. ఇక రాష్ట్రాల ప్రత్యేక మూలధన పెట్టుబడి సహాయం (ఎస్ఎఎస్‌సిఐ) పథకం కింద అవసరమైన సంస్కరణలను ప్రభుత్వం పూర్తి చేయడంతో, సంస్కరణల అనుసంధాన సహాయంగా రూ.1,698 కోట్ల నిధులను పొందేందుకు తెలంగాణ అర్హత సాధించడం విశేషంగా నిలిచింది.

**రెండేళ్లలో కేటాయించిన నిధుల వివరాలు..**

- నగరాభివృద్ధి, పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధి (యుడిఐఎఫ్). 130 మున్సిపాలిటీల్లో 2,374 పనులకు రూ.9,387.11 కోట్లు.
- తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ. 85 మున్సిపాలిటీల్లో 1,166 పనులకు రూ.1,896.96 కోట్లు.
- ట్రాన్స్‌ఫర్ డ్యూటీ ద్వారా 110 మున్సిపాలిటీలకు రూ.462.19 కోట్లు.
- స్వచ్ఛ భారత్ పథకంలో 236 మున్సిపాలిటీల్లో 347 పనులకు రూ.462.19 కోట్లు. (ఇందులో రాష్ట్ర వాటా రూ.286.20 కోట్లు, కేంద్ర వాటా రూ.175.99 కోట్లు).
- అటల్ మిషన్ ఫర్ రిజువెనేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌మేషన్(ఏఎంఆర్‌యుటి) పథకం, 109 మున్సిపాలిటీల్లో 107 పనులకు రూ.4,729.69 కోట్లు.
- రెండేళ్లలోనే పట్టణాభివృద్ధికి ఇంత పెద్ద స్థాయిలో నిధులు, సంస్కరణలు అమలు చేయడం ప్రజా ప్రభుత్వ ప్రత్యేకతగా నిలుస్తోంది.

GREATER HYDERABAD MUNICIPAL CORPORATION
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ

**NIT No.64, పని పేరు:** 2 పనుల కొరకు జిహెచ్ఎంసి, రాజేంద్రనగర్ & అత్తాపూర్ సర్కిల్‌లో కంకర సరఫరా మరియు విస్తరణ, అలాగే రహదారి నిర్వహణ. **అంచనా విలువ / ఇసివి:** రూ.2.90లక్షలు, **డౌన్‌లోడింగ్ ప్రారంభ తేదీ & సమయం:** 05.02.2026న సా.4.30గం.ల నుండి, **బిడ్ స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం:** 09.02.2026న సా.4.40గం.ల వరకు, **ఇఇ/ఎస్ఇ పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, రాజేంద్రనగర్, జిహెచ్ఎంసి. సెల్ నెం.9989930608, ఇ-మెయిల్ ఐడి: eec11.ghmc2@gmail.com.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, రాజేంద్రనగర్, జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 14995-PP/CL/ADVT/1/2025-26, Date: 05-02-2026

తెలంగాణ ప్రభుత్వం
కార్యనిర్వాహక ఇంజనీర్ (ఆర్&బి) కార్యాలయం, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా.
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన

NIT షార్ట్ టెండర్ నోటీస్ నెం. EE/R&B/MDCL/07/2025-26/ తేది. 05.02.2026

మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా, కీసర మండలం, కీసరగుట్టలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో 2026 సంవత్సరపు మహాశివరాత్రి జాతర సందర్భంగా క్యూ లైన్లు మరియు పార్కింగ్ కోసం బారికేడింగ్ ఏర్పాటు చేయడం, సైనేజీలు (ఫ్లెక్సీలు) ఏర్పాటు చేయడం మరియు ఇన్స్‌పెక్షన్ బంగ్లాకు కొన్ని మరమ్మతులు చేయడం వంటి మూడు (03) పనుల కోసం, మొత్తం **రూ. 8.35 లక్షల** అంచనా వ్యయంతో, ఈ క్రింద సంతకం చేసిన వారిచే ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారమ్ ద్వారా అత్యవసర ఆన్‌లైన్ టెండర్లు ఆహ్వానించడమైనది. **బిడ్ అప్‌లోడ్ ప్రారంభ తేదీ:** 05.02.2026 మధ్యాహ్నం 03.30 గంటల నుండి, **ముగింపు తేదీ:** 09.02.2026 ఉదయం 10.30 గంటల వరకు. మరిన్ని వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అయిన www.tender.telangana.gov.in లో చూడవచ్చు.

సం/- కార్యనిర్వాహక ఇంజనీర్ (ఆర్&బి) మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా

DIPR R.O. No. : 15009-PP/CL/ADVT/1/2025-26, Date: 05-02-2026



## మతోన్మాద కార్మిక వ్యతిరేక విధానాలకు స్వస్తి పలుకుదాం

### ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ఈనెల 12వ తేదీన ఐక్య కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని ధర్మబిక్షం భవన్‌లో సమ్మె వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కార్మికుల హక్కులను కాలరాస్తున్న నరేంద్ర మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈనెల 12న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయడం ద్వారా నరేంద్ర మోడీకి బుద్ధి చెప్పాలని మతోన్మాద కార్మిక వ్యతిరేక విధానాలకు స్వస్తి చెప్పాలని ఆయన అన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని యూనియన్ పెట్టుకునే హక్కును ప్రతి కార్మికుడికి ఇవ్వాలని ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు అప్పనంగా అప్పజెప్పే కార్యక్రమానికి స్వస్తి చెప్పాలని కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా గౌరవ సలహాదారులు చామల అశోక్ కుమార్, సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, బూర సైదులు, ఎడెల్లి శ్రీకాంత్, ఎండి పాషా, సివిల్ సప్లై హమాలి యూనియన్ జిల్లా కార్యదర్శి శ్యాంసుందర్, నాయకులు కొండలు, గోపి, ఎల్లయ్య, గౌరీ నాయుడు పాల్గొన్నారు.

## విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

### వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్



**ప్రజాపక్షం/రామన్నపేట :** విధులపట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్ హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఓపి విభాగమును, వార్డులలో తిరిగి రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. హాజరు రిజిస్టర్‌లను పరిశీలించి అనుమతులు లేకుండా గైర్హాజరైన ముగ్గురు డాక్టర్లకు షోకాజ్ నోటీసులు జారి చేస్తున్నట్లు తెలిపారు. వైద్యులతో సమావేశమై ఆస్పత్రికి వచ్చే రోగులకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. రోగులకు అందిస్తున్న మందులపై ఆరాతీశారు. మందుల నిల్వలను పరిశీలించారు. అత్యవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ప్రసవాల సంఖ్యను పెంచాలని అన్నారు. స్థానిక నాయకులు ఆయనను కలిసి ఆసుపత్రి భవనం శిథిల దశకు చేరుకుందని, నూతన భవనాన్ని ఏర్పాటు చేయాలని, ఆసుపత్రి స్థాయిని వంద పడకలకు పెంచాలని ఆయనను కోరారు. వంద పడకల ఆసుపత్రి భవన నిర్మాణం, పరిశీలనలో ఉందని ఆయన వారికి తెలిపారు. ఆయన వెంట డిసిహెచ్ఎస్ చిన్నా నాయక్, వైద్యులు స్వాతి బాయి, నవీన్ సింగ్, మాధవచారి, దేవేందర్, సుమంగళి, హెడ్ నర్సులు సువర్ణ, సోలి, జ్యోతి, నర్సింగ్ పారామెడికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌ది చెడగొట్టే పని తప్ప బాగుచేసే పనికాదు

### మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట :** కాంగ్రెస్ పార్టీది చెడగొట్టే పని తప్ప బాగుచేసే పనికాదని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి ఆరోపించారు. సూర్యాపేటలో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం పట్టణంలోని పలు వార్డుల్లో పార్టీ కార్యాలయాలను ప్రారంభించి మీడియాతో మాట్లాడారు. కెసిఆర్ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధిని రెండేళ్లలో కాంగ్రెస్ నాయకులు ఆగం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధితో పాటు పదేండ్లలో పెంచిన పచ్చదనాన్ని సైతం ఎండబెడుతున్నారని, కాంగ్రెస్ మాయ మాటలు నమ్మి మోసపోయామని ప్రజలు భావిస్తున్నారన్నారు. మోసపోతే గోసపడతామని కెసిఆర్ ఎన్నోసార్లు చెప్పిండని, కానీ ప్రజలు కాంగ్రెస్ మాయగాళ్లను నమ్మినందుకు నట్టేట ముంచారని దుయ్యబట్టారు. మరోసారి మోసపోకుండా జాగ్రత్త పడాలని మున్సిపల్ ఎన్నికల్లో అరాచక కాంగ్రెస్‌ను ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. మిర్యాలగూడ సభలో సిఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. హార్వర్డ్ యూనివర్సిటికి వెళ్తే అందరికి జ్ఞానం పెరుగుతుంది కానీ రేవంత్‌కు ఉన్న ఆ కాస్త జ్ఞానం సైతం పోయిందని ఎద్దేవా చేశారు.

## ఇంట్లో నుంచే ఫర్టిలైజర్ యాప్‌తో యూరియా

### నల్లగొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫర్టిలైజర్ యూరియా యాప్ ద్వారా రైతులు కూర్చొన్న చోటు నుంచే యూరియా పొందవచ్చని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు. గురువారం మండలంలోని కొత్తగూడెం గ్రామంలో ప్రభుత్వ భూములను పరిశీలించడానికి వచ్చిన ఆయన రైతులతకు యూరియాపై అవగాహన కల్పించారు. యాప్ ద్వారా యూరియాను బుక్ చేసుకున్న రైతులు సులభంగా యూరియాను పొందే అవకాశం ఉందని గంటల తరబడి క్యూలైన్లో వేచి ఉండాల్సిన పని లేదన్నారు. అందువల్ల రైతులందరు ఫర్టిలైజర్ యూరియా యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాగా రైతులు తమకు యూరియా యాప్ ద్వారా ఓటీపీల విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, యూరియాను అన్ని దుకాణాల్లోనే అందించాలని కోరగా స్పందించిన కలెక్టర్ గుర్తించిన డీలర్ల వద్ద యూరియాను స్టాక్ ఉంచడం జరిగిందని, యూరి యా కోసం రైతులు పడకుండా ఉండేందుకు ప్రభుత్వం యూరియా యాప్‌ను తీసుకొచ్చిందని, దీని ద్వారా రైతులు సులువుగా యూరియా పొందవచ్చని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



# అన్ని మున్సిపాలిటీలలో కాంగ్రెస్‌దే గెలుపు

### మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
### అభివృద్ధిలో వామపక్ష అభ్యర్థులకు ప్రాధాన్యత ఇస్తామని వెల్లడి



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** రాష్ట్రంలోని మున్సిపాలిటిలలో అన్ని స్థానాలలో కాంగ్రెస్ పార్టీ క్లీన్ స్వీప్ చేస్తుందని రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం హుజూర్‌నగర్‌లోని 17వ వార్డులో సిపిఐ కౌన్సిలర్ అభ్యర్థి గుండు తిరపతమ్మను గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ పట్టణంలోని ప్రజల అభివృద్ధి కోసం కాంగ్రెస్ మిత్ర పక్షాల అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఆర్గనైజేషన్ పెరుగుతున్న నేపథ్యంలో మున్సిపాలిటిలలో అధిక మొత్తంలో నిధులు వెచ్చించి ప్రజలకు మౌలిక సదుపాయలను అందుబాటులోకి తెచ్చి, అభివృద్ధి సంక్షేమాన్ని అందుబాటులోకి తెస్తామన్నారు. వార్డులలో ప్రజలతో మాట్లాడుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వామపక్ష పార్టీల కౌన్సిలర్లకు అభివృద్ధి పథకాలలో తగిన భాగస్వామ్యం కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు, పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాస్, కొప్పోజు సూర్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు యరగాని నాగన్నగౌడ్, బెల్లంకొండ వెంకటనారాయణ, దొంగరి వెంకటేశ్వర్లు, ఈడుపుగంటి సుబ్బారావు, దాస నాగేశ్వర రావు, బచ్చు రామారావు పాల్గొన్నారు.

# నమ్మకాన్ని ఏనాడూ వమ్ము చేయలేదు...చేయబోను

### నల్లగొండను సూపర్ స్మార్ట్ సిటీగా చేసి తీరుతా
### బిఆర్ఎస్,బిజెపి పార్టీలు ప్రజల్లో లేవు...వారికి ఓటు వేస్తే వృథా అవుతుంది : మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి




**ప్రజాపక్షం/నల్లగొండ :** నల్లగొండ ప్రజలు నామీద ఉంచిన నమ్మకాన్ని ఏనాడు వమ్ము చేయలేదని ఇక మీదట కూడా చేయబోను అని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు.నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం గురువారం మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి,ఎమ్మెల్సీ శంకర్ నాయక్‌తో కలిసి నల్లగొండ పట్టణంలోనీ పలు డివిజన్లలో రోడ్‌షో నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే నాయకులనే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులుగా నిలిపిందన్నారు. ఈ ఎన్నికలు పేద ప్రజలకు మేలు చేసే ఎన్నికలని చెప్పారు.ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత రేషన్ కార్డులు,సన్నబియ్యం,ఇందిరమ్మ ఇండ్లు, చీరలు అందిస్తున్నామని,మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామని,200యూనిట్లు లోపు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇంటికి ఐదు లక్షల రూపాయల చొప్పున అర్హులైన ప్రతి పేదవారికి సొంతిల్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఒక్కొక్కటిగా అన్ని హామీలు నెరవేరుస్తామని చెప్పారు. 48కి 48 డివిజన్లలో కాంగ్రెస్ కార్పొరేటర్లు గెలిస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అడిగి నల్లగొండకు ఎక్కువ నిధులు తెస్తానని అన్నారు.నల్లగొండను సూపర్ స్మార్ట్ సిటీగా చేసి తీరుతానని,48మంది కాంగ్రెస్ కార్పొరేటర్లను గెలిపించి తనకు మరింత బలాన్ని ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ కార్పొరేటర్ అభ్యర్థులు ఆలకుంట్ల నాగరాజు,గురిజాల నరేందర్, గాలి వినోద,గోగుల గణేష్, గడిగ హిమబిందు, బొడ్డుపల్లి లక్ష్మి శ్రీనివాస్,అల్లి మల్లికార్జున్,బోయపల్లి వేదశ్రీ, నంద్యాల వీర బ్రహ్మానంద రెడ్డి, పుట్ట వెంకన్న గౌడ్,ఇటికాల మంగమ్మ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# చండూరును కూటమి కైవసం చేసుకోవాలి

### భారీ ఎన్నికల ర్యాలీ ,ప్రచారం నిర్వహించిన ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/చండూరు :** ప్రజా ఆశీర్వాదం కాంగ్రెస్ ,కమ్యూనిస్టు (సిపిఐ) మిత్రపక్షాల కూటమి వైపే ఉందని చండూరు మున్సిపాలిటీలో 10కి 10 స్థానాలు కైవసం చేసుకోవడం ఖాయం అని సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ధీమా వ్యక్తం చేశారు. గురువారం చండూరు మున్సిపాలిటీలోని 6వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి కోడి శ్రీనివాసులు , 4వ వార్డు సిపిఐ అభ్యర్థి జెల్లా ధనమ్మ శ్రీనివాస్ ,5 వార్డు కాంగ్రెస్ అభ్యర్థి కాట్రోతు సుగుణ చక్రవర్తి , మూడవ వార్డు అభ్యర్థి దోటి సుజాత వెంకటేశ్ యాదవ్ , సిపిఐ కాంగ్రెస్ నాయకులతో కలిసి బొడ్రాయి అమ్మవారికి కొబ్బరికాయలు కొట్టి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు, సిపిఐ నాయకులతో కలిసి మున్సిపాలిటీలో భారీ ఎన్నికల ర్యాలీ నిర్వహించారు. అనంతరం 4,5,3,6 వార్డులలో అభ్యర్థులతో కలిసి ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నాలువ వార్డులో కాంగ్రెస్ బలపర్చిన సిపిఐ అభ్యర్థి జెల్లా ధనమ్మ శ్రీనివాసులు కంకి కొడవలి గుర్తుపై , 5, 6,3 వార్డులలో సిపిఐ బలపర్చిన కాంగ్రెస్ అభ్యర్థుల చెయ్యి గుర్తుపై అత్యధిక ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. అనంతరం ఏర్పాటు చేసిన ర్యాలీలో ప్రజలనుద్దేశించి ఎమ్మెల్సీ సత్యం మాట్లాడుతూ రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చండూరు మున్సిపాలిటీలో చేసిన అభివృద్ధిని చూసి కాంగ్రెస్, కమ్యూనిస్టుల అభ్యర్థులను గెలించాలని అన్నారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్‌ను గెలిపిస్తే జోడెద్దుల్లాగా ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి , ఎమ్మెల్సీగా నెల్లికంటి సత్యంను కలిసి చండూరు మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఒక ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దే భాద్యత మాది అని ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ ప్రచార కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నల్పరాజు రామలింగయ్య , సిహెచ్ అంజాచారి, బొల్గూరి నర్సింహ్మా, తీర్పారి వెంకటేశ్వర్లు, సిపిఐ చండూరు మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్ , కాంగ్రెస్ చండూరు పట్టణ అధ్యక్షుడు అనంత చంద్రశేఖర్ గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొరిమి ఓంకారం, కాంగ్రెస్ నాయకులు కోడి గిరిబాబు, డాక్టర్ కోడి శ్రీనివాసులు , దోటి వెంకటేశ్ యాదవ్, నల్లగంటి మల్లేశం, వెంకటేశం పాల్గొన్నారు.



## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

### ఆలేరు విస్తృత ప్రచారంలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

**ప్రజాపక్షం/ఆలేరు :** ఆలేరు పట్టణంలో మున్సిపల్ ఎన్నికల ప్రచారం రెండో రోజు కూడా జోరుగా సాగింది. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య గడపగడపకు తిరుగుతూ ప్రజలను కలుసుకొని ఓటును అభ్యర్థించారు. ఆలేరు మున్సిపాలిటీలో మొత్తం 12 సీట్లకు 12 సీట్లు కాంగ్రెస్ పార్టీనే కైవసం చేసుకుంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పని చేస్తోందని తెలిపారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఇచ్చిన అమూల్యమైన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జనగామ ఉపేందర్ రెడ్డి, ఆలేరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఈసారపు యాదగిరిగౌడ్, టౌన్ అధ్యక్షులు ఏజాజ్, నాయకులు మాజీ సర్పంచ్ ఆకవరం మోహన్ రావు పాల్గొన్నారు.

## కెటిఆర్ ఒక 'ట్విట్టర్ టిల్లు'..

### బూతులకు బ్రాండ్ అంబాసిడర్ మీ నాన్నే: ఎంపి చామల ఫైర్

**ప్రజాపక్షం/యాదాద్రి :** బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లక్ష్యంగా భువనగిరి లోక్సభ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కేటీఆర్ సోషల్ మీడియా వేదికగా చేస్తున్న విమర్శలను 'చిల్లర మాటలు'గా అభివర్ణించిన ఆయన, కేటీఆర్ను 'ట్విట్టర్ టిల్లు' అంటూ ఎద్దేవా చేశారు. బుధవారం మీడియాతో మాట్లాడిన ఆయన, గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనపై, కేసీఆర్ కుటుంబ వైఖరిపై నిప్పులు చెరిగారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భాషపై కేటీఆర్ చేస్తున్న విమర్శలకు కౌంటర్ ఇస్తూ.. 'బూతు అనే పదానికి మీరే రాజులు. దేశంలో బూతులకు నాయకుడు ఎవరని గూగుల్లో వెతికితే మీ నాన్న కేసీఆర్ పేరే వస్తుంది. గతంలో కేసీఆర్ వాడిన భాష ఎలాంటిదో కేటీఆర్ ఒకసారి యూట్యూబ్లో చూసుకోవాలి' అని చామల హితవు పలికారు. రేవంత్ రెడ్డి భాష కేవలం అవతలి వ్యక్తుల ప్రవర్తనను బట్టే ఉంటుందని, ప్రజలకు అర్థమయ్యే రీతిలోనే సీఎం సమాధానం ఇస్తున్నారని సమర్థించారు. రానున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. 'వచ్చే వారం రోజుల్లో గల్లీల్లో బిఆర్ఎస్ 'దొంగల ముఠా' చేసే చిల్లర మాటలను నమ్మవద్దు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి' అని పిలుపునిచ్చారు. రెండేళ్లలోనే సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నారని, ఐదేళ్ల తర్వాత ప్రజలే న్యాయ నిర్ణేతలని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## మెరుగ్గా సంక్షేమ హాస్టళ్ల సౌకర్యాలు

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ :** తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల హాస్టల్, పాఠశాల, ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో వసతి, సౌకర్యాలు మెరుగ్గా ఉండాలని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. గురువారం సూర్యాపేట శివారులోని తెలంగాణ రాష్ట్రం సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల హాస్టల్, పాఠశాల, కళాశాలలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్లోని డైనింగ్ హాల్, స్టోర్ రూమ్, కిచెన్ షెడ్, లైబ్రరీ, ఇ క్లాస్ రూమ్, తరగతి గదులను కలియ తిరిగారు. కిచెన్ రూమ్‌లో విద్యార్థులకు వడ్డించుటకు తయారు చేసిన భోజనం, పప్పు, కూరలు, సాంబారును పరిశీలించారు. కూరగాయలు, పప్పులు, వంట నూనెలు, తదితర నిత్యావసరాలను తనిఖీ చేసి తాజా కూరగాయలు, నాణ్యమైన వంట పదార్థాలను వంటల్లో వినియోగించాలన్నారు. వంట సామాన్లు, కూరగాయలు వెలుతురు తగిలే విధంగా పైన ్ధన మీద ఉంచుకోవాలన్నారు. డైనింగ్, వాష్ ఏరియా ఎప్పుడు కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. తదుపరి తరగతి గదులను పరిశీలించి ఇంటర్మీడియట్, డిగ్రీ విద్యార్థులతో మాట్లాడారు. పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించాలన్నారు. హాస్టల్ భవనంలో ఏమైనా మైనర్ రిపేర్లు ఉన్నట్లయితే ప్రతిపాదనలు పంపించాలని సంబంధిత ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ, ఇంటర్మీడియెట్ ప్రిన్సిపాల్‌లు నీలా, అరుణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గోమాతల ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** దేవస్థానం పరిధిలోని గోశాలను ఇఒ జె.భవాని శంకర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోశాలలోని నిర్వహణ తీరును, గోవులకు అందుతున్న వసతులను ఆయన స్వయంగా పరిశీలించారు. ముందు గా గోశాలలో గోమాతలకు అందిస్తున్న దాణా ఫీడ్ మరియు గడ్డి నాణ్యతను ఈఓ పరిశీలించారు. పశుగ్రాసం నిల్వలకు సంబంధించి స్టాక్ రిజిస్టర్ను తనిఖీ చేసి, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా, గోసేవను భక్తిభావంతో చేయాలని సిబ్బందికి సూచించారు. గోమాతలు , దూడల ఆరోగ్య స్థితిగతులపై ఆయన ప్రత్యేకంగా చర్చించారు. వెటర్నరీ డాక్టర్ ద్వారా ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించాలి.వారానికి రెండు పర్యాయాలు తప్పనిసరిగా ఆరోగ్య తనిఖీలు చేపట్టి, నివేదికలు సిద్ధం చేయాలని పర్యవేక్షకులను , సహాయ కార్యనిర్వాహణాధికారిని ఆదేశించారు.ముంచుకొస్తున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని, ఎండ తీవ్రత నుండి గోవులను రక్షించేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని ఈఓ ,స్పష్టం చేశారు. గోశాల ఆవరణలో చల్లదనం నెలకొనేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌ను ఆదేశించారు. వేసవి తాపం తగలకుండా ఫ్యాన్లు లేదా ఫాగర్స్ వంటి ఏర్పాటుపై తక్షణమే దృష్టి సారించాలి. కార్యనిర్వాహణాధికారి ఈ తనిఖీ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దయాకర్ రెడ్డి, సహాయ కార్యనిర్వాహణాధికారి మహేష్ పాల్గొన్నారు.

# 12న దేశవ్యాప్త సమ్మె సక్సెస్ చేద్దాం

### ఐక్యకార్మిక సంఘాల పిలుపు




**ప్రజాపక్షం/నల్లగొండ :** కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె ను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల వీరారెడ్డి, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు అంబటి సోమయ్య, బిఆర్‌టియూ జిల్లా అధ్యక్షులు గుర్రం వెంకటరెడ్డి,ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మిడి నగేష్‌లు పిలుపునిచ్చారు. గురువారం నల్లగొండలోని ఎఐటియుసి జిల్లా కార్యాల యంలో జరిగిన ఐక్య కార్మిక సంఘాల సమావేశంలో వారు మాట్లాడుతూ బ్రిటీష్ పాలకుల పై పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలు మొత్తం కేంద్ర ప్రభుత్వం బడా పారిశ్రామిక వర్గాలు కు లాభం చేకూర్చాలని 50 కోట్ల కార్మికుల హక్కులను మోడీ ప్రభుత్వం కాలరాస్తున్నారనీ ఆరోపించారు.కార్మికుల కుటుంబాలను వీధిపాలు చేసేందుకు నరేంద్ర మోడీ ప్రభుత్వం బరితెగించి నూతనంగా నాలుగు లేబర్ కోడ్ లు తెచ్చి కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని ఆరోపించారు. తక్షణమే లేబర్ కోడ్ లను రద్దుచేసి పాత చట్టాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 12 సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి,సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు దండంపల్లి సత్తయ్య,ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు బొంగరాల నరసింహ,బిఆర్ఎస్ కెవి రాష్ట్ర నాయకులు చిలువేరు ప్రభాకర్,ఆర్ ఆచారి,ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు కెవిఎస్ రెడ్డి, ఎన్ వెంకటేశ్వర్లు, పాలెం వెంకట్ రావు,టీ దయాకర్,వి లెనిన్, కే యాదగిరి పాల్గొన్నారు.

# సిపిఐ అభ్యర్థి మొగుళ్ళ స్వాతిని ఆదరించండి

### సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి పిలుపు



**ప్రజాపక్షం/మోత్కూర్ :** కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సిపిఐ అభ్యర్థిని గెలిపించాలని మోత్కూర్ మున్సిపాలిటీ 5వ వార్డు బుజాలాపురం గ్రామంలో గురువారం ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి మొగుళ్ల స్వాతి శేఖర్ రెడ్డి గెలిపించాలని ఇంటింటా ప్రచారం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ మోత్కూరు మున్సిపాలిటీలో 12 వార్డులకు గాను 11 వార్డులకు కాంగ్రెస్ ఒక వార్డు సిపిఐ పొత్తులో భాగంగా పోటీ చేస్తున్నామని సిపిఐ వార్డులో కాంగ్రెస్ శ్రేణులు కమ్యూనిస్టు శ్రేణులు మిగతా చోట్ల కూడా కలసి ప్రచారం చేసి అభ్యర్థులను గెలిపించుకొని మోత్కూర్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవాలని కోరారు. ప్రజాపాలన కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రజాపాలన అందిస్తున్న తరుణంలో కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీని గెలిపించుకోవాల్సిన అవసరం ఉన్నది అందుకని ప్రజలు గతంలో అప్పులపాలు చేసిన బీఆర్ఎస్ పార్టీని ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ సహాయ కార్యదర్శి చంద్రయ్య, మండల కార్యదర్శి అన్నెపు వెంకట్, గీత పనివారల సంఘం జిల్లా అధ్యక్షుడు చాపల అంజయ్య, తెలంగాణ ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు పుష్పాక నరసింహ, సిపిఐ మండల సహాయ కార్యదర్శి పుల్కర మల్లేష్, అభ్యర్థి ముగుళ్ల స్వాతి శేఖర్ రెడ్డి, శాఖ కార్యదర్శి ఛేతరాశి సత్తయ్య, సిపిఐ మండల నాయకులు తొంట తిరుపతయ్య, కొమ్ము రాములు, బోడ సోమనస్య పాల్గొన్నారు.

## సాయి శ్రీని గెలిపిస్తే డివిజన్ అభివృద్ధి

**ప్రజాపక్షం/నలగొండ టౌన్:** కార్పొరేటర్‌గా పబ్బు సాయి శ్రీ సందీప్‌ని గెలిపిస్తే 42వ డివిజన్ అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి అన్నారు. నల్లగొండ మున్సిపాలిటీ కార్పొరేషన్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్,సిపిఐ పొత్తులో భాగంగా గురువారం పట్టణంలోని 42వ డివిజన్‌లో కాంగ్రెస్ కార్పొరేటర్ అభ్యర్థి పబ్బు సాయి శ్రీ సందీప్ గెలుపు కోరుతు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి సంపూర్ణ మద్దతు ఇచ్చి ఇంటింటి ప్రచారం నిర్వహించి కాంగ్రెస్‌కి ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు.ఈ సందర్భంగా వీరస్వామి మాట్లాడుతూ ఇంటింటి ప్రచారంలో ప్రజల నుండి మంచి స్పందన వచ్చిందని తెలిపారు.ఈడివిజన్ ప్రజలు సాయి శ్రీ కి ఒక అవకాశం ఇచ్చి గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కత్తుల తులసిదాసు,సైదులు,టి.గిరి,నాయకులు నల్ల నరసింహ,కత్తుల మారయ్య, రాజు,విషాని,ఆదమ్మ పూలమ్మ పాల్గొన్నారు.




ప్రజాపక్షం
Telugu National Daily



# అవే నిరసనలు...

- రాహుల్‌గాంధీని సభలో మాట్లడనీయకపోవడం సహా పలు అంశాలపై లోక్‌సభలో విపక్ష ఎంపిల ఆందోళనలు
- ప్రధాని జవాబు లేకుండానే మూజువాణి ఓటు మీద రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానం ఆమోదం



**న్యూఢిల్లీ:** లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ మాట్లాడేందుకు అనుమతి ఇవ్వకపోవడం సహా పలు అంశాలపై విపక్ష ఎంపిలు పార్లమెంట్ ఉభయసభల్లో నిరసనలకు దిగారు. దీంతో లోక్‌సభ, రాజ్యసభలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. లోక్‌సభలో గురువారం కూడా పలుమార్లు వాయిదాల పర్వం కొనసాగింది. ఉదయం 11 గంటలకు సభ సమావేశమైనప్పుడు, బుధవారం సభలో ప్రతిపక్ష ఎంపిల ప్రవర్తనపై స్పీకర్ ఆవేదన వ్యక్తం చేస్తూ సభా కార్యకలాపాలను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. సభ బుధవారం సాయంత్రం ప్రతిపక్ష సభ్యులు అధికార పక్షం వైపు దూసుకెళ్లిన తీరు సభ గౌరవానికి విరుద్ధమని బిర్లా అన్నారు. ఇటువంటి ప్రవర్తన సభ మర్యాద, గౌరవాన్ని దిగజారుస్తుందని, ఈ పరిస్థితులలో ఏ సభాధ్యక్షునికైనా సభను నడపడం కష్టమవుతుందని బిర్లా అన్నారు. ఆ తర్వాత ఆయన సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. మధ్యాహ్నం 12 గంటలకు సభ ప్రారంభం కాగానే గతంలో ఎప్పుడూ లేని విధంగా ప్రతిపక్షాల తీవ్ర నిరసనల మధ్య, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంప్రదాయ ప్రసంగం లేకుండానే రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానం ఆమోదించారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన సవరణలను ఓటింగ్‌కు పెట్టినప్పుడు ప్రధానమంత్రి సభలో లేరు, అయితే ఆ సవరణలు తిరస్కరించారు. అనంతరం స్పీకర్ జనవరి 28న పార్లమెంటు ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి చేసిన ప్రసంగానికి ధన్యవాద తీర్మానాన్ని చదివి వినిపించారు, దీనిని ప్రతిపక్ష సభ్యుల నినాదాల మధ్య మూజువాణి ఓటుతో ఆమోదించారు. నిరసనలు కొనసాగడంతో, స్పీకర్ సభ కార్యకలాపాలను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. కాంగ్రెస్ సభ్యులు ప్రధాని మోడీ చిత్రంతో 'నరేంద్ర–సరెండర్' అనే నినాదం రాసి ఉన్న పోస్టర్లను పట్టుకుని సభ మధ్యలోకి దూసుకెళ్లారు. సమాజ్‌వాదీ పార్టీ సభ్యులు కూడా వారణాసిలోని గంగా నదిపై ఉన్న మణికర్ణిక ఘాట్‌లోని కూల్చివేతల సమస్యను లేవనెత్తుతూ మూడు బ్యానర్లు, కరపత్రాలను పట్టుకుని సభ మధ్యలో నిలబడ్డారు. ఎస్‌పి బ్యానర్లపై దాదాపు 300 సంవత్సరాల క్రితం ఘాట్‌లను అభివృద్ధి చేసిన రాణి అహల్యాబాయి హోల్కర్ చిత్రాలు ఉన్నాయి. తృణమూల్ కాంగ్రెస్ సభ్యులు కూడా నిరసనలో పాల్గొంటూ సభ మధ్యలో నిలబడగా, డిఎంకె, వామపక్షాలతో సహా ఇండియా కూటమిలోని ఇతర సభ్యులు సంఘీభావంగా తమ సీట్లలో నుంచి లేచి నిలబడ్డారు. మధ్యాహ్నం 2 గంటలకు సభ తిరిగి సమావేశమైనప్పుడు, పలువురు ప్రతిపక్ష ఎంపిలు సభ మధ్యలోకి దూసుకెళ్లి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సభాపతి స్థానంలో ఉన్న సంధ్యా రాయ్ సభ్యులను తమ స్థానాల్లో కూర్చోవాలని కోరారు. కానీ నిరసనలు కొనసాగించడంతో ఆమె సభను మధ్యాహ్నం 3 గంటల వరకు వాయిదా వేశారు.

## రాజ్యసభలో అధికార, ప్రతిపక్షాల మధ్య
# తీవ్ర వాగ్వాదం

- లోక్‌సభలో రాహుల్‌గాంధీని మాట్లాడనీయని అంశాన్ని లేవనెత్తిన మల్లికార్జున ఖర్గే
- అనుమతించని చైర్మన్ రాధాకృష్ణన్
- ప్రభుత్వ వైఖరికి నిరసనగా ప్రతిపక్షాల వాకౌట్




**న్యూఢిల్లీ:** రాజ్యసభలో గురువారం అ ధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదాలు చోటుచేసుకున్నాయి. లోక్‌సభలో రాహుల్ గాంధీని మాట్లాడటానికి అనుమతించకపోవడంపై ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గే ఈ అంశాన్ని లేవనెత్తిన తర్వాత ప్రతిపక్షాలు వాకౌట్ చేశాయి. ఖర్గే రాహుల్‌గాంధీ అంశాన్ని లేవనెత్తారు. మాజీ ఆర్మీ చీఫ్ ఎం ఎం నరవణే రాసిన ప్రచురించని పుస్తకంలోని కొన్ని అంశాలను చదవడం ప్రారంభించంగానే, అందుకు ఆయనను అనుమతించలేదు, దీంతో ప్రతిపక్ష సభ్యులు వాకౌట్ చేశారు. సభలో ఒక మాజీ ఎంపి మృతికి సంతాపం తెలిపి జీరో అవరంలో చేపట్టాల్సిన కార్యకలాపాల పత్రాలను సభ ముందు ఉంచిన వెంటనే, ఖర్గే లోక్‌సభలో తన సహచరుడైన గాంధీని మాట్లాడటానికి అనుమతించకపోవడం అంశాన్ని లేవనెత్తారు. రాహుల్ గాంధీ దేశ ప్రయోజనాల గురించి మాట్లాడాలనుకున్నారని ఖర్గే అన్నారు. ఆయన తన మాట పూర్తి చేయకముందే, చైర్మన్ సిపి రాధాకృష్ణన్, సభాధ్యక్షుడి నిబంధనల ప్రకారం లోక్‌సభ కార్యకలాపాల గురించి ఎగువ సభలో చర్చించకూడదని చెబుతూ సభా నాయకుడు, కేంద్ర మంత్రి జగత్ ప్రకాష్ నడ్డాకు మాట్లాడే అవకాశం ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీకి ఆసక్తి ఉంటే, వారి నాయకులు తమ లోక్‌సభ ఎంపిలను దిగువ సభలో పార్లమెంట్ ఉభయ సభల సంయుక్త సమావేశంలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై జరిగే చర్చలో పాల్గొనమని సలహా ఇవ్వాలని, రాజ్యసభ కార్యకలాపాలు నిరంతరాయంగా కొనసాగేలా అనుమతించాలని ఆయన అన్నారు. ఆ తర్వాత జాబితాలో ఉన్న జీరో అవర్ ప్రస్తావనలను చేపట్టాలని చైర్మన్ కోరారు. దీంతో కాంగ్రెస్ ఎంపిలు ప్రజాస్వామ్యం గొంతు నొక్కుతున్నారని నినాదాలు చేయడం ప్రారంభించారు. ఆ సమయంలో చైర్మన్ పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజుకు మాట్లాడే అవకాశం ఇచ్చారు. రాష్ట్రపతికి ధన్యవాద తీర్మానంపై మూడు రోజుల పాటు సజావుగా చర్చ జరిగిన తర్వాత రాజ్యసభలో ఈ అంశాన్ని లేవనెత్తడం తనను ఆశ్చర్యపరిచిందని ఆయన అన్నారు. రాజ్యసభకు స్వంత విధానం, కార్యకలాపాల నిర్వహణకు నియమావళి ఉన్నందున, లోక్‌సభ కార్యకలాపాలను రాజ్యసభలో ప్రస్తావించకూడదనే నడ్డా వాదనను ఆయన పునరుద్ఘాటించారు. కాగా, కాంగ్రెస్ పార్టీ సభా కార్యకలాపాలకు అంతరాయం కలిగించాలని కోరుకోవడం లేదని ఖర్గే అన్నారు. ప్రతిపక్ష నాయకుడిని మాట్లాడటానికి అనుమతించకపోవడం వల్లే గత నాలుగు రోజులుగా లోక్‌సభ పనిచేయడం లేదని ఆయన అన్నారు. పార్లమెంటు రెండు సభలతో కూడి ఉంటుంది. అది ఒక సభతో ఏర్పడదు, అని ఆయన అన్నారు.

'ఈ రెండు (సభలు) (పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి) స్తంభాలు, కానీ మీ వైఫల్యాలను దాచడానికి ఒక స్తంభాన్ని పక్షవాతానికి గురిచేశారు... గాంధీ (వైఫల్యాల గురించి) మాట్లాడాలనుకున్నప్పుడు, మీరు చికాకు పడుతున్నారు'అని ఆయన ప్రభుత్వాన్ని ఉద్దేశించి అన్నారు. లోక్‌సభలో జరిగిన దాని గురించి రాజ్యసభలో చర్చించకూడదని చైర్మన్ రాధాకృష్ణన్ అన్నారు. అయితే, ఖర్గే పట్టువదలక లోక్‌సభలో ఆమోదించిన బిల్లులు చర్చ కోసం రాజ్యసభకు వస్తాయని చెప్పి తన వాదనను బలపరిచారు. గాంధీని మాట్లాడటానికి అనుమతించకపోవడం ప్రజాస్వామ్యానికి, దేశానికి మంచిది కాదని ఆయన మళ్ళీ ప్రస్తావించగా, చైర్మన్ నడ్డాను మాట్లాడటానికి అనుమతించారు. ప్రభుత్వం అన్ని రూపాల్లో, అన్ని సమయాల్లో చర్చకు సిద్ధంగా ఉందని నడ్డా అన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడైన ఖర్గేకు, పార్టీని స్వతంత్రంగా నడపాలని, దానిని 'అజ్ఞాని అయిన బాలుడికి'బందీగా మారకుండా చూడాలని ఆయన సలహా ఇచ్చారు. గాంధీని ఉద్దేశించి 'అజ్ఞాని అయిన బాలుడు' అనే పదాన్ని ఉపయోగించడాన్ని ఖర్గే ఖండించారు. బిజెపి ఎంపిలు తమ మనసులో మాట కూడా చెప్పలేరని ఆరోపించారు. బిజెపి ప్రజాస్వామ్యాన్ని అణచివేస్తున్నందున, మంత్రులు తన పార్టీకి నీతులు చెప్పలేరని ఆయన అన్నారు.

## ఏనుగుల గుంపు తొక్కి, ఒకే కుటుంబ చెందిన సభ్యులు మృతి

**బొకారో:** జార్ఖండ్‌లోని బొకారోలో గురువారం ఐదు ఏనుగుల గుంపు ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురిని తొక్కి చంపిందని అటవీ శాఖ అధికారి తెలిపారు. ఈ ఘటన మహువాదండర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బర్కిపున్ను గ్రామంలో తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో జరిగింది.'ఏనుగుల గుంపు వరి ధాన్యం కోసం వారి ఇంటిపై దాడి చేసి, దానిలో కొంత భాగాన్ని ధ్వంసం చేసింది. ఆ ముగ్గురూ తప్పించుకోవడానికి ప్రయత్నించినప్పుడు, ఇంటి బయట ఏనుగులు వారిని తొక్కిచంపాయి, ' అని బొకారో డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ సందీప్ షిండే తెలిపారు. ఆ ఏనుగుల గుంపు చాలా రోజులుగా బర్కిపున్ను ప్రాంతంలో తిరుగుతోందని ఆయన చెప్పారు. మృతుల కుటుంబ సభ్యులకు పరిహారం చెల్లించే ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. జనవరి 18న, అదే మహువాదండర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక కూరగాయల వ్యాపారి ఇంటికి వెళ్తుండగా ఏనుగు దాడిలో మరణించాడని షిండే చెప్పారు. జనవరి నెలలో రాష్ట్రంలో ఏనుగుల దాడిలో 25 మందికి పైగా మరణించారని అటవీ శాఖ అధికారి తెలిపారు. గతంలో పశ్చిమ సింగ్భూమ్ జిల్లాలో ఒకే మదపుటేనుగు 20 మంది ప్రాణాలను బలిగొందని ఆయన చెప్పారు. ప్రభుత్వ నివేదిక ప్రకారం, 2019–20 ఆర్థిక సంవత్సరం నుండి జార్ఖండ్‌లోని మానవఏనుగుల సంఘర్షణల కారణంగా ఏకంగా 474 మంది మరణించారు.

## వచ్చే నెల భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందం


### కేంద్రమంత్రి గోయల్



**న్యూఢిల్లీ:** భారత్–అమెరికా మధ్య వచ్చేనెల రెండోవారం నాటికి వాణిజ్య ఒప్పందం జరుగుతుందని భావిస్తున్నట్లు వాణిజ్యం–పరిశ్రమలశాఖ కేంద్రమంత్రి పీయూశ్ గోయల్ చెప్పారు. ఈ ఒప్పందంపై సంతకాలు చేసిన తర్వాత అమెరికా నుండి దిగమతయ్యే కొన్ని వస్తువులపై దిగుమతి సుంకాలను భారత్ తగ్గించడం ప్రారంభిస్తుందని మంత్రి గురువారం పాత్రికేయులకు చెప్పారు. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం తొలిదశను ఖరారు చేసి, ఉమ్మడి ప్రకటనపై రాబోయే నాలుగైదు రోజుల్లో రెండు దేశాలు సంతకాలు చేస్తాయని అంచనావేస్తున్నట్లు కూడా చెప్పారు. ఈ ఒప్పందంలో పెట్టుబడులకు సంబంధించిన కట్టుబాట్లు ఏవీ లేవని చెప్పారు. భారత్‌పై విధించిన 50 శాతం సుంకాలను 18 శాతానికి అమెరికా తగ్గించిన తర్వాత ఈ పరిణామాలు సంభవించాయి. ఈ వారారంభంలోనే రెండు దేశాలు ద్వైపాక్షిక ఒప్పందాన్ని ఖరారు చేశాయి. ప్రస్తుతం ఎగుమతి చేస్తున్న సరుకులపై భారత్ 50 శాతం సుంకాలను అమెరికాకు చెల్లిస్తోంది. ఇందులో సాధారణ టారిఫ్ 25 శాతం ఉండగా, రష్యా నుండి భారత్ చమురు దిగుమతి చేసుకుంటోందన్న వంకతో అమెరికా అదనంగా మరో 25 శాతం సుంకాలను జరిమానాగా విధించింది. ఈ ద్వైపాక్షిక ఒప్పందం (బిటిఎ)లో మొదటిదశ పత్రాలు ఇప్పటికే సిద్ధంగా ఉన్నాయని, రాబోయే ఐదు రోజుల్లో సంతకాలు జరుగుతుయని భావిస్తున్నామన్నారు. ఈ ఒప్పందంపై ఆధారపడి మొదటిదశ భాగస్వామ్యం ప్రారంభమవుతుందన్నారు. లాంఛనపూర్వకమైన ఒప్పంద పత్రాలు సిద్ధమవుతున్నాయని, మార్చి రెండో వారంనాటికి వీటిపై సంతకాలు జరిగే అవకాశం ఉందన్నారు. వాణిజ్యశాఖ కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ మాట్లాడుతూ, చట్టబద్ధంగా సంతకాలు జరిగిన పత్రాలు చేతికి వచ్చిన తర్వాత అమెరికా నుండి దిగుమతయ్యే వస్తువులపై సుంకాలను తగ్గించడానికి వీలు కలుగుతుందన్నారు. "చట్టబద్ధమైన ఒప్పందం తర్వాతే దేశంలో అమెరికా వస్తువులపై సుంకాలను తగ్గించడానికి అవకాశం ఉంది, ఈ లోపు పాత సుంకాలే అమలులో ఉంటాయి, అత్యంత సన్నిహితదేశాల(ఎంఎఫ్ఎన్)జాబితా కింద భారతదేశం ఆమెరికా దిగుమతులపై ఫీజు వసూలు చేస్తుంది, భారత్ దిగుమతి వస్తువులపై అమెరికా సుంకం వసూలు చేస్తుంది" అని చెప్పారు. 500 బిలియన్ డాలర్ల కొనుగోళ్ళ గురించి ప్రశ్నించగా, శరవేగంగా అభివృద్ధి చెందుతున్న మనదేశానికి చాలా భారీ పరిమాణంలో ఇంధనం,డేటా సెంటర్ల పరికరాలు, ఐసిటి ఉత్పత్తులు అవసరం అవుతాయని అందుకే ఈ కొనుగోళ్ళు చేయాల్సి ఉందన్నారు. మన ఉక్కు సామర్థ్యం రాబోయే కొద్ది సంవత్సరాలలో ప్రస్తుతం ఉన్న 140 మిలియన్ టన్నుల నుండి 300 మిలియన్ టన్నులకు పెరుగుతుందని అందువల్ల మన అంచనాల ప్రకారం అమెరికా నుండి ఉక్కు అవసరం అవుతుందన్నారు. ఈ మొత్తం చివరకు 500 బిలియన్ డాలర్లుగా తేలుతుందని చెప్పారు. రాబోయే ఐదు సంవత్సరాలలో మనదేశం సేకరించే ఉత్పత్తులను చూసినప్పుడు మన దేశ సామర్థ్యం ఏమిటో మనకళ్ళముందే సాక్షాత్కారమవుతుందని చెప్పారు. మన గగనయాన రంగంలో బోయింగ్‌లకు ఇప్పటికే ఆర్డర్లు ఉన్నాయని, రాబోయే రోజుల్లో పెట్టే ఆర్డర్లకు కూడా సరిపడే సామాగ్రి సిద్ధంగా ఉందని దాదాపు 70,80 బిలియన్ డాలర్ల మేరకు ఈ ఆర్డర్లు ఉంటాయన్నారు. ఇంజన్లు, ఇతర విడిభాగాలను కూడా మనకు కలిపి చూసినప్పుడు దాదాపుగా ఈ మొత్తం 100 బిలియన్ డాలర్లకు చేరుతుందని వివరించారు. డేటా సెంటర్లకుగాను బడ్జెట్‌లో భారీ రాయితీలను ప్రకటించామని గుర్తుచేశారు. "ఇప్పుడు మీరు ఊహించండి, డేటా సెంటర్లపై మనం 100–150 బిలియన్ డాలర్ల మేరకు పెట్టుబడులు సంపాదించుకోగలుగుతాం, మనకు ఈ మేరకు చూసినప్పుడు ఎలా కాదనుకున్నాగానీ ఆ డేటా సెంటర్లకు పరికరాలు అవసరం అవుతాయి" అన్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా భారతదేశం 300 బిలియన్ డాలర్ల మేరకు కొనుగోళ్ళు చేస్తోందన్నారు. రాబోయే ఐదేళ్ళలో ఈ కొనుగోళ్ళు మరో రెండు బిలియన్ డాలర్లు పెరుగుతాయన్నారు.

## సమాఖ్యవాదం... రాజ్యాంగ ఆదేశం...

### నాలుగు కార్మిక కోడ్‌లను తీసుకురావడం సంస్కరణ కాదు...
### ధన్యవాద తీర్మాణంపై చర్చలో సిపిఐ రాజ్య సభ సభ్యుడు పి.పి.సునీర్



**న్యూఢిల్లీ :**కార్మిక సంస్కరణల పేరుతో కార్మికులతో అర్థవంతమైన సంప్రదింపులు లేకుండానే కేంద్ర ప్రభుత్వం 29 కి పైగా కేంద్ర కార్మిక చట్టాల స్థానంలో నాలుగు కార్మిక కోడ్‌లను తీసుకువచ్చిందని, ఇది సంస్కరణ కాదు, చట్టాల ఉపసంహరణ అని సిపిఐ రాజ్య సభ సభ్యుడు పి.పి.సునీర్ విమర్శించారు. రాష్ట్రపతి ప్రసంగంపై రాజ్య సభలో జరిగిన ధన్యవాద తీర్మానంపై చర్చలో ఆయన మాట్లాడారు. కార్మిక కోడ్‌లు ఉద్యోగ భద్రతను బలహీనపరుస్తాయని, సామాజిక రక్షణను పలుచన చేస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రపతి ప్రసంగం ప్రజల జీవన వాస్తవాలను ప్రతిబింబించడంలో విఫలమైందని అన్నారు.సమాఖ్యవాదం మన రాజ్యాంగం ప్రాథమిక లక్షణం అని సర్కారియా కమిషన్ చెబుతోందని,కానీ కేరళ వంటి రాష్ట్రాలు విపత్తు సహాయం కోసం సైతం కోర్టులను ఆశ్రయించవలసి వస్తోందన్నారు. రుణాల పరిమితి, ఆలస్యంగా బకాయిల చెల్లింపు, ఏకపక్ష ఆర్థిక నియమాలు ఆర్థిక దిగ్బంధనంతో సమానమన్నారు. ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల పట్ల కేంద్రం బెదిరింపు ధోరణిని అవలంబిస్తున్నట్లు కనిపిస్తోందన్నారు. సమాఖ్యవాదం అనేది కేంద్రం చేసే మేలు కాదని, అది రాజ్యాంగ ఆదేశమని పేర్కొన్నారు. 2025–26 ఆర్థిక సర్వేలో యుపిఎ–1 ప్రభుత్వం మహాత్మాగాంధీ నరేగాతో పాటు అమలు చేసిన సమాచార హక్కు చట్టాన్ని పునఃపరిశీలించాలని సూచించిందన్నారు.గత దశాబ్దంలో కేంద్ర ప్రభుత్వం ఆర్‌టిఐ చట్టాన్ని క్రమంగా బలహీనపరిచిందని, 2019లో సవరణ చేసి సమాచార కమిషనర్ల పదవీకాలం, సర్వీసు కండిషన్‌లను కేంద్ర ప్రభుత్వ అభీష్టానుసారం మార్చడంతో సమాచార కమిషన్ల స్వాతంత్ర్యాన్ని దెబ్బ తీశారని సునీర్ మండిపడ్డారు. ఆర్‌టిఐ నియమాలలో విధానపరమైన మార్పులు సమాచారాన్ని పొందడం కష్టతరం చేశారని, ఈ చట్టాన్ని మరింతగా కుదించడం ప్రజాస్వామ్య జవాబుదారీతనం, ప్రజల విశ్వాసానికి ప్రమాదకరమని హెచ్చరించారు. విదేశాంగ విధానం విషయంలో, ఉక్రెయిన్, గాజా, వెనిజులా, ఐక్య రాజ్య సమితి మానవ హక్కుల మండలి వరకు ప్రధాన మానవతా సంక్షోభాలపై భారతదేశం మౌనంగా ఉండడాన్ని సునీర్ తప్పుబట్టారు. అమెరికా చర్యలను భారత ప్రభుత్వం ఖండించాలని, 'బోర్డ్ ఆఫ్ పీస్'లో చేరాలన్న అమెరికా ఆహ్వానాన్ని తిరస్కరించాలని డిమాండ్ చేశారు.

## సరిహద్దు కంచె కోసం
# భూమి ఇచ్చేందుకు అభ్యంతరం లేదు

### బిఎస్ఎఫ్ అధికార పరిధి పెంపు ఏకపక్ష నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి
### బెంగాల్ సిఎం మమతా బెనర్జీ



**కోల్‌కతా:** సరిహద్దు కంచె కోసం భూమిని అందించడానికి తమ ప్రభుత్వానికి ఎలాంటి అభ్యంతరం లేదని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పష్టం చేశారు. అయితే రాష్ట్రంలో బిఎస్ఎఫ్ అధికార పరిధిని 15 కిలోమీటర్ల నుండి 50 కిలోమీటర్లకు విస్తరించాలనే ఏకపక్ష నిర్ణయాన్ని కేంద్రం ముందుగా వెనక్కి తీసుకోవాలని పట్టుబట్టారు. గురువారం గవర్నర్ ప్రసంగంపై అసెంబ్లీలో జరిగిన చర్చ సందర్భంగా, సరిహద్దు కంచె నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఆటంకం కలిగిస్తోందన్న కేంద్రం, బిజెపి ఆరోపణలను బెనర్జీ తోసిపుచ్చారు. బిఎస్ఎఫ్‌తో సహా అన్ని కేంద్ర సంస్థలకు, ఏజెన్సీలకు ఇప్పటికే భూమిని అందించామని ఆమె స్పష్టం చేశారు. 'భూమి సమస్య కాదు. మీకు భూమి లభిస్తుంది. కానీ ముందుగా, బిఎస్ఎఫ్ అధికార పరిధిని 15 కిలోమీటర్ల నుండి 50 కిలోమీటర్లకు పెంచే ఏకపక్ష నిబంధనను మార్చండి' అని జాతీయ భద్రతకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటిస్తూ ఆమె అన్నారు. కంచె నిర్మాణంలో జాప్యం, అక్రమ వలసలు, బంగ్లాదేశ్‌తో పశ్చిమ బెంగాల్ సుదీర్ఘమైన, సులభంగా చొరబడటానికి వీలున్న సరిహద్దుల నిర్వహణపై కేంద్రం, తృణమూల్ కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వం మధ్య కొత్తగా మాటల యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో మమత బెనర్జీ వ్యాఖ్యలు చేశారు. ఇటీవల కంచె నిర్మాణంలో రాష్ట్రం సహకరించడం లేదని ఆరోపించిన కేంద్ర హోంమంత్రి అమిత్ షాను బెనర్జీ నేరుగా లక్ష్యంగా చేసుకున్నారు. రాష్ట్రం ఇప్పటికే ఎంత భూమిని ఇచ్చిందనే పూర్తి వివరాలను ఆయన చెప్పడం లేదన్నారు. రైల్వేల నుండి రక్షణ సంస్థల వరకు కేంద్ర ఏజెన్సీలకు భూమి కేటాయించబడిందని ఆమె తెలిపారు. చొరబాట్లపై బిజెపి పదేపదే దృష్టి సారించడాన్ని ప్రస్తావిస్తూ, కేవలం భద్రతపైనే దృష్టి పెట్టే సంకుచిత వైఖరిని ప్రశ్నించారు. 'వారికి చొరబాటు అనే ఒక్క మాటే తెలుసు. యువత, కొత్త ఓటర్లు ఓటర్ల జాబితాలో నమోదు కారా?' అని ఆమె ప్రశ్నించారు. సరిహద్దు ప్రాంతాలలో అధిక భద్రతా చర్యలు ప్రజాస్వామ్య ప్రక్రియలకు, సాధారణ ప్రజల జీవితాలకు అంతరాయం కలిగించే ప్రమాదం ఉందని ఆమె పేర్కొన్నారు. మమతా బెనర్జీ ప్రసంగిస్తుండగా ఆమెకు ప్రతిపక్ష నాయకుడు సువేందు అధికారి మధ్య తీవ్రమైన రాజకీయ వాగ్వాదంగా మారింది. చొరబాట్ల కారణంగా జనాభా మార్పులు తీవ్రమైన ముప్పును కలిగిస్తున్నాయని ఆయన ఆరోపించారు. కంచె కోసం భూమి కోరుతూ కేంద్రం చాలాసార్లు లేఖలు రాసినా, రాష్ట్రం భూమిని ఇవ్వలేదని ఆయన పేర్కొన్నారు. ఈ ఆరోపణను బెనర్జీ తోసిపుచ్చారు. తాను చాలా మంది హోం మంత్రులను చూశానని, తనకు పాలనపై పాఠాలు చెప్పాల్సిన అవసరం లేదని అన్నారు. 'మేము సెయిల్, రైల్వేలు, అన్ని కేంద్ర ఏజెన్సీలకు భూమి ఇచ్చాము. ఇప్పటికే ఇచ్చిన భూమిలో పని పూర్తి చేయండి, అప్పుడు మేము మరికొంత ఇస్తాము' అని ఆమె అన్నారు. తాము ఇప్పటికే ఎంత భూమిని అప్పగించామో బహిరంగంగా లెక్క చెప్పాల్సిన బాధ్యత రాష్ట్రానికి లేదని ఆమె స్పష్టం చేశారు. చొరబాటు, రోహింగ్యాలకు సంబంధించిన ఆరోపణల విషయంలో, బెనర్జీ సాక్ష్యాలను చూపించమని బిజెఐకి సవాలు విసిరారు. 'మీరు ఒక్క రోహింగ్యానైనా కనుగొన్నారా? ఈ ఓటర్ల జాబితాపైనే 2024లో ఎన్నికలు జరిగాయి. ఏదైనా సమస్య ఉంటే, ప్రధానమంత్రిని రాజీనామా చేయమని అడగండి' అని చర్చ సందర్భంగా ఆమె పదునైనా వ్యాఖ్యలు చేశారు.

## 'విబి–జి రామ్ జి'ని ఉపసంహరించుకోవాలి

### ఎంజినరేగాను పునరుద్ధరించాలి
### కేరళ అసెంబ్లీ తీర్మానం



**తిరువనతంపురం:** కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన 'విబి–జి రామ్ జి' చట్టాన్ని ఉపసంహరించుకుని, ఎంజిఎన్ఆర్ఇజిఎను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ కేరళ అసెంబ్లీ గురువారం తీర్మానాన్ని ఆమోదించింది. దీంతో యుపిఎ హయాంలోని గ్రామీణ ఉపాధి పథకానికి మద్దతుగా నిలిచిన ఇతర మూడు బిజెపియేతర పాలిత దక్షిణ రాష్ట్రాల సరసన కేరళ కూడా చేరింది. రాష్ట్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ఎం.బి. రాజేష్ ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టగా, శబరిమల బంగారం నష్టం అంశంపై ప్రతిపక్ష కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ నిరసనల మధ్య సభ దీనిని ఆమోదించింది. కాంగ్రెస్ పాలిత కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలతో పాటు, డిఎంకె అధికారంలో ఉన్న తమిళనాడు కూడా అంతకు ముందు వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్)ను ఉపసంహరించుకుని, ఎంజిఎన్ఆర్ఇజిఎను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ తీర్మానాలను ఆమోదించాయి. పూర్తిగా కేంద్ర ప్రాయోజిత పథకమైన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజి నరేగా) వలె కాకుండా, 'విబి–జి రామ్ జి' పథకంలో రాష్ట్రం 40 శాతం వ్యయాన్ని భరించాల్సి ఉంటుందని రాజేష్ అన్నారు. ఈ కొత్త చట్టాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ఇతర దక్షిణ రాష్ట్రాలు కూడా ఇదే ఆందోళనను పంచుకుంటున్నాయని ఆయన గుర్తుచేశారు. ఈ కొత్త పథకం రాష్ట్రాలపై భారీ ఆర్థిక భారాన్ని మోపుతుందని, మునుపటి చట్టానికి మూలమైన హక్కుల ఆధారిత నిబంధనలు ఇందులో లేవని ఆయన అన్నారు. కొత్త పథకం కింద గ్రామ పంచాయతీలను 'ఎ, బి,సి' కేటగిరీలుగా వర్గీకరించాల్సి ఉంటుందని, కేంద్రం నోటిఫై చేసిన ప్రాంతాల్లో మాత్రమే ఈ ఉపాధి పథకం అందుబాటులో ఉంటుందని మంత్రి తెలిపారు. దీని ఫలితంగా కేరళలోని చాలా గ్రామ పంచాయతీలు ఇతర రాష్ట్రాల లోని వాటితో పోలిస్తే మరింత అభివృద్ధి చెందినందున, ఉన్నత కేటగిరీలో చేర్చబడతాయని, తద్వారా ఈ పథకం నుండి మినహాయించబడవచ్చని ఆయన అన్నారు. గ్రామీణ ఉపాధి పథకం కింద పనిచేసే కార్మికులు ఈ కొత్త పథకాన్ని వ్యతిరేకిస్తున్నారని, ఇది 'ప్రజా వ్యతిరేకమైనది' వారి పని హక్కును హరిస్తుంది అని రాజేష్ పేర్కొన్నారు.'అందువల్ల, పేదరిక నిర్మూలనకు హాని కలిగించే ఉపాధి కల్పన భారాన్ని రాష్ట్రాలపై మోపే ఈ కొత్త పథకాన్ని ఉపసంహరించుకుని, పాత ఎంజిఎన్ఆర్ఇజిఎను పునరుద్ధరించాలని ఈ సభ డిమాండ్ చేస్తోంది' అని ఆయన అన్నారు. కాకతాళీయంగా, కర్ణాటక అసెంబ్లీ బుధవారం ఇలాంటి తీర్మానాన్నే ఆమోదించగా, మిగిలిన రెండు రాష్ట్రాలు గత నెలలో ఈ పని చేశాయి.

## 2024-25లో 22 లక్షలకు పైగా ప్రజల ఫిర్యాదులు

### రాజ్యసభలో కేంద్రం

న్యూఢిల్లీ : ప్రత్యేక సిపిజిఆర్ఎఎంఎస్ పోర్టల్ ద్వారా 2024–25 సంవత్సరంలో 22 లక్షలకు పైగా ప్రజల ఫిర్యాదులు అందినట్లు గురువారం రాజ్యసభకు తెలియజేశారు. కేంద్రీకృత ప్రజా ఫిర్యాదుల పరిష్కార, పర్యవేక్షణ వ్యవస్థ (సిపిగ్రామ్స్) ప్రభుత్వ విభాగాలపై ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు చేయడానికి అనుమతిస్తుంది. 2024–25లో కేంద్ర మంత్రిత్వ శాఖలు/విభాగాలు, రాష్ట్ర/కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వాలపై మొత్తం 22,23,186 ఫిర్యాదులు నమోదయ్యాయని సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్ల శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ లిఖిత పూర్వక సమాధానంలో తెలిపారు. వీటిలో 23,02,236 (ముందు సంవత్సరాల నుండి బకాయి ఉన్న వాటితో సహా) పరిష్కరించబడ్డాయని ఆయన చెప్పారు. 2023–24 సంవత్సరంలో నమోదైన మొత్తం 23,16,710 ఫిర్యాదులలో, 25,28,603 (మునుపటి సంవత్సరం నుండి బకాయి ఉన్న వాటితో సహా) పరిష్కరించబడ్డాయని మంత్రి తెలిపారు.'2023–24, 2024–25 సంవత్సరాలలో, సిపిగ్రామ్స్‌లో ప్రజా ఫిర్యాదుల సగటు పరిష్కార సమయం కేంద్ర మంత్రిత్వ శాఖలు/విభాగాలకు 16 రోజులు, 15 రోజులు, రాష్ట్ర/కేంద్రపాలిత ప్రభుత్వాలకు వరుసగా 119 రోజులు, 64 రోజులుగా ఉంది' అని సింగ్ అన్నారు.అన్ని కేంద్ర మంత్రిత్వ శాఖలు/విభాగాలకు, రాష్ట్ర/కేంద్రపాలిత ప్రభుత్వాలకు వారి సంబంధిత విషయాలకు సంబంధించిన ప్రజా ఫిర్యాదులను ప్రాసెస్ చేయడానికి సిపిగ్రామ్స్‌కు పాత్ర ఆధారిత యాక్సెస్ ఉందని మంత్రి తెలిపారు. ఫిర్యాదుల పరిష్కార అంచనా, సూచిక (జిఆర్ఎఐ)లో కేంద్ర మంత్రిత్వ శాఖలు/విభాగాల ఫిర్యాదుల పరిష్కార పనితీరును అంచనా వేయడానికి 11 సూచికలు ఉపయోగించబడతాయని ఆయన చెప్పారు.

## 5 తేజస్ మార్క్1–ఎ
# యుద్ధ విమానాలు రెడీ



### హెచ్ఎఎల్ కంపెనీ కీలక ప్రకటన..

**న్యూఢిల్లీ:** మిలిటరీ విమానాల ఉత్పత్తి సంస్థ హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ గురువారం కీలక ప్రకటన చేసింది. 5 తేజస్ మార్క్1–ఎ ఫైటర్ విమానాలు సంపూర్ణంగా సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నది. భారతీయ వైమానిక దళం కోసం ఈ యుద్ధ విమానాలను ఉత్పత్తి చేశారు. అయితే ఫ్యాక్టరీలో మరో 9 విమానాలు రెడీగా ఉన్నాయని, అమెరికా జనరల్ ఎలక్ట్రిక్ సంస్థ సరఫరా చేసే ఇంజిన్ల కోసం ఎదురుచూస్తున్నట్లు హెచ్ఎఎల్ తన ప్రకటనలో చెప్పింది. లివరీ కోసం అయిదు విమానాలు రెడీ అయ్యాయని, ఒప్పందం ప్రకారం ఆ విమానాలను రూపొందించామని, అదనంగా 9 విమానాలను నిర్మించామని, అమెరికా ఇంజిన్ల కోసం ఎదురుచూస్తున్న బెంగుళూరుకు చెందిన హిందుస్తాన్ ఏరోనాటిక్స్ కంపెనీ వెల్లడించింది. జీఈ సంస్థ నుంచి అనుకున్న తేదీ ప్రకారం అయిదు ఇంజిన్లు అందినట్లు హెచ్ఏఎల్ చెప్పింది. ఎఫ్404 ఇంజిన్ల సరఫరాలో ఆలస్యం వల్ల తేజస్ మార్క్ 1ఏ జెట్ల డెలివరీ ఆలస్యమైనట్లు పేర్కొన్నది. భారతీయ వైమానిక దళం కోసం హెచ్ఎఎల్ సంస్థ 180 యుద్ధ విమానాలను ఉత్పత్తి చేస్తున్నది. వాస్తవానికి మార్చి 2024 నాటికి ఆ విమానాల డెలివరీ ప్రక్రియ స్టార్ట్ కావాల్సి ఉంది. కానీ ఇంజిన్ల సరఫరాలో ఆలస్యం వల్ల .. విమానాల ఉత్పత్తిలో జాప్యం జరిగినట్లు కంపెనీ పేర్కొన్నది.


SHRIRAM Finance వాహనముల బహిరంగ వేలం ప్రకటన

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీనపరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించబడినది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | TS08UD 4824 | Yashashwini Yedla | EICHER PRO 3009 SKYLINE FBV-P | 2016 |
| 2 | TS03UC 3492 | Laxmi Uppu | APE PICK UP XTRA LD | 2018 |
| 3 | TS03UC 7530 | Naresh Bonagiri | APE XTRA LDX | 2020 |
| 4 | AP07TM 4428 | Ranjith Rendla | AL U TRUCK 2518 FBT-T | 2018 |
| 5 | TS05UB 2666 | Siripuram Vijaynath | TATA LPT 3118 CUMMINS FBT | 2016 |

AUCTION DATE : 07-02-2026
VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL
గమనిక : వేలం తేదీ ప్రకటన నుండి బండి అమ్ముడు అయ్యే వరకు వర్తించును
SHRIRAM FINANCE LIMITED
D.No:5-11-503 & 504, Kandakatla Gateway 3rd floor, KUC X Road, Hanamkonda - 506009. Cell : 9849955900 & 9573787776

# ప్రజాస్వామ్యానికి పరీక్ష!

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థ విషమ పరీక్షలు ఎదుర్కొంటున్నది. రాజ్యాంగం అందించిన హక్కులు, స్వేచ్ఛ, సంస్థాగత వ్యవస్థలతోపాటు, చర్చలు... విమర్శలు, సమీక్షల సంస్కృతి కూడా ప్రజాస్వామ్యానికి కీలకమే. పార్లమెంటు ప్రధానంగా చట్టాలు చేసే వేదిక. అదే సమయంలో ప్రజల గొంతుక. వారి ఆశలు, ఆందోళనలు, అభిప్రాయాలకు ప్రతిబింబం. అలాంటి పార్లమెంటులో చర్చకు, అభిప్రాయాలకు చోటు తగ్గుతున్న సంకేతాలు కనిపిస్తే, అది కేవలం రాజకీయ ఘర్షణగా మాత్రమేగాక, ప్రజాస్వామ్య తీరుతెన్నులపై ప్రభావం చూపే అంశంగా చూడాల్సి ఉంటుంది. ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లో, గురువారం చోటు చేసుకున్న రెండు ఘటనలు బిజెపి హయాంలో ప్రజాస్వామ్యానికి పట్టిన దుర్గతిని స్పష్టం చేస్తున్నాయన్న విమర్శల్లో నిజం లేకపోలేదు. ప్రతిపక్ష పార్టీలు ప్రస్తావించిన అంశాలను యావత్ దేశం ఒకసారి ఆలకించి, ఆలోచించి, భవిష్యత్తుపై స్పష్టమైన నిర్ణయానికి రావాలి. ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి మాట్లాడే అవకాశం ఇవ్వకపోవడం, రాష్ట్రపతి ప్రసంగానికి కృతజ్ఞతలు తెలిపే తీర్మానం విషయంలో కనీస మర్యాద పాటించకపోవడం అత్యంత దారుణం. దేశం ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలపై, ప్రజల తరఫున ప్రతిపక్ష పార్టీలు గొంతు విప్పుతాయి. ప్రశ్నిస్తాయి. నిలదీస్తాయి. లోపాలు సవరించుకోవాల్సిందిగా సూచిస్తాయి. కానీ, ప్రతిపక్షాల వాదన ప్రకారం, చర్చకు సరైన అవకాశం లేదు. సభలో గొంతుకలు వినిపించకుండా చేయడం, చివరకు ధన్యవాద తీర్మాన చర్చలు, ప్రధానమంత్రి సమాధానం ఇవ్వకుండానే తీర్మానం ఆమోదం పొందడం వంటి ఘటనలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నాయి. ఈ పరిణామాలపై ప్రతిపక్ష పార్టీలన్నీ ఒకే స్వరంతో స్పందించడం హర్షణీయం. సాధారణంగా రాజకీయంగా భిన్నమైన అభిప్రాయాలు కలిగిన పార్టీల మధ్య ఐక్యత అరుదుగా కనిపిస్తుంది. కానీ, ఈ సందర్భంలో మాత్రం, పార్లమెంటరీ ప్రజాస్వామ్య పరిరక్షణే ప్రధాన అజెండాగా మారింది. పార్లమెంటు సమావేశాలు అంటేనే చర్చలు. సమీక్షలు. మంచీచెడు బేరీజులు. కానీ, కొంతకాలంగా ఇలాంటి ప్రాథమిక అంశాలు కూడా అటకెక్కాయి. అత్యంత కీలక అంశాలపై ప్రతిపక్షాలు మాట్లాడే హక్కును నిరాకరిస్తున్న సమావేశాలను కేవలం నామమాత్రపు తతంగంగా చూడాలి. చర్చ లేకుండా, విమర్శలకు సమాధానం ఇవ్వకుండా, కేవలం సంఖ్యాబలం ఆధారంగా బిల్లులకు, తీర్మానాలకు ఆమోద ముద్ర వేయించుకోవడం పార్లమెంటరీ వ్యవస్థకు ప్రమాదకరం. ఎప్పుడైనా... ఎక్కడైనా... పార్లమెంటు సభ్యులు తమతమ వ్యక్తిగత అంశాలను ప్రస్తావించరు. తమ స్వార్థ ప్రయోజనాల కోసం మాట్లాడరు. తాము ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రజల తరఫున వారు మాట్లాడుతారు. అలాంటి సభ్యుల గొంతు వినిపించకుండా చేయడమంటే, కోట్లాది ప్రజల స్వరాన్ని నొక్కేయడమే. ప్రజాస్వామ్యంలో మెజారిటీకి అధికారం ఉన్నా, మైనారిటీ అభిప్రాయాలకు కూడా గౌరవం ఉండాలి. కానీ, ఇప్పుడు కనిపిస్తున్నది అందుకు భిన్నమైన దృశ్యం. సభలో మైకులు ఆపివేయడం, చర్చ ప్రారంభం కాకముందే అంతరాయం కలిగించడం, ప్రతిపక్ష సభ్యులకు మాట్లాడే అవకాశం ఇవ్వకుండా నిరోధించడం వంటివి అప్రజాస్వామిక విధానాలు కోకొల్లలు. పార్లమెంటు అనేది కేవలం అధికార పక్షం మాట్లాడే వేదిక కాదని, అది విభిన్న స్వరాల సంగమమని ప్రతిపక్ష పార్టీల సభ్యులు చేస్తున్న వ్యాఖ్యలు అక్షర సత్యాలు. భారత ప్రజాస్వామ్యంలో లోక్‌సభ, రాజ్యసభ పరస్పర పూరకాలు. ఒక సభలో జరిగే పరిణామాలు మరొక సభపై ప్రభావం చూపుతాయి. ఒక సభలో ప్రజాస్వామ్య ప్రమాణాలు దెబ్బతింటే, మొత్తం పార్లమెంటు బలహీనపడుతుందని ప్రతిపక్షాల ఆందోళన. ఈ నేపథ్యంలో, లోక్‌సభలో జరిగిన పరిణామాలపై రాజ్యసభలో నిరసన వ్యక్తమవడం సహజ పరిణామం. ఇది ఒక సభ వ్యవహారంపై మరో సభ జోక్యం చేసుకోవడం కాదు... పార్లమెంటరీ వ్యవస్థ మొత్తాన్ని కాపాడుకునే ప్రయత్నం. ఇదే విషయాన్ని ప్రతిపక్ష సభ్యులు స్పష్టం చేసినప్పటికీ, వినడానికి ప్రభుత్వం సిద్ధంగా లేదు. వాగ్వాదాలు.. అడ్డుకోవడాలు... ఘర్షణలు ప్రజాస్వామ్య చరిత్రలో కొత్త కాదు. గతంలో కూడా వివిధ సందర్భాల్లో సభలు సజావుగా నడవని సందర్భాలు ఉన్నాయి. కానీ, దశాబ్దకాలంగా చోటు చేసుకుంటున్న విపరీత ధోరణులు ఆందోళన కలిగిస్తున్నాయన్నది ప్రతిపక్ష నేతల ఆరోపణ. గతంలో జరిగిన తప్పిదాల నుంచి పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం ఉందని వారి సూచన. ప్రజాస్వామ్యం అనేది కేవలం అధికారంలో ఉన్నవారి సౌలభ్యానికి అనుగుణంగా నడిచే వ్యవస్థ కాదు. అది నిరంతర చర్చలు, పరస్పర గౌరవం మీద ఆధారపడి నడిచే యంత్రం. కానీ, ప్రతిపక్ష నేతలను మాట్లాడనివ్వకపోవడం, రాష్ట్రపతి ప్రసంగానికి కృతజ్ఞత తీర్మానాన్ని ప్రధానమంత్రి ప్రసంగం లేకుండానే ఆమోదించడం దుష్ట సంప్రదాయానికి ప్రతీకలు. ప్రతిపక్షాలు సూచించిన సవరణలు తిరస్కరించి, తీర్మానం ఆమోదం పొందిన దృశ్యం ప్రజాస్వామ్య పరిపక్వతపై ప్రశ్నలు లేవనెత్తుతున్నది. ప్రజాస్వామ్యం అంటేనే చర్చ... సమీక్ష.. విశ్లేషణ... లాభనష్టాల బేరీజు. చర్చకు అవకాశం లేకుండా, ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వకుండా సభను నడిపించడం అధికారవాద ధోరణులకు నిదర్శనం. ప్రజల తరఫున ప్రశ్నించిన వారిని బహిష్కరించడం పలాయనవాదానికి పరాకాష్ఠ. సస్పెన్షన్లు సమస్యకు శాశ్వత పరిష్కారం కాదు. నిరసనల వెనుక ఉన్న కారణాలను వినకుండా, కేవలం శిక్షాత్మక చర్యలకు పాల్పడితే సమస్య మరింత తీవ్రమవుతుంది. గెలవడం, ఎక్కువ సీట్లు సంపాదించుకోవడం, అధికారంలోకి రావడం మాత్రమే ప్రజాస్వామ్యం అనిపించుకోదు. పాలనలో వినయం, ప్రతిపక్ష సభ్యుల సూచనలను వినడం, విమర్శలను స్వీకరించే తత్వం, మార్పులను ఆహ్వానించే సామర్థ్యం కూడా ఉండాలి. అధికార పక్షం బలంగా ఉన్నప్పుడు, ప్రతిపక్ష గొంతు మరింత ప్రాధాన్యతను సంతరించుకుంటుంది. అదే ప్రజల ఆందోళనలకు ప్రతిధ్వని. పార్లమెంటులో ప్రతిపక్షాలకు మాట్లాడే అవకాశం ఎవరో చేసే ఉపకారం కాదు.. రాజ్యాంగబద్ధమైన హక్కు. ఆ హక్కును పరిమితం చేయడమంటే ప్రజాస్వామ్య మూలస్తంభాలనే కదిలించడం. దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణను కేవలం పార్టీలపై నెట్టివేయకుండా, ప్రజలు కూడా కీలక భూమిక పోషించాలి. తమవంతు బాధ్యతను నిర్వర్తించాలి. అధికార అహంకారానికి తెరదించాలి.



## స్పీకర్ వెనుక దాక్కున్న ప్రధాని!

**అధికార పక్షం బెంచ్ వద్ద మహిళా ఎంపిలు నిలబడితే ఏమిటి? ప్రధానిపై ఎవరైనా చేయెత్తడమో, ఆయనను గాయపరచడమో అనే ప్రశ్నే లేదు. అలా చేసే ప్లాన్ ఉందని ఎవరైనా అంటే అది పూర్తిగా అబద్ధం. అలాంటి ప్లాన్ ఏదీ లేదు. కానీ, మీ వైపు (బిజెపి) సభ్యులను పుస్తకాలు ఉటంకిస్తూ, అర్థం పర్థం లేకుండా మాట్లాడేందుకు మీరు అనుమతిస్తే, ప్రతిపక్షానికి నిరసన తెలిపే హక్కు ఉంది. నేను ఇలా అంటున్నందుకు సారీ.. ప్రధానమంత్రి స్పీకర్ వెనుక దాక్కుంటున్నారు. వారు స్పీకర్‌తో ఇదంతా చెప్పిస్తున్నారు. నిన్న ఆయనకు సభలోకి వచ్చేందుకు ధైర్యం లేదు. ఎందుకు ముగ్గురు మహిళా ఎంపిలు ఆయన బెంచ్ ముందు నిలబడినందుకా? ఇది అర్థంలేని వాదన. ప్రధాన ప్రతిపక్ష నాయకుడు మాట్లాడేందుకు అవకాశం ఎందుకు ఇవ్వడం లేదని ప్రధాని మోదీని, ప్రభుత్వాన్ని మీడియా ఎందుకు అడగడం లేదు? ప్రభుత్వానికి చర్చ జరగాలని లేదు కాబట్టి చర్చ జరగలేదు.**

– కాంగ్రెస్ ఎంపి ప్రియాంకా గాంధీ



# స్త్రీలలో గుండె జబ్బుల ప్రమాదం అధికమా!

గుండె జబ్బులు అనగా గుండె, రక్తనాళాల వ్యవస్థలను ప్రతికూల ప్రభావితం చేసే ఏ వ్యాధిగా గుర్తించాలి. గుండెపోటు, స్ట్రోక్, కరోనరీ హార్ట్ డిసీజ్, అధిక రక్తపోటు లాంటి సమస్యలు మహిళల వయస్సు పెరిగిన కొద్దీ పెరుగుతున్నాయి. ముఖ్యంగా మోనోపాజ్ తర్వాత ఈ సమస్యలు పెరుగుతున్నాయి. పురుషుల కంటే మహిళల్లో హృదయ నాళ సంబంధ సమస్యలు, మరణాలు అధికంగా నమోదు అవుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా మహిళల్లో గుండె జబ్బుల సమస్యలు ప్రాణాంతకంగా మారుతున్నాయి. ప్రతి ముగ్గురు మహిళల మరణాల్లో ఒక్కరు గుండె జబ్బుతో మరణిస్తున్నట్లు అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. కేన్సర్ కన్న గుండె జబ్బులతో మహిళలు అధికంగా ప్రాణాలు కోల్పోతూ ఉన్నారు. ఇలాంటి అత్యంత ప్రమాదకర వ్యాధుల పట్ల మహిళల్లో అవగాహన పెంచడానికి ప్రతి ఏటా ఫిబ్రవరి తొలి శుక్రవారం, అనగా 06 ఫిబ్రవరి 2026 రోజున జాతీయ మహిళా గుండె దినోత్సవం లేదా నేషనల్ వుమెన్ హార్ట్ డే లేదా నేషనల్ వియర్ రెడ్ డే పాటించడం జరుగుతున్నది.

**ప్రధాన లక్షణాలు:** రుతు విరతి లేదా మోనోపాజ్ తర్వాత మహిళల్లో గుండె జబ్బులు పెరుగుతున్నాయి. మహిళల్లో గుండె జబ్బుల లక్షణాలుగా శ్వాస ఆడకపోవడం, క్రమరహిత హృదయ స్పందన, చెమట పట్టడం, తల తిరగడం, ఛాతి/మెడ/వెన్ను/భుజాల/దవడ/తల నొప్పులు, వికారం, మైకం, అజీర్ణం, అలసట, వాంతులు లాంటి రోగ లక్షణాలు కనిపిస్తాయి. చిన్న గుండె ధమనుల్లో ఉత్పన్నమయ్యే సమస్య ల వల్ల కరోనరీ మైక్రోవాస్కులార్ డిసీజెస్ బయట పడుతున్నాయి. తీవ్రమైన భావోద్వేగ ఒత్తిడివల్ల గుండె బలహీనపడడంతో మహిళల్లో అధికంగా బ్రోకెన్ హార్ట్ సిండ్రోమ్ సమస్యలు వస్తున్నాయి. మహిళల్లో మానసిక ఒత్తిడి, చిన్నచిన్న సమస్యలకు కుంగిపోవడం వల్ల కూడా గుండె జబ్బులు పెరుగుతున్నట్లు తేలింది.

**మహిళల్లో గుండె జబ్బుల నివారణ, తీసుకోవలసిన జాగ్రత్తలు:**
మన కుటుంబాల్లో మహిళలు అందరికీ ఆహారం వడ్డించినా తర్వాత మిగిలిన ఆహార పదార్థాలను మాత్రమే తినడంతో వారిలో పోషకాహారలోపాలు కనిపిస్తున్నాయి. అందువల్ల మహిళలు కూడా మంచి పోషకాహారం తీసుకునే విధంగా పురుషాధిక్య సమాజం జాగ్రత్తలు తీసుకోవాలి. మహిళలు విధిగా పండ్లు, కూరగాయలు, తక్కువ కొవ్వులు ఉన్న ఆహార పదార్థాలను తీసుకోవాలి. ప్రతిరోజు తప్పకుండా కనీసం 30 నిమిషాలు శారీరక వ్యాయామం చేయాలి. ధూమపాన దురలవాటుకు దూరంగా ఉండాలి. మహిళలు తమ శరీర బరువును అదుపులో ఉంచుకోవాలి.

గుండె జబ్బులు మహిళలకు ప్రధాన ఆరోగ్య సమస్యగా మారుతున్న వేళ రోగ లక్షణాలను గమనిస్తూ, పోషకాహారం తీసుకుంటూ, తగు ముందు జాగ్రత్తలు పాటిస్తూ, తరుచుగా వైద్య పరీక్షలు చేయించికుంటూ ఆరోగ్యకరమైన హృదయంతో ఆనందంగా జీవితాలను కొనసాగించాలి. జాతీయ మహిళా హృదయ దినోత్సవం రోజున ఎరుపు రంగు రిబ్బన్లు, డ్రస్సులు ధరించి మహిళాలోకానికి సంఘీభావాన్ని ప్రదర్శిస్తూ, వారు గుండె జబ్బుల బారిన పడకుండా అడ్డుకుందాం.

**(06 ఫిబ్రవరి జాతీయ మహిళా గుండె [జబ్బుల వ్యతిరేక] దినోత్సవం సందర్భంగా)**

# బంగారం, ఐటి షేర్లపై పెట్టుబడి సురక్షితం కాదా!

**టి.ఎన్.అశోక్**

ఆసియా, భారత ఉపఖండంలోని పెట్టుబడిదారులు తరతరాలుగా సంపద విషయంలో పాటిస్తున్న 'ఉత్తమ నియమం' అత్యంత సులువైనది. 'ప్రపంచం వణికిపోతునప్పుడు బంగారాన్ని కొనండి. కానీ ఈ వారం, ఆ పురాతన జ్ఞానం ఘోరంగా అంచనా తప్పింది. చారిత్రాత్మక 'ద్విముఖ' మార్కెట్ షాక్‌లో భాగంగా, ఆధునిక పోర్ట్‌ఫోలియోలోని జంట స్థంభాల వంటి అధిక వృద్ధి సాఫ్ట్‌వేర్ స్టాక్‌లు, 'సురక్షిత స్వర్గధామం'గా చెప్పుకునే విలువైన లోహాలు ఒకేసారి కుప్పకూలిపోయాయి. వందల బిలియన్ల విలువను తుడిచిపెట్టాయి.

సిలికాన్ వ్యాలీలో ఆకస్మిక పరిణామం, వాషింగ్టన్‌లో రాజకీయ నియామకం నుంచి మొదలైన ఈ ఊచకోత వేగంగా సాగే నిర్మాణాత్మక మార్పుల యుగంలో 'సురక్షితమైన' పెట్టుబడి అంటే ఏమిటో ప్రపంచవ్యాప్తంగా పునరాలోచించ వలసి వచ్చింది.

ఒక దశాబ్దానికి పైగా భారతీయ ఐటి దిగ్గజాల, ప్రపంచ సాఫ్ట్‌వేర్ సంస్థల పెట్టుబడి సిద్ధాంతం 'పెనవేసుకొని' ఉండడంపై నిర్మితమైంది. పునరావృతమయ్యే సబ్‌స్క్రిప్షన్ ద్వారా లీగల్ రీసెర్చ్ లేదా టాక్స్ ఫైలింగ్ లేదా ఎంటర్‌ప్రైస్ కోడింగ్ వంటి తప్పనిసరి సేవలను ఈ కంపెనీలు అందిస్తుంటాయి.






ఆ సిద్ధాంతం మంగళవారం బద్దలైంది. **దీనికి ఉత్ప్రేరకం డారియో అమోడీ నేతృత్వంలోని ఎఐ సంస్థ ఆంత్రోపిక్ నుండి అధునాతన లీగల్ ఆటోమేషన్ సాధనం 'క్లాడ్ కోవర్క్ అసిస్టెంట్'ను ప్రవేశపెడుతున్నట్లు వచ్చిన ప్రకటన. ఈ ఎఐ సాధనం ఒక ప్రాడక్ట్‌ను అప్‌డేట్ చేయాడానికి మించి చేసింది. ఎఐ 'సహాయకుడు' పాత్ర నుండి 'స్థానాలను భర్తీ' చేసే పాత్రగా మారుతోందని ఇది నిరూపించింది.**

ఈ వార్తలు పసిఫిక్ సముద్రం దాటగానే, దలాల్ స్ట్రీట్‌పై ప్రభావం తక్షణమే కనిపించింది. బుధవారం ఉదయం నిఫ్టీ ఐటి ఇండెక్స్ 6 శాతం కంటే ఎక్కువ పతనమైంది. గత కొద్ది మాసాలలో ఇదే అత్యంత ఘోరమైన సెషన్. పెట్టుబడిదారులు ఇకపై మందగమనం గురించి ఆందోళన చెందడం లేదు. వారు కనిపించకుండా పోవడం గురించి ఆందోళన చెందుతున్నారు.

**ఇన్ఫోసిస్:** దాని ప్రధాన వ్యాపార సేవలను ఎఐ ఏజెంట్లు ద్వారా ఆటోమేట్ చేయవచ్చనే భయాలు పెరగడంతో ఇన్ఫోసిస్ షేర్లు 7.2 శాతం పడిపోయి, పతనానికి నేతృత్వం వహించింది.

**టిసిఎస్, విప్రో :** దాదాపు 6 శాతం పడిపోయింది. ఇది యాక్సెంచర్, కాగ్నిజెంట్ వంటి అమెరికా సహచరులలో భారీ అమ్మకాలను ప్రతిబింబిస్తుంది.

**ది సాసాసోక్యాలిప్స్ (ఎఐ ఎజెంట్‌ల కారణంగా ఐటి షేర్ల పతనాన్ని సూచించే పదం):** పెర్సిస్టెంట్ సిస్టమ్స్, ఎల్‌టి, మైండ్ ట్రీ వంటి మిడ్ క్యాప్ సంస్థలు కూడా 6.5 శాతం కంటే ఎక్కువ తరుగుదలను చవిచూశా యి.

మార్కెట్ల నుండి వచ్చే సందేశం స్పష్టంగా ఉంది. పాశ్చాత్య సాఫ్ట్‌వేర్‌ను నిర్వహించడానికి ప్రతిభావంతమైన మానవవనరులను అందించే భారతీయ సంస్థల 'కార్మిక మధ్యవర్తిత్వం' నమూనా ఉనికికి ముప్పు పొంచి ఉంది. **జూనియర్ దేవలపర్లు లేదా లీగల్ క్లర్కుల బృందం చేసే పనిని నెలకు 20 డాలర్‌లతో ఎఐ చేసిపెట్టగలిగితే, సాంప్రదాయ 250 బిలియన్ డాలర్ల ఔట్‌సోర్సింగ్ నమూనా మరింత అభివృద్ధి చెందాలి లేదా నశించాలి.**

ఈక్విటీ పెట్టుబడిదారులు తడబడుతుండగా, సంప్రదాయవాద పొదుపుదారులపై రెండవ దెబ్బ పడింది. ద్రవ్యోల్బణానికి ఎదుర్కొనేందుకు బంగారం ఒక సాంస్కృతిక రక్షణగా, పొదుపు ప్రాథమిక రూపంగా భావించే భారతీయ కుటుంబాలకు, వాషింగ్టన్ నుండి వచ్చిన వార్త ఒక ద్రోహంలా అనిపించింది.

జెరోమ్ పావెల్ స్థానంలో ఫెడరల్ రిజర్వ్ చైర్మన్‌గా కెవిన్ వార్ష్‌ను తన నామినీగా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. మోర్గాన్ స్టాన్లీ మాజీ బ్యాంకర్ అయిన వార్ష్‌ను 'మానిటరీ హాక్' (ద్రవ్య డేగ)గా భావిస్తారు. వడ్డీ రేట్లను తక్కువగా ఉంచడం ద్వారా వృద్ధికి ప్రాధాన్యత ఇచ్చే 'పావురం'లా కాకుండా, వార్ష్ వంటి డేగ అధిక రేట్లు, 'బలమైన డాలర్' విధానం ద్వారా ద్రవ్యోల్బణాన్ని అణిచివేయడానికి ప్రాధాన్యత ఇస్తాడు.

దీనిపై కమోడిటీ మార్కెట్‌లో ప్రతిస్పందన దశాబ్దాలలో అత్యంత దారుణంగా ఉంది:

**బంగారం:** 2013 తరువాత అత్యంత దారుణమైన ఒకరోజు అమ్మకాలను చవిచూసింది. స్పాట్ ధరలు ఒకే వారంలో 10 శాతం వరకు పడిపోయాయి.

**వెండి:** 1980 తరువాత తీవ్రమైన పతనాన్ని నమోదు చేసింది. రాత్రికి రాత్రే దాదాపు 28 శాతం పడిపోయింది.

'తర్కం కనికరం లేనిది. బంగారం వంటి రాబడి లేని ఆస్తుల ఆకర్షణను అధిక రేట్లు, బలమైన డాలర్ ధ్వంసం చేస్తాయి.' నెలల తరబడి బంగారం రికార్డు స్థాయిలో ర్యాలీని చవిచూసింది. దీనికి తూర్పున భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, సెంట్రల్ బ్యాంకు కొనుగోళ్లు కారణమయ్యాయి. కానీ వార్ష్ నియామకం 'ఫ్రైడ్‌మ్యాన్ శైలి' ద్రవ్యోల్బణ నియంత్రణ పునరాగమనాన్నిసూచిస్తుంది. మార్కెట్లు తక్షణమే భవిష్యత్తును దర్శించి, ధరలను సవరించుకొని, వార్ష్ పాలనలో అమెరికా డాలర్ తిరుగులేని రాజుగా ఉంటుందని పందెం కాస్తున్నాయి.

ప్రస్తుత ఫెడ్ చైర్మన్ జెరోమ్ పావెల్‌కు వ్యతిరేకంగా ట్రంప్ పాలనా యంత్రాంగం చేసిన దుష్ప్రచారం మధ్య వార్ష్ నియామకం జరిగింది. అధ్యక్షుడు కోరినంత త్వరగా రేట్లను తగ్గించడానికి పావెల్ నిరాకరించడంతో సంబంధం దెబ్బతిన్నది.

ఈ వివాదం ప్రపంచ స్థిరత్వంపై గణనీయమైన ప్రభావాలను కలిగి ఉంది. రాజకీయ నాయకులు సెంట్రల్ బ్యాంకులలో జోక్యం చేసుకున్న సందర్భాలలో అధిక ద్రవ్యోల్బణం, నిరుద్యోగం (స్టాగ్‌ఫ్లేషన్) లేదా కరెన్సీ పతనం తప్పదని చరిత్ర చెబుతోంది. విచిత్రంగా బంగారం మార్కెట్ పతనం... వాస్తవానికి పెట్టుబడిదారులు వార్ష్ స్వాతంత్ర్యాన్ని విశ్వసిస్తారని సూచిస్తుంది. బంగారాన్ని విక్రయించటం, డాలర్‌ను కొనుగోలు చేయడం ద్వారా, అధిక డబ్బు ముద్రణ ద్వారా కరెన్సీని 'తగ్గించడానికి' వార్ష్ రాజకీయ ఒత్తిడిని నిరోధించే అవకాశం ఉందని మార్కెట్ ఓటు వేస్తోంది.

**ఈ వారం ఆసియా, భారతీయ పెట్టుబడిదారులకు మూడు కీలకమైన పాఠాలను అందిస్తుంది:**

**ఐటి స్టాక్‌లు ఇకపై 'భద్రమైనవి' కావు:** డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో ఐటి స్టాక్‌లు సురక్షితమైన మార్గం అనే భావన పరీక్షించబడుతోంది. జెఫరీస్‌తో సహా ప్రధాన బ్రోకరేజీలు ఇప్పటికే భారతీయ ఐటి కోసం ఇచ్చే ప్రాధాన్యతను తగ్గించుకున్నాయి. ఇది ఆర్థిక, పారిశ్రామిక రంగాల వంటి 'సాంప్రదాయ' రంగాల వైపు మళ్లడాన్ని సూచిస్తుంది.

**బంగారం దుర్బలత్వం నుంచి పాలసీ :** బంగారం ఒక ముఖ్యమైన హెడ్జ్ (ప్రతికూల మార్కెట్‌లో నష్టాలు తగ్గించుకునే వ్యూహం)గా ఉన్నప్పటికీ, దానిపై అమెరికా ద్రవ్య విధానం తేలికగా ప్రభావం చూపుతుంది. ఒక దుష్ట ఫెడ్ బ్యాంకు ఒక్క మధ్యాహ్నంలోనే లాభాలను తుడిచిపెట్టగలదు.

**'క్వైట్ కార్నర్స్(ప్రశాంత స్థలి)'కు ముగింపు:** క్లాడ్ సాఫ్ట్‌వేర్ నుండి బంగారు కడ్డీల వరకు 'కథనంలో సంభవించే మార్పు' నుండి రక్షణ ఇచ్చే ఆస్తులు ఇకపై ఉండవు. అధిక అస్థిరత అనేది కొత్త ఆధారం.

వాల్ స్ట్రీట్, దలాల్ స్ట్రీట్ మార్కెట్ ఎదురుగాలికి సర్దుబాటు చేసుకుంటున్న సమయంలో, ఇది తాత్కాలిక దిద్దుబాటా? లేదా నిర్మాణాత్మక మలుపా? అనే విస్తృతమైన ప్రశ్న మిగిలే ఉంది

'కోడ్ నుండి బంగారం వరకు' తగిలిన షాక్... ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఇప్పుడు గతంలో కంటే మరింత పరస్పరం అనుసంధానించబడి ఉందని, మరింత సున్నితంగా ఉందని రుజువు చేస్తుంది. మీరు బెంగళూరులో టెక్ ప్రొఫెషనల్ అయినా లేదా ముంబైలో బంగారం పొదుపు చేసినా, సందేశం స్పష్టంగా ఉంది.

| అస్తి రకం | పాత కథనం | నూతన వాస్తవికత (2026 షాక్) |
|---|---|---|
| భారతీయ ఐటి (టిసిఎస్/ఇన్ఫీ) | అధిక మార్జిన్లు, సురక్షితమైన 'రక్షణాత్మక' పెట్టుబడి | ఎఐ ఏజెంట్ల నుండి అధిక అంతరాయ ప్రమాదం. |
| బంగారం/వెండి | అమెరికా ద్రవ్యోల్బణానికి దీటుగా నిలిచే ఉత్తమ హెడ్జ్ | 'బలమైన డాలర్' ఫెడ్ ప్రభావానికి లోనయ్యే అవకాశం. |
| ప్రైవేట్ ఈక్విటీ | ఊహించదగిన, దీర్ఘకాలిక నగదు ప్రవాహాలు | సాఫ్ట్‌వేర్‌లో 'అంతరాయం కలిగించే ప్రమాదానికి' లోనయ్యే అవకాశం. |

# ప్రజాస్వామ్య మూలస్తంభం 'ఫోర్త్ ఎస్టేట్'పై కేంద్రం జులుం

ధర్మ ఏవ హతో హన్తి / ధర్మో రక్షతి రక్షితః
తస్మాద్ధర్మో హన్తవ్యో / మనోధర్మా హతోవదీత్

ఈ శ్లోకం వాల్మీకి రామాయణంలోనిది. జన బాహుళ్యంలో అత్యంత ప్రాముఖ్యం పొంది జనవాక్యంగా మారింది. ఈ శ్లోకార్థం జనానికి తెలియంది కాదు. ఈ ఆర్టికల్ వ్రాయడానికి నేను ఎంచుకున్న సబ్జెక్ట్ డిమాండ్ చేస్తోంది కనుక చెప్పాల్సిన అవసరం ఉంది. ధర్మాన్ని మీరు అనుసరించి దాన్ని గౌరవిస్తే ఆ ధర్మమే మిమ్మల్ని కాపాడుతుంది. ధర్మాన్ని నాశనం చేస్తే అది మిమ్మల్ని నాశనం చేస్తుంది. ఈ సూక్తి వ్యక్తిగత జీవితంలో నైతికతను, సామాజిక వ్యవస్థలను కాపాడాల్సిన ఆవశ్యకతను నొక్కి చెబుతోంది. భారతీయ ఆర్థికవేత్త, జర్నలిజాన్ని కొత్తపుంతలు తొక్కించిన పాత్రికేయుడు, నీతి నిజాయితీకి నిలువెత్తు రూపమైన ప్రణయ్ రాయ్ ఈ శ్లోకాన్ని టీకా తాత్పర్యాలతో సహా జీర్ణం చేసుకున్న మేధావి. ప్రజలకు వేగంగా నిఖ్సాన వార్తలను అందించడం కోసం స్వతంత్ర వార్తా సంస్థ ఎన్‌డిటివి ని స్థాపించారు. 1977లో జనతాపార్టీ గెలుస్తుందని prediction చెప్పడంతో పాటు ఇండియా టుడే మ్యాగజైన్‌లో ఎలక్షన్ ఎనలిస్ట్ గా పని చేశారు. 1984లో కాంగ్రెస్ పార్టీ 400 స్థానాలు దక్కించుకుంటుందని చెప్పిన సెఫాలజిస్ట్. శాస్త్రీయ పద్ధతిలో ఎన్నికల అంచనాలను వెల్లడించడంలో ఆయన సిద్ధహస్తుడు. జాతీయ, అంతర్జాతీయ అవార్డులెన్నో అందుకుని, అక్షరాన్ని ఆయుధంగా చేసి ప్రభుత్వపు అవినీతిని ఎండగట్టిన ఘటికుడు. ముక్కుసూటి మనిషి కావడంతో సహజంగానే ప్రభుత్వం చూపు ఆయనపై పడింది.

2002లో నరేంద్ర మోదీ గుజరాత్ సి.ఎం గా ఉన్నప్పుడు జరిగిన గోద్రా అల్లర్లపై ఆయన చేసిన పదునైన విశ్లేషణ, ప్రభుత్వంపై సంధించిన ప్రశ్నల పరంపరతో బిజెపి ఉక్కిరిబిక్కిరైంది. ఎన్‌డిటివిని అదుపు చేయలేనపుడు దాన్ని నాశనం చేయడం ఉత్తమం అని వ్యూహరచన చేసి నిశ్శబ్ద యుద్ధం మొదలెట్టింది ప్రభుత్వం. మీడియా అంటే ప్రశ్నించే గొంతు. కొన్ని సందర్భాల్లో అదే ప్రతిపక్ష పాత్ర పోషిస్తుంది. ఎన్‌డిటివి అంటే పాలకులకు భయం. ఎక్కడ తమ అవినీతి, అక్రమాల పుట్టలు తవ్వుతారో అనే దిగులు. గ్రీకు తత్వవేత్త సోక్రటీస్ నిజాలు చెప్పినందుకు గ్రీకులు ఆయనకు విషం ఇచ్చి చంపారు. యూదుల సంప్రదాయాలను ప్రశ్నించినందుకు రోమన్ గవర్నర్ ఏసుక్రీస్తుకు మరణశిక్ష విధించాడు. పురాణాలు కల్పిత కథలు అనే సవాలు చేసినందుకు ప్రాచీన భారతంలో చార్వాకుని సజీవ దహనం చేశారు. భూమి సూర్యుడి చుట్టూ తిరుగుతుందనే నిజం చెప్పినందుకు ఖగోళ శాస్త్రవేత్త జోసఫ్ బ్రూనేను సజీవ దహనం చేశారు. ప్రత్యర్థులను నిర్వీర్యం చేయనంతకాలం వారినుండి ప్రమాదం ఎప్పుడూ ఉంటుంది అనేది రాజనీతి. ఈ రాజనీతిని బాగా ఆకళింపు చేసుకున్న ప్రధాన మంత్రి కౌటిల్యుడిని మించిపోయేలా పావులు కదిపినపుడు ప్రణయ్ రాయ్ దంపతుల కాళ్ళక్రింద భూమి కరిగిపోయిం ది. తాము కష్టపడి ఆర్జించిన ఎన్‌డిటివిని తమ కళ్ళముందే రాబందులు తన్నుకుపోయాయి. ఇదేనా వికసిత్ భారత్? ఒక కాకి పడిపోతే వంద కాకులు గుమిగూడి కావ్ కావ్ అంటూ అరుస్తాయి. అది ప్రకృతి ధర్మం. ఈ పక్షి ధర్మం జర్నలిజంలో లేదా? జనవరి 2025 లో చత్తీస్‌ఘడ్ బీజాపూర్‌లో ఎన్‌డిటివి రిపోర్టర్ హత్య చేయబడ్డారు. ఎవరు చేశారు? ఎందుకు చేశారు అని ప్రశ్నించినవారు లేరు.

ఎన్‌డిటివి ఛానల్ అవసరాల మేరకు 2009 లో ప్రణయ్ రాయ్ దంపతులు విసిపిఎల్ అనే సంస్థ వద్ద 403 కోట్లు అప్పు తీసుకున్నారు. ఆ రెండు సంస్థల మధ్య జరిగిన ఒప్పందంలో అప్పు తీర్చలేని పక్షంలో, అప్పు ఇచ్చినవారు ఆ మొత్తాన్ని ఎన్‌డిటివి షేర్స్ గా మార్చుకోవచ్చు. ఈ నిబంధనే ఎన్‌డిటివి కొంప ముంచింది. ఒక ప్రక్క కేంద్రప్రభుత్వం ఐటి, సెబి, సిబిఐ వ్యవస్థలను ప్రణయ్ రాయ్ పై ఉసిగొల్పింది. ఈ దాడులను తట్టుకుంటూ, తీసుకున్న అప్పు కట్టలేని పరిస్థితి. ప్రణయ్ రాయ్ నుండి డైరెక్ట్ గా ఎన్‌డిటివి స్వాధీనం చేసుకోవడం కుదరదని గ్రహించి కుయుక్తులు పన్నే వారు ఆర్థిక ఉచ్చును సిద్ధంచేసి గోతికాడ నక్కలా కాచుకు కూర్చున్నారు. ఊహించని విధంగా విసిపిఎల్ ను కార్పొరేట్ డ్రాగన్, క్రోనీ కాపిటల్స్ అయిన అదానీ గ్రూప్ కొనుగోలు చేసింది. ఆ విధంగా 65 శాతం ఎన్‌డిటివి షేర్స్ మొత్తం అదానీ వశం అయ్యాయి. ఈ ఎపిసోడ్‌లో సంస్థ అధిపతి అయిన ప్రణయ్ రాయ్ కు కనీసం నోటీసు కూడా ఇవ్వకుండా 4 దశాబ్దాలుగా కాపాడుకుంటూ వచ్చిన ఎన్‌డిటివి ని అదానీ గ్రూప్ అనే అనకొండ కబ్జా చేసింది. మరోవైపు నుండి ఆదాయపన్ను శాఖ ఎన్‌డిటివి లో అక్రమాలు జరిగాయంటూ ప్రణయ్ దంపతులకు నోటీసులిచ్చి వేధించడం మొదలెట్టారు. ఢిల్లీ హైకోర్టు దీనిపై జోక్యం చేసుకుని ఒకే వ్యక్తిపై అనేక నిందలు వేయడం వేధింపు క్రిందికి వస్తుందని, అక్రమాలు జరిగిన రుజువులు లేనందున కేసు కొట్టివేస్తూ ఐటి శాఖకు 2లక్షల రూపాయలు జరిమానా వేసింది.

ఇంకోవైపు నుండి ప్రణయ్ రాయ్ ఐసిఐసిఐ బ్యాంకు నుండి తీసుకున్న 370కోట్ల రూపాయల లోన్ కేసులో నేరపూరిత అక్రమాలు జరిగాయని సిబిఐ కేసు వేసింది. ఈ కేసులో నేరపూరిత కుట్రలు జరగలేదని, అది ఒక సాధారణ వ్యాపార లావాదేవి అని ఢిల్లీ హైకోర్టు ఈ కేసుని కూడా క్లోజ్ చేసింది. మరి సిబిఐ కేసు ఎందుకు పెట్టింది? దీని వెనుక సూత్రధారులెవరు?

ఎన్‌డిటివిలో అంతర్గత వ్యాపారం జరిగిందని సెబి వేసిన కేసును, స్టేట్ అపిల్లేట్ ట్రిబ్యునల్ (State appellate tribunal (State appellate tribunal–SAT) అటువంటివి జరిగిన ఆధారాలు లేవంటూ ఎన్‌డిటివి పై ఉన్న కేసును కొట్టివేసింది. అంటే ఇది కూడా ఫేక్ కేసే. ప్రణయ్ రాయ్ చేసిన ధర్మపోరాటానికి సుమారు 10 ఏళ్ళు పట్టింది. చివరికి ఆయనకు 80 ఏళ్ళ వయసులో జనవరి 2026న కోర్టులు క్లీన్ చిట్ ఇచ్చా యి. కాని అప్పటికే జరగాల్సిన నష్టం జరిగింది. ఆయన నిర్మించుకున్న జర్నలిజం సామ్రాజ్యం కార్పొరేట్ శక్తుల చేతిలోకెళ్ళింది. న్యాయపోరాటంలో ప్రణయ్ రాయ్ గెలిచినా, వృత్తిపరంగా ఆయన్ని దెబ్బ తీయాలన్న బిజెపి లక్ష్యం నెరవేరింది.

రాజకీయ నాయకులు, పెట్టుబడిదారులు, కార్పొరేట్ శక్తులు వారికున్న ఈజీ మనీతో ప్రింట్ & ఎలక్ట్రిక్ మీడియాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఈ నేపథ్యం ఉన్న వ్యక్తులకు నిఖ్సాన జర్నలిజంతో పనిలేదు. ప్రభుత్వం, రాజకీయ పార్టీలు వారి అవసరాల కోసం మీడియాను పిలిచి గోద్ మే బైఠో అంటున్నాయి. ఇలాంటి మీడియా Lapdog జర్నలిజానికి అలవాటుపడి కాసులకు కక్కుర్తిపడి ప్రభుత్వ పెద్దల ఒడిలో కూర్చుని మూడు పూవులు ఆరు కాయలుగా తమ టి.ఆర్.పి రేట్లను పెంచుకుంటోంది. ప్రవాహంలో కొట్టుకుపోకుండా, ప్రవాహానికి ఎదురీదే ఎన్‌డిటివి యాజమాన్యాన్ని ఒంటరిని చేశామని తాత్కాలికంగా పైశాచికానందాన్ని పొందవచ్చు. నైతిక విలువలున్న ప్రణయ్ రాయ్ లాంటి వారిని ఏ ప్రభుత్వమూ ఆపలేదు. డిజిటల్ ఇండియాలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ని ఉపయోగించి టివి జర్నలిజంలో నూతన అధ్యాయాన్ని సృష్టిస్తారని ఆశిద్దాం.

**ఎస్.బాబు**
సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు,
9951801191

## కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయండి: మంత్రి శ్రీధర్ బాబు



ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్: వివిధ డివిజన్లలో పార్టీ టికెట్ ఆశించి రాక పోవడంతో రెబల్స్‌గా పోటీలో ఉన్న అభ్యర్థులు , నామినేషన్ వేసి ఉపసం హరించుకున్న నాయకులకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని , అందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కరీంనగర్‌లో మంత్రి శ్రీధర్‌బాబును కలిసారు. ఈ సంధర్భంగా పలువురు మంత్రి శ్రీధర్ బాబుతో నాయకులు మాట్లాడుతూ కష్టకాలంలో పార్టీ కోసం పనిచేసామని, తమకు పార్టీ టికెట్ రాకపోవడం బాధాకరమని అన్నారు. ఏదో విధంగా అందరికీ అవకాశం కల్పించి అందరికీ న్యాయం చేస్తామని , పార్టీ నిర్ణయానికి కట్టుబడి పనిచేయాలని , ఆయా డివిజన్లలో కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని మంత్రి శ్రీధర్ బాబు సూచించారు. సమావేశంలో అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు. వివిధ డివిజన్ల నుంచి నాయకులు షబానా మహమ్మద్, కుదురత్ ఉన్నీసా బేగం, ఖంరొద్దీన్, చర్ల పద్మ, గడమల్ల శ్రీనివాస్, ముల్కల కవిత, అస్తాపురం రమేష్, యనమల మంజుల, జీడి రమేష్, చాంద్‌పాషా, ఉప్పరి అజయ్, గంగుల దిలీప్, సుదర్శన్, హనీఫ్, యోనా తదితరులున్నారు.

## వరుస దొంగతనాల కేసు ఛేదింపు, నిందితుల అరెస్ట్

15 తులాల బంగారం 32 తులాల వెండి స్వాధీనం,




ప్రజాపక్షం/మల్లాపూర్ : మెట్పల్లి పరిసర ప్రాంతాల్లో వరుసగా దొంగతనాలకు పాల్పడుతున్న ఏడుగురి నిందితులను మెట్పల్లి పోలీసులు గురువారం పట్టుకున్నట్లు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. మెట్పల్లి డిఎస్పి కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ గత జనవరి నెలలో పట్టణంలో వరుసగా ఆరు దొంగతనాలకు చోటు చేసుకోగా అత్యంత ప్రాధాన్యతతో డిఎస్పి రాములు ఆధ్వర్యంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్ ఎస్సైలు కిరణ్ కుమార్ అనిల్ నవీన్ లతో ప్రత్యేక బంధాలుగా ఏర్పాటుచేసి నిందితుల కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ ప్రత్యేక బృందాలు మెట్పల్లి నిజాంబాద్ తదితర ప్రాంతాలలో విస్తృతంగా గాలించి సీసీటీవీ ఫుటేజీలు డాగ్ స్క్వాడ్ తో ఆధారాలను సేకరించి నిందితులను గుర్తించినట్లు పేర్కొన్నారు. విచారణలో భాగంగా మెట్పల్లి కొత్త బస్టాండ్ సమీపంలో వాహనాలు తనిఖీ చేసే క్రమంలో అనుమానాస్పదంగా ఉన్న పండుగ రమేష్, పల్లెపు రమేష్ లను అదుపులోకి తీసుకొని విచారించగా వారి వద్ద నుండి మూడున్నర తులాల బంగారు పుస్తెలతాడు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. పట్టుబడిన ఇద్దరు నిందితుల సమాచారంతో మిగతా నిందితులైన గంగాధర్ ,గంగమని , గైని కిరణ్, పెద్దూరు మల్లేశ్వరి, ఇందూరి రాకేష్ లను పట్టుకుని అరెస్టు చేసి ఏడుగురు నిందితులను విచారించగా వారి వద్ద నుండి మొత్తం 15 తులాల బంగారు ఆభరణాలు 32 తులాల వెండి అభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ వివరాలను వెల్లడించారు. దొంగతనం కేసును వేగవంతం చేసి చేదించిన మెట్పల్లి సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు పబ్బ కిరణ్ కుమార్, అనిల్ కుమార్, నవీన్ , సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించి రివార్డులను అందజేశారు. ఈ సమావేశంలో మెట్పల్లి డిఎస్పి రాములు సిఐ అనిల్ కుమార్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## హత్య కేసులో ముగ్గురికి జీవిత ఖైదు

ప్రజాపక్షం/గొల్లపల్లి : జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన హత్య కేసులో ముగ్గురు నిందితులకు జీవిత ఖైదు తో పాటు రూ.4,500 చొప్పున జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ జిల్లా సెషన్స్ జడ్జి రత్న పద్మావతి గురువారం తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళితే మండలంలోని అగ్గిమల్ల గ్రామానికి చెందిన లక్ష్మి తన కుమారుడు తరువేని వెంకటేష్ (26) హత్యకు గురికాగా గొల్లపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంకటేష్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ మల్కాపురం ప్రాంతంలో నివాసం ఉండేవాడు.2021 అక్టోబర్ 18 న మధ్యాహ్నం సుమారు 3 గంటల సమయంలో వెంకటేష్ ఫోన్ మాట్లాడుకుంటూ ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అనంతరం కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేయగా,గ్రామ శివారులోని పొలం సమీపంలో వెంకటేష్ గొంతు కోసి హత్య చేయబడిన స్థితిలో శవం కనిపించింది. పోలీసుల దర్యాప్తులో మృతుడు వెంకటేష్‌కు గ్రామానికి చెందిన కొలగాని రాజేందర్‌తో గతంలో వివాదం ఉన్నట్లు గుర్తించారు.ఆ ద్వేషంతోనే రాజేందర్ తన సహచరులు కస్తూరి మల్లేష్ , అవుల కిరణ్ కుమార్‌లతో కలిసి వెంకటేష్‌ను హత్య చేసినట్లు నిర్ధారించారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయగా ధర్మపురి సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీ కోటేశ్వర్ కేసును దర్యాప్తు చేసి నిందితులు కొలగాని రాజేందర్ (27) కస్తూరి మల్లేష్ (30) అవుల కిరణ్ కుమార్ (32)లను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు.ప్రభుత్వ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) మల్లికార్జున్ కోర్ట్ డ్యూటీ అధికారులు సాక్షులను ప్రవేశపెట్టి, కీలకమైన సాక్ష్యాధారాలను కోర్టుకు సమర్పించగా సాక్షాధారాలు సుదీర్ఘంగా పరిశీలించిన కోర్టు ముగ్గురు నిందితులపై నేరం రుజువైనట్లు నిర్ధారించి జీవిత ఖైదు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.4500 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్ మాట్లాడుతూ సమాజంలో నేరం చేసిన వారు ఎవరూ శిక్ష నుండి తప్పించుకోలేరని, పోలీసులు ప్రాసిక్యూషన్ సమన్వయంతో పటిష్టమైన దర్యాప్తు, న్యాయ నిరూపణ ద్వారా తప్పనిసరిగా నిందితులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటారని తెలిపారు.ఈ కేసులో నిందితులకు శిక్ష పడటంలో కృషి చేసిన ప్రభుత్వ పీపీ మల్లికార్జున్, దర్యాప్తు అధికారి ఇన్స్పెక్టర్ కోటేశ్వర్, సి ఎం ఎస్ ఎస్.ఐ శ్రీకాంత్,కానిస్టేబుల్ ఎం. కిరణ్ కుమార్, కోర్టు కానిస్టేబుల్ శ్రీధర్‌లను ఎస్పీ శ్రీ అశోక్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

## లక్ష్మి సంకల్ప అకాడమీ ఉచిత గురుకుల ప్రవేశ పరీక్ష నమూనా

ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : సిరిసిల్ల లో లక్ష్మి సంకల్ప అకాడమీ వారి ఉచిత గురుకుల ప్రవేశ నమూనా పరీక్షను సద్వినియోగం చేసుకోవాలని అకాడమీ చైర్ పర్సన్ కె స్నేహ వినయ్ కుమార్, డైరెక్టర్ రాజ్ కుమార్ గడ్డం ఓ ప్రకటనలో కోరారు. ప్రస్తుతం నిర్వహించే గురుకుల పరీక్ష విధానం, ప్రశ్నల సరళి,విద్యార్థులకు అవగాహన చేయడమే లక్ష్యంగా ఈ పరీక్షను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పరీక్ష ఫిబ్రవరి 8న సిరిసిల్లలోని సెలెస్టియల్ పాఠశాలలో నిర్వహించబడుతుందని తెలిపారు. విద్యార్థులు ముందుగా పేరు నమోదు చేసుకోవాలని, వివరాలకు 93460 95300ను సంప్రదించాలని కోరారు.

## ధర్మపురి రూపురేఖలు మార్చి
# అభివృద్ధి చేసే బాధ్యత నాదే

మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



ప్రజాపక్షం/ధర్మపురి: ధర్మపురి మున్సిపల్‌లోని 15 వార్డులలో కాంగ్రెస్ పార్టీ బలపరుస్తున్న అభ్యర్థులను గెలిపించినట్లైతే ధర్మపురి బల్దియా రూపురేఖలు మార్చి అన్నివిధాలా అభివృద్ధి చేసే భాధ్యత తాను తీసుకుంటానని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, వికలాంగులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని 4వ వార్డు, 12వ వార్డుల్లో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్నర్ మీటింగ్ లో మంత్రి అడ్లూరి మాట్లాడారు. బిఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో సాక్షాత్తు ధర్మపురి శ్రీ లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో నిత్యం సేవలందించే పూజారులు, దేవుని పల్లకీసేవను మోసే గంగపుత్రులను పట్టించుకున్న పాపానపోలేదని అన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే పూజారుల సమస్యతో పాటు బోయలు, స్వీపర్ల సమస్యలను పరిష్కరించానని చెప్పారు. 10ఏళ్ల బిఆర్ఎస్ పాలనలో విలాసవంతమైన జీవితం గడిపారేగానీ పేదవారికి కొత్తగా రేషన్ కార్డులు, డబుల్ బెడ్రూం ఇల్లు ఇవ్వలేదన్నారు. తమ ప్రజాపాలన ప్రభుత్వంలో కొత్తగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, కొత్తగా రేషన్ కార్డులు ఇచ్చి సన్నబియ్యం అందిస్తున్నామని మంత్రి తెలిపారు. పట్టణం అన్నివిధాలా అభివృద్ధి చెందాలంటే 15 మంది కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలన్నారు.4కెవార్డు, 12 వవార్డులలో కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచాక గంగపు త్రులకు కులసంఘ భవన నిర్మాణానికి కృషిచేస్తానని, డ్రైనే జీ, రోడ్ల సమస్యలు పరిష్కరిస్తానని, అర్హులైన పేదలకు ఇంది రమ్మ ఇళ్ళు, రేషన్ కార్డులు అందజేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

## గడప,గడపకూ ఎన్నికల ప్రచారం

కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి, అభివృద్ధి చేసి చూపిస్తాం
మంత్రి పొన్నం ప్రభాకర్



ప్రజాపక్షం/హుస్నాబాద్: కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించండి , హుస్నాబాద్ పట్టణాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసి చూపిస్తానని తెలంగాణ బి సి రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడు అన్నారు. గురువారం పట్టణంలో 5,6,7 వార్డుల్లో వార్డు అభ్యర్థులతో కలిసి గడప గడపకు తిరుగుతూ అందరినీ పలకరిస్తూ ఎన్నికల ప్రచా రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్ల మ్మ బజారులో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్ లో మాట్లాడుతూ హుస్నాబాద్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నాం, ఎల్లమ్మ చెరువు సుందరికరణా పనులు ఎల్లమ్మ అలయం, పోచమ్మ అలయం అభివృద్ధి హుస్నాబాద్ అంటే గౌరవం పెరిగేలా చేశాం, శాతవాహణా యూనివర్సిటీ, ఇంజనీరింగ్ కాలేజీ ఏర్పాటు చేశాం, 250 పడకల అసుపత్రి నిర్మాణం జరుగుతుంది, పీజీ మెడికల్ కాలేజీ వస్తుందన్నారు. హుస్నాబాద్‌కు నలువైపులో నాలుగు లైన్లు రోడ్డు వేస్తున్నం, సంక్షేమ అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు ఇస్తున్నాం, గత ప్రభు త్వం ఒక్క రేషన్ కార్డు కూడ ఇవ్వలేదు. ఇందిరమ్మళ్లు ఇస్తున్నాం, ఇప్పటికే నియోజకవర్గంలో 3500 వందల ఇళ్లు , పట్టణంలో 500ల ఇళ్లు ఇచ్చామని అన్నారు. మీరు హుస్నాబాద్ లో ఉన్న 20 వార్డుల్లో అందరిని గెలిపిస్తే మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నా యకులు బొల్లి శెట్టి శివయ్య, కేడం లింగమూర్తి, పద్మరవిందర్, సంపత్, భూక్యసంపత్, మహిళలు పాల్గోన్నారు.

## మాజీ ఎమ్మెల్యే రాంరెడ్డి మృత దేహానికి మంత్రి నివాళులు



ప్రజాపక్షం/ముత్తారం : తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గురువారం మంథనిలో రాంరెడ్డి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాంరెడ్డిని రైతు పక్షపాతిగా అభివర్ణిస్తూ, ఆయన మరణం మంథని రాజకీయాలకు తీరని లోటని పేర్కొన్నారు. అలాగే బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి,మాజీ సింగిల్ విండో చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి, మాజీ ఎంపీపీ, సర్పంచ్ అత్తె చంద్రమౌళి, నూనె కుమార్ తో పాటు ముత్తారం మండలంలోని వివిధ పార్టీల నాయకులు రాంరెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు

## ఇవిఎం గోదాం వద్ద పటిష్ఠ భద్రత



ప్రజాపక్షం/జగిత్యాల : ఈవీఎం గోదాం వద్ద పటిష్ట భద్రత చేబడుతున్నట్లు జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంపులో ఈవీలంలను భద్రపరిచిన గోదాంను కలెక్టర్ తనిఖీ చేసి మాట్లాడారు. ప్రతి నెల ఈవీఎం గోదాం తనిఖీ చేయడం జరుగుతుందన్నారు. గోడౌన్‌లో యంత్రాల భద్రత, సీసీ కెమరాల పనితీరు, సాంకేతిక పరమైన అంశాలను సమగ్రంగా పరిశీలించడం జరిగిందన్నారు. గోదాం వద్ద ఎలాంటి లోపాలు లేకుండా పటిష్టమౌన భద్రత ఉండాలని, నిత్యం అప్రమత్తతతో పర్యవేక్షించాలని సిబ్బందికి సూచించారు. అదనపు కలెక్టర్ బిఎస్ లత, ఆర్డీవో మధుసూదన్ ఉన్నారు.

## ఎన్నికల నియమావళికి అనుగుణంగా విధులు నిర్వహణ

ఇన్‌చార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్



ప్రజాపక్షం/రాజన్నసిరిసిల్ల: రాష్ట్ర ఎన్నికల సంఘం నియమావళికి అనుగుణంగా అధికారులు, సిబ్బంది విధులు నిర్వర్తించాలని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ సూచించారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని గీతానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జోనల్ ఆఫీసర్స్, ఆర్ఓలు, ఏఆర్ఓలు, పీఓలు, ఏపీఓలకు శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించగా, ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ హాజరై మాట్లాడారు. ఎన్నికల విధులను నిష్పక్షపాతంగా.. నిజాయితీగా ఎంతో జాగరూకతతో నిర్వర్తించాలని ఆదేశించారు. నియమ, నిబంధనల స్పష్టమైన అవగాహన ఉండాలని, ఎస్ ఈ సీ హ్యాండ్ బుక్ వెంట ఉండాలని సూచించారు. ఎస్ ఈసీ మార్గదర్శకాల మేరకు సజావుగా ఎన్నికలు జరిగేలా కృషి చేయాలని వివరించారు. సిరిసిల్లలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రం గీతానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఎన్నికల అధికారులు, సిబ్బంది ఎన్నికల సామగ్రితో వారికి కేటాయించిన వాహనాల్లోనే వెళ్లాలని స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రంలో ఎన్నికల రోజున అన్ని ఏర్పాట్లను సరి చూసుకోవాలని సూచించారు. ఓటర్లు 18 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి తీసుకువెళ్ళి ఓటు హక్కు వినియోగించుకోవచ్చని వెల్లడించారు. పోలింగ్ కేంద్రంలోకి మొబైల్ ఫోన్ అనుమతి లేదని స్పష్టం చేశారు. బ్యాలెట్ పేపర్ అకౌంట్, బ్యాలెట్ బాక్స్‌లు చెక్ చేసుకొని తీసుకువెళ్లాలని ఆదేశించారు. గుర్తింపు కార్డు ఉన్న పోలింగ్ ఏజెంట్స్, ఎన్నికల అధికారులు మినహా ఎవరికీ అనుమతి లేదని తెలిపారు. ఈ నెల 7,8 తేదీల్లో సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కార్యాలయాల్లో ఫెసిలిటేషన్ కేంద్రాలు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, వెంకటేశ్వర్లు, ట్రైనింగ్ నోడల్ అధికారి శ్రీనివాసాచారి, జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, ఖదీర్ పాషా, మహేష్ కుమార్ ఉన్నారు.

## ప్రభుత్వ పాలనలో రెవెన్యూ వ్యవస్థ కీలకం: కలెక్టర్



ప్రజాపక్షం/సిద్దిపేట: రెవెన్యూ రికార్డుల నిర్వహణ, ప్రభుత్వ భూముల సంరక్షణ సక్రమంగా చేయాలని జిల్లా కలెక్టర్ హైమావతి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ ఐడిఓసి సమావేశ మందిరంలో ఆర్డీఓలు, అన్ని మండలాల తహశీల్దార్లతో అధికారులతో సమావేశ నిర్వహించి, గ్రామాలు, మండలాల వారిగా వివిధ రెవెన్యూ అంశాలపై సమీక్షించారు. భూ భారతి దరఖాస్తులు, తహశీల్దార్ నుండి జిల్లా కలెక్టర్ లాగిన్ వరకు గల పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించటం, ప్రభుత్వ భూముల పరిరక్షణ సమీక్షించి తగు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ ప్రభుత్వ పాలనలో రెవెన్యూ వ్యవస్థ చాల ముఖ్యమైందన్నారు. భూ సంబంధిత సమస్యలు ప్రధానంగా ప్రజలు ఎదుర్కొనే సమస్యలతో ఒకటిగా ఉంటుందన్నారు. భూ పరిపాలనలో పారదర్శకత, జవాబుదారితనం కోసం తీసుకొచ్చిన తీసుకోచ్చిన భూభారతి చట్టంను పారదర్శకంగా అమలు చేసి భూ సమస్యలు లేకుండ ప్రజలకు న్యాయం చేయాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులదే అన్నారు. చట్ట ప్రకారం భూ భారతి పెండింగ్ ధరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇచ్చి క్షేత్ర స్థాయిలో పరిశీలన ద్వారా దరఖాస్తులను త్వరగా అన్ని స్థాయిల్లో పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకొని రెవెన్యూ వ్యవస్థపై ప్రజలల్లో గౌరవం పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ప్రభుత్వ భూముల పరిరక్షణ, రెవెన్యూ అధికారుల ముఖ్యమైన బాధ్యత అని, ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండ చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్ఓఆర్, 1బి తదితర అన్నిరకాల రెవెన్యూ రికార్డులను పక్కగా నిర్వహించాలని సూచించారు. త్వరలోనే రెవెన్యూ రికార్డులపై డిప్యూటి తహశీల్దార్లకుప్రత్యేక సమావేశం నిర్వహించాలని సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్,డిఆర్ఓనాగరాజమ్మ. సిద్దిపేట, హుస్నాబాద్ ఆర్డీఓలు సదానందం, రాంమూర్తి, జిల్లాలోని అన్ని మండలాల తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## పుష్కరాలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

గోదావరి పుష్కరాల ఘాట్లను పరిశీలించిన కలెక్టర్ కోయ శ్రీహర్ష

ప్రజాపక్షం/గోదావరిఖని : పెద్దపల్లి జిల్లా పరిధిలో గోదావరినది పుష్కరాలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. గురువారం ఆయన అంతర్గాం మండలంలోని గోయల్‌వాడ, రామగుండం మండలం గోదావరిఖని సమ్మక్క, సారాలమ్మ జాతర ప్రదేశాలు, రామగిరి మండలం సుందిళ్ల శ్రీలక్ష్మీ నరసింహాస్వామి, మంథని శ్రీగౌతమేశ్వరస్వామి దేవాలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గోయల్‌వాడ వద్ద ప్రతిరోజు 30 వేల మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ఆ మేరకు శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. గోదావరిఖని వద్ద 50 శాతం శాశ్వత పనులు పూర్తయ్యాయని, మిగిలిన స్నానాల ఘాట్ల నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. ఇక్కడ ప్రతిరోజూ లక్ష మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. సుందిళ్లలో దేవాలయం వద్ద రోడ్ల మరమ్మత్తులు, బ్యారేజీ వద్ద రెండు వరుసల రోడ్డు నిర్మాణం చేపట్టాలన్నారు. మంథనిలో ఆలయం వద్ద గోదావరి పుష్కరాలకు ప్రతిరోజు 2 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున, ఇక్కడి సురబండేశ్వర్‌స్వామి టెంపుల్ నుంచి శివాలయం వరకు ఉన్న ఘాట్ వద్ద ఇన్ అండ్ ఔట్ దారులు ఏర్పాటు చేయాలన్నారు. కలెక్టర్ వెంట జిల్లా అదనపు కలెక్టర్ జె.అరుణశ్రీ, పెద్దపల్లి, మంథని ఆర్డీవోలు బి.గంగయ్య, సురేష్, దేసుప్రియ, ఈవై టీమ్ సభ్యులు తమీఖాన్, జైదీప్, పలువురు అధికారులు ఉన్నారు.



## పిల్లల ఎదుగుదలను నిరంతరం పర్యవేక్షించాలి: కలెక్టర్

ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : పిల్లల ఎదుగుదలను నిరంతరం మానిటర్ చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో సంక్షేమ శాఖ పని తీరు పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని 90 అంగన్వాడీ కేంద్రాల మరమ్మత్తుల కోసం 2 లక్షల చోప్పున నిధులు మంజూరు చేసామని వాటిని సద్వినియోగం చేయాలని కలెక్టర్ తెలిపారు. అంగన్వాడీ కేంద్రంలో ఉన్న పిల్లల ఎదుగుదలను ప్రతి నెలా మానిటరింగ్ చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. గర్భిణీలు, బాలింతలు అంగన్వాడి కేంద్రాలకు వచ్చి ఒక పూట భోజనం తీసుకునేలా చూడాలని అన్నారు. అంగన్వాడి కేంద్రాలకు వచ్చే పాలు, కోడిగుడ్లు, పప్పు దినుసులు,ఇతర ఆహార పదార్థాలు సరిగ్గా స్టోర్ చేయాలని అన్నారు. అంగన్వాడీ టీచర్లు, సూపర్ వైజర్ల పనితీరు మెరుగు పరిచేలా సిడిపిఓ రెగ్యులర్ మానిటరింగ్ చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రతివారం అంగన్వాడీ టీచర్ల సూపర్వైజర్ల పని తీరును పరిశీలిస్తానని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో వేణుగోపాల్ రావు,అలేఖ్య,పుష్ప, అధికారులు, పాల్గొన్నా రు.

## పెండింగ్ కేసులు
# త్వరగా పరిష్కరించేందుకు కృషి

సిద్దిపేట పోలీస్ కమిషనర్ రశ్మీపెరుమాల్

ప్రజాపక్షం/సిద్దిపేట: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ రశ్మీ పెరుమాల్ ఆదేశించారు. గురువారం జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణపై సిద్దిపేట పోలీస్ కమిషనర్ రశ్మీ పేరుమాల్ కమిషనరేట్‌లో ఏసిపిలు,ఇన్స్‌పెక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సిపి రశ్మీ పేరుమాల్ మాట్లాడుతూ తీవ్రమైన నేరాలు, మహిళలపై జరిగే వేధింపుల కేసుల్లో విచారణ వేగవంతం చేయాలన్నారు. రాత్రి సమయాలో దొంగతనాలు జరుగకుండ బ్లూకోల్టు, పెట్రోలింగ్ వాహనాలు గస్తిని పెంచాలని సూచించారు. అనుమానిత వ్యక్తులపై నిరంతర నిఘా ఉంచాలన్నారు. నేరస్తులనుపట్టుకోవటంలో సిసి కెమెరాల పాత్ర కీలకమన్నారు. ప్రతి గ్రామంలో,పట్టణ ప్రాంతాల్లో నేను సైతం కార్యక్రమంలో భాగంగా మరిన్ని సిసి కెమెరాలు ఏర్పాటు చేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలన్నారు. వారి సమస్యలను విని తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించటం, బహిరంగ ప్రదేశాల్లో న్యూసెన్స్ చేయటంపై ఈ పెట్టి కేసుల్లో జరిమానతో పాటు జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. అనంతరం పోలీసు కమిషనరేట్ వాహనాలను తనిఖీ చేశారు. ఈసమావేశంలో జిల్లాలోని వివిధ విభాగాల ఏసిపిలు, ఇన్స్‌పెక్టర్లు. సబ్ ఇన్స్‌పెక్టర్లు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## మున్సిపల్‌ను అద్భుత నగరంగా
# తీర్చిదిద్దేందుకు కృషి: ఎమ్మెల్యే



ప్రజాపక్షం/సుల్తానాబాద్: మున్సిపల్‌ను అద్భుత నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణా రావు అన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని 11వ వార్డు అభ్యర్థి కల్వల అంజలి సాగర్13 వార్డ్ 14వ వార్డు రేగోళం పద్మ అబ్బయ్య గౌడ్, సిద్ధ తిరుపతి,12 వార్డు అభ్యర్థి దున్నపోతుల లలిత రాజయ్య,4 వార్డు బిరుదు రాధాకృష్ణ, 15 వార్డు అభ్యర్థి గాదాసు అంజలి రవీందర్, లా కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన రెండు సంవత్సరాల కాలంలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అద్భుత పాలనను అందిస్తున్నారని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో పాటు 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్ 5 లక్షల ఆరోగ్యశ్రీని 10 లక్షలకు పెంచారని రైతు రుణమాఫీ సన్నఒడ్లకు బోనస్, ఇందిరమ్మ గృహాలు, రేషన్ కార్డులు, అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీ దేనని అన్నారు. 9 సంవత్సరాలు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీ ప్రజలకు చేసింది శూన్యమని పెద్దపల్లి నియోజకవర్గాన్ని పూర్తిస్థాయిలో భ్రష్టు పట్టించారని సుల్తానాబాద్ మండలం పై సమితి తల్లి ప్రేమను చూపారని గత పాలకులు కేవలం ఆస్తులు సంపాదించుకునేందుకే అధికారంలోకి వచ్చారని. తాను అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల కాలంలోనే ప్రజల కోరిక మేరకు అన్ని రకాల అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్న తెలిపారు. సిసి రోడ్లు డ్రైనేజీలు తోపాటు మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నానని కుల సంఘాల భవనాలను అందిస్తూ ప్రతి కులానికి ప్రాధాన్యతను ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్య గౌడ్ మార్కెట్ చైర్మన్ ప్రకాశరావు మాజీ మార్కెట్ చైర్మన్ సాయిరి మహేందర్, ఆయిల రమేష్, శ్రీగిరి శ్రీనివాస్, , పెగడ పరుష రాములు, కల్లెపెల్లి జానీ, లతోపాటు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ,మహిళలు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి



ప్రజాపక్షం / తిర్యాణి : తిర్యాణి మండల అభివృద్ధికి, మారుమూల గ్రామాల సమస్యల పరిష్కారానికి ఎంపిడిఒ వేముల మల్లేష్ సహకరించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఆయనను నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు నైతం రాంచందర్, వేముల హేమలత మాట్లాడుతూ మండలంలోని గిరిజన గ్రామాలు, కొండ ప్రాంతాల్లో వేసవి తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. మారుమూల ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో పారదర్శకత పాటించాలని, లబ్ధిదారులకు బిల్లులు సకాలంలో చెల్లించి నాణ్యమైన ఇళ్లు నిర్మించేలా పర్యవేక్షించాలని సూచించారు. అర్హులైన ప్రతి పేదవాడిని గుర్తించి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, మండల ప్రగతికి పూర్తిస్థాయిలో సహకరించాలని వారు కోరారు.కాంగ్రెస్ పార్టీ నాయకులు అంకం గౌరయ్య, కూన సురేష్, కురుశంగ శోభన్, పెందుర్ ధర్మం, ఆవునూరి రవి, మేడిశెట్టి చందు, నల్లూరి రాజు, బొల్లం మల్లేష్, బొల్లం రాజు, తట్ల చిన్నయ్య, దాసరి వెంకటేశం పాల్గొన్నారు.

## మెరుగైన ఫలితాలే లక్ష్యంగా చదవాలి

అదనపు కలెక్టర్ దీపక్ తివారీ



ప్రజాపక్షం / ఆసిఫాబాద్ : పదవ తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ ఆకాంక్షించారు. గురువారం ఆసిఫాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న సాయంత్రం ప్రత్యేక తరగతులను తనిఖీ చేశారు. విద్యార్థులతో ముచ్చటించిన అదనపు కలెక్టర్ వారి చదువుల గురించి అడిగి తెలుసుకున్నారు. సమయాన్ని వృథా చేయకుండా కష్టపడి చదవాలని విద్యార్థులకు సూచించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి, వారికి అర్థమయ్యే రీతిలో బోధించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. సిలబస్ రివిజన్ త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. పాఠశాలలోని మౌలిక సదుపాయాలు, విద్యార్థులకు అందుతున్న వసతుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి, పాఠశాల ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.

## యువతిని మోసం చేసిన వ్యక్తికి పదేళ్ల జైలు

ప్రజాపక్షం / ఆసిఫాబాద్ : పెళ్లి పేరుతో యువతిని నమ్మించి మోసానికి పాల్పడిన వ్యక్తికి పదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ ఆసిఫాబాద్ జిల్లా ప్రధాన సెషన్స్ కోర్టు తీర్పునిచ్చింది. జిల్లా ఎస్‌పి నితిక పంత్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆసిఫాబాద్‌కు చెందిన బొమ్మన ప్రశాంత్ ఒక యువతిని వివాహం చేసుకుంటానని నమ్మించి 2020 డిసెంబర్‌లో పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం నిందితుడు బాధితురాలిని కాదని వేరే యువతిని పెళ్లి చేసుకున్నాడు. దీనిపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆసిఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో సాక్ష్యాధారాలను పరిశీలించిన ప్రధాన న్యాయమూర్తి ఎం.వి. రమేష్ నిందితుడిని దోషిగా నిర్ధారించి శిక్ష ఖరారు చేశారు. మహిళలను మోసగించి లైంగిక వేధింపులకు గురిచేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌పి హెచ్చరించారు.దర్యాప్తు జరిపిన ఇన్‌స్పెక్టర్ అశోక్, వాదనలు వినిపించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ జగన్మోహన్ రావు, పర్యవేక్షించిన ఎఎస్‌పి చిత్తరంజన్, సిఐ బాలాజీ వర ప్రసాద్, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ రామ్‌సింగ్‌లను ఎస్‌పి అభినందించారు.

## విద్యార్థులకు తెలుగు, హిందీ టాలెంట్ టెస్ట్



ప్రజాపక్షం/మోర్తాడ్: మోర్తాడ్ మండల కేంద్రంలోని ఎంఆర్సి లో గురువారం తెలుగు, హిందీ టాలెంట్ టెస్ట్ నిర్వహించడం జరిగిందని మోర్తాడ్ మండల విద్యాశాఖ అధికారి డి.సమ్మిరెడ్డి తెలిపారు. ఈ టాలెంట్ టెస్ట్‌కు మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఇద్దరు చొప్పున రావడం జరిగిందని, వారికి టాలెంట్ టెస్ట్ నిర్వహించడం జరిగిందన్నారు. తెలుగులో ప్రథమ బహుమతి పి.శ్రావణి జడ్పీహెచ్ఎస్ గర్ల్స్ మోర్తాడ్, ద్వితీయ స్థానం ఎం.శాన్విత జడ్పీహెచ్ఎస్ ధర్మోరా, అలాగే హిందీ భాషలో కె. అనుశ్రీకా కేజీబీవీ మోర్తాడ్‌కు ప్రథమ స్థానం, జైనబ్ జడ్పీహెచ్ఎస్ పాలెం, ద్వితీయ స్థానం రావడం జరిగిందని ఎంఈఓ సమ్మిరెడ్డి తెలిపారు. టాలెంట్ టెస్ట్‌లో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంస పత్రాలను అందచేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు డీకే జగదీశ్వర్, అన్ని పాఠశాలల తెలుగు, హిందీ బోధన ఉపాధ్యాయులు, ఎంఆర్‌సి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నిర్మల్‌లో కాంగ్రెస్ జోరు.. ఇంటింటా ప్రచారం

ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్ చార్జ్ కుచాడి శ్రీహరి రావు,మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలాచారి విస్తృతంగా పర్యటిస్తున్నారు.గురువారం పట్టణంలోని 16వ వార్డు రామ్ నగర్,17వ వార్డు ఆశ్రా కాలనీల్లో వారు కాంగ్రెస్ అభ్యర్థుల తరపున ఇంటింటా ప్రచారం నిర్వహించారు.రామ్ నగర్ చేరుకున్న మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలాచారికి పంచముఖి హనుమాన్ మందిర ప్రాంగణంలో స్థానికులు గజమాలతో ఘనంగా సన్మానం చేశారు.అనంతరం అశ్రా కాలనీలో ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ ప్రథకాలు ప్రతి ఇంటికి చేరుతున్నాయని,అభివృద్ధి కొనసాగాలంటే కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.16వ వార్డు అభ్యర్థి ఉమేందర్,17వ వార్డు అభ్యర్థి ఫెరోజ్ విజయం కోసం కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ వాజీద్,గ్రంథాలయ సంస్థ కలీం, మజార్ ఖాన్,వార్డు ఇన్ చార్జ్ ఓడనాల రాజేశ్వర్,ఎర్రవోతు రాజేందర్,పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు,స్థానికులు పాల్గొన్నారు.



# పకడ్బందీగా సిఎం పర్యటనకు ఏర్పాట్లు

అధికారులతో కలెక్టర్, సిపి సమీక్ష



ప్రజాపక్షం/నిజామాబాద్ : అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల కోసం సిఎం రేవంత్‌రెడ్డి 6న జిల్లా పర్యటనకు విచ్చేస్తున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, సిపి సాయిచైతన్య జిల్లా అధికారులతో సి ఎంఓ కార్యాలయం నుంచి హాజరైన భద్రతా విభాగం అధికారులతో కలిసి గురువారం తుది ఏర్పాట్లను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. డిచ్‌పల్లి మండలం బర్ధిపూర్ శివారులో ఏర్పాటు చేసిన బహిరంగ సభాస్థలి ప్రాంగణం, హెలిప్యాడ్, వాహనాల పార్కింగ్ తదితర ప్రాంతాలను నిశితంగా పరిశీలన చేశారు. సిఎంపర్యటన సందర్భంగా ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. హెలిప్యాడ్ నుంచి సభాప్రాంగణంవరకు సిఎం కాన్వాయ్‌కు ఎలాంటి అడ్డంకులు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బహిరంగ సభకు వచ్చే వారి వాహనాలను పార్కింగ్ చేసుకునేందుకు ఎంపిక చేసిన ప్రదేశంలోనే వాహనాలు నిలిపేలా చూడాలన్నారు. సిఎం సభకు విద్యుత్ అంతరాయం తలెత్తకుండా చర్యలు చేపట్టాలని, సభకు హాజరయ్యే వారికి తాగునీరు వంటి వసతులు కల్పిస్తూ, ప్రథమ చికిత్స సదుపాయం, అంబులెన్స్ అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కాగా సిఎం భద్రతకు పకడ్బంధీ బందోబస్తును ఏర్పాటు చేయాలని, సిఎం పర్యటన నేపథ్యంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సిపి అధికారులకు సూచించారు. ఆయా శాఖల అధికారులు పరస్పరం సమన్వయంతో పని చేయాలన్నారు. ముందస్తుగానే ఏర్పాట్లను పూర్తి చేసుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట ట్రేనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావి, అదనపు డీసీపీ బస్వారెడ్డి, సీఎంఓ కార్యాలయ భద్రతాధికారి మాధవ రావు, ఏసిపిలు రాజావెంకట్‌రెడ్డి, ప్రకాష్, మస్తాన్‌అలీ, ఆర్డీఓ రాజేంద్రకుమార్, అధికారులున్నారు.

## జాతీయ బిసి యువజన సంఘం అధ్యక్షుడిగా 'బట్టు'



ప్రజాపక్షం/నిజామాబాద్ : జాతీయ బిసి యువజన సంఘం నగర అధ్యక్షునిగా బట్టు సాయి ప్రసాద్‌రాజు నియామకమయ్యారు. ఈ మేరకు జాతీయ బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కెంపుల నాగరాజు, జాతీయ బిసి యువజన సంఘం జిల్లా అధ్యక్షులు శ్యామ్‌బాబు నియామక ఉత్తర్వులు ఇచ్చారు. జిల్లా కేంద్రంలోని గీత భవనంలో గురువారం జరిగిన ఈ కార్యక్రమానికి బిసి జెఎసి జిల్లా వైస్‌చైర్మన్ బొబ్బిలి నర్సయ్య ముఖ్య అతిథిగా హాజరై సాయిప్రసాద్ రాజుకు నియామక పత్రాన్ని అందజేశారు. జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపి ఆర్ కృష్ణయ్య ఆదేశాల మేరకు ఈ నియామకం చేసినట్లు తెలిపారు. బిసి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవంత్, బీసీ జెఎసి కోచైర్మన్లు యెండల ప్రదీప్, కరిపె గణేష్, తెలంగాణ ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు బరికుంట శ్రీనివాస్, బిసి నాయకులు సభ్యులు పాల్గొన్నారు.

## పంటల సాగుకు రైతులను అధికారులు ప్రోత్సహించాలి

జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



ప్రజాపక్షం/నిర్మల్ : ఆధునిక పంటల సాగుకు రైతులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం,జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్,వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రైతులకు వ్యవసాయం లాభసాటిగా మా ర్చేలా అధికారులు చేయూతను ఇవ్వాలని అన్నారు. పంట మార్పిడి విధానం రైతులకు అలవాటు చేయాలని తెలిపారు.సహజ ఎరువుల వాడకం పెంచేలా కృషి చేయాలని చెప్పారు.అవసరాన్ని బట్టి భూసార పరీక్షలు నిర్వ హిస్తూ, మోతాదుకు మించిన ఎరువుల వాడకం వల్ల కలిగే నష్టాలపై రైతుల్లో విస్తృత కాలంలో సేంద్రీయ పంట ఉత్పత్తుల డిమాండ్,ప్రాముఖ్యత,లాభాలు,సాగు మె లుకువలు,అధికారులు రైతులకు వివరించి, ప్రోత్సహించాలని సూచించారు. నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ మిషన్ కింద నిర్దేశించిన అన్ని లక్ష్యాలు పూర్తి చేయాలని ఆదేశించారు.ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. రైతులందరికీ ప్రభుత్వాలు అందించే ప్రోత్సా హకాలు తప్పనిసరిగా అందించాలని వివరిం చారు. క్షేత్ర స్థాయిలో మండల వ్యవసాయ అధికా రులు ఎల్లప్పుడూ రైతులకు అందుబాటులో ఉండాలని చెప్పారు. జిల్లాలో ఆయిల్ ఫామ్ పంట ల సాగు విస్తీర్ణం మరింత పెంచాలని తెలిపారు. ఆయిల్ ఫామ్ పంటల సాగుతో రైతులు తక్కువ శ్రమ, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందవచ్చునని,అలాగే ప్రభుత్వాలు అందిస్తున్న ప్రోత్సాహకాల విషయాలు రైతులకు తెలియ జెప్పి, ఆయిల్ పామ్ పంట విస్తీర్ణం పెంచాలని అ న్నారు .దీనితో పాటుగా రైతులకు అధిక లాభసాటిగా ఉండే ఉద్యాన పంటలైన పండ్లు, కూరగాయలు,పూల పంటల విస్తారం పెంచే విధంగా అధికారులు చొరవ చూపాలని తెలిపారు.జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్,ఎడిఎలు విద్యాసాగర్,శ్రీనివాస రాజు, సుజాత,వీణ,ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిపక్షాల తప్పుడు మాటలు నమ్మి మోసపోవద్దు..

ఖానాపూర్,ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



ప్రజాపక్షం/ఖానాపూర్ : మున్సిపల్ ఎన్నికల సందర్భంగా బుధవారం రోజు రాత్రి శాంతి నగర్ 9వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి చింతపండు లక్ష్మి ,అంబేద్కర్‌నగర్,గోసంగి కాలనీ 3వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి జన్నరావు విజయలక్ష్మి ,శంకర్లతో కలిసి,నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు,ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని ప్రజలని కోరారు.రెండేళ్ల కాలంతోనే పట్టణంలో చాలా అభివృద్ధి జరిగిందని సీసీ రోడ్లు ,డ్రైనేజిలు,నిర్మించామన్నారు.ఇప్పటికే పట్టణ అభివృద్ధికై రూ. 15 కోట్లు మంజూరయి పనులు మొదలయ్యాయని అన్నారు.అధికార పార్టీ అభ్యర్థులు గెలిస్తే మరింత అభివృద్ధి చెందడానికి ఆస్కారం ఉందని తెలిపారు.పేదలు,మధ్యతరగతి, బడుగు బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు.గత బీఆర్ఎస్ పాలనలో ఒక్క కొత్త రేషన్ కార్డు ఇవ్వలేదని,కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన ప్రతి పేద కుటుంబాలకు రేషన్ కార్డులు అందజేసి,ప్రతి వ్యక్తికి 6 కేజీల చొప్పున ఉచిత సన్న బియ్యం పంపిణీ చేస్తున్నమన్నారు.అదే విధంగా 200 యూనిట్ల లోపు వినియోగించే పేద,బలహీన కుటుంబాలకు ఉచిత విద్యుత్ సరఫరా అందజేస్తున్నామన్నారు.మహిళలందరికీ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని,ఇళ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నామన్నారు.కోటి మంది మహిళలను కోటేశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తుందన్నారు.మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మజీద్,మండల అధ్యక్షుడు దయానంద్ మాజీ మున్సిపల్ చైర్మన్ రాజేందర్,కాంగ్రెస్ సినియర్ నాయకులు మ్యాదరి రాజేశ్వర్,దండు రాజేశ్వర్,దాసరి రాజేశ్వర్, మండల నాయకులు,పట్టణ నాయకులు,కార్యకర్తలు,పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికలకు పోలీసుల సన్నద్ధత




ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : మున్సిపల్ ఎన్నికలను ప్రశాంతంగా,పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా పోలీసు శాఖ పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని జిల్లా ఎపి జి.జానకి షర్మిల తెలిపారు.ప్రజలు ఎలాంటి భయాందోళనలు లేకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.ఎన్నికల నిర్వహణలో భాగంగా భద్రతా చర్యలపై పోలీస్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు ఎస్పీ వెలడించారు.సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, సున్నిత ప్రాంతాలను ముందుగానే గుర్తించి అక్కడ ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా కఠిన నిఘా కొనసాగిస్తామని స్పష్టం చేశారు . ఎన్నికల సమయంలో గొడవలు,ఘర్షణలు జరగకుండా రౌడీషీటర్లు,పాత నేరస్తులు,అసాంఘిక శక్తులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు.అవసరమైన చోట బైండోవర్ కేసులు నమోదు చేయడంతో పాటు ఆయుధాల అప్పగింతను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. మద్యం,నగదు,ఇతర విలువైన వస్తువుల పం పిణీ ద్వారా ఓటర్లను ప్రలోభ పెట్టే ప్రయత్నాలను పూర్తిగా అరికట్టేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పా ట తుచేసినట్లు తెలిపారు.చెక్‌పోస్టుల వద్ద నిరంతరం తనిఖీలు చేపట్టి అక్రమ రవాణాలను అడ్డుకోవాలని ఆదేవించారు.ఈ తరహా అక్రమాలకు పాల్పడితే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.పోలింగ్ కేంద్రాల వద్ద మహిళలు ,వృద్ధులు నిర్భయంగా ఓటు వేయగలిగేలా పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు.ఎన్నికల కోడ్‌ను కచ్చితంగా అమలు చేస్తామని,ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంతటామని ఎస్పీ స్పష్టం చేశారు.ఎన్నికల ప్రక్రియ పూ ర్తయ్యే వరకు అన్ని విభాగాలు సమన్వయంతో ప నిచేసి జిల్లాలో శాంతి భద్రతలు కాపాడాలని తెలిపారు.


## మహిళ సంఘాల బలోపేతానికి ప్రభుత్వం కృషి

ప్రజాపక్షం/అల్లాదుర్గం మహిళా స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేసేందుకు, తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని ముప్పారం గ్రామ సర్పంచ్ కవిత అన్నారు. మండల పరిధిలోని ముప్పారం గ్రామానికి మంజూరైన మహిళా సమైక్య భవన నిర్మాణానికి వట్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మితో కలిసి భూమి పూజ చేశారు. గ్రామ, స్థాయిలో మహిళా సమైక్య శాశ్వత భవనాల నిర్మాణం కొరకు ప్రభుత్వం మంజూరు చేసినట్లు తెలిపారు. మహిళా సాధికారిత, ఆర్థిక అభివృద్ధి చెందడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆమె అన్నారు. ఎంపిడిఒ వేద ప్రకాశ్ రెడ్డి, పీఆర్ ఏఈ రమేష్, ఏపీఎం రుక్మిణి, మండల పార్టీ అధ్యక్షుడు శేషారెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి గణేష్, మహిళ సంఘం సభ్యులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు నాగప్ప, విఠల్ పాల్గొన్నారు.

## గజ్వేల్ పట్టణ అభివృద్ధి కాంగ్రెస్ తోనే సాధ్యం

మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి

ప్రజాపక్షం / గజ్వేల్ : గజ్వేల్ పట్టణ అభివృద్ధి కాంగ్రెస్ తోనే సాధ్యపడనుండగా, ప్రతి పేద గౌరవంగా బ్రతకాలన్నదే సిఎం రేవంత్ రెడ్డి లక్ష్యమని కొండపాక మార్కెట్ కమిటీ చైర్మన్ విరూపాక శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం గజ్వేల్ లో 20వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి వంటేరు కొండల్ రెడ్డికి మద్దతుగా ఆయన ఇంటింటి ప్రచారం చేసిన సందర్భంగా మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు వర్తింపజేస్తున్నట్లు తెలిపారు. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీలను అమలు చేస్తూ ప్రతి కుటుంబానికి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు స్పష్టం చేశారు. అలాగే పేద ప్రజలపై ఆర్థిక భారం తగ్గించేందుకు 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్, రూ.500కే వంట గ్యాస్ సిలిండర్, ప్రతి పేదకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరి, మహిళలకు వడ్డీ లేని రుణాలు, రూ 2 లక్షల రుణమాఫీ, రైతు భరోసా, స న్న వడ్లకు రూ 500 బోనస్, ఉచిత బస్సు సౌకర్యం, ఇందిరమ్మ ఇండ్ల మంజూరు వంటి పథకాలను కొనసాగిస్తూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల మన్ననలు పొందుతున్నట్లు చెప్పారు. ముఖ్యంగా గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి సహకారంతో 20 వ వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే అవసరమైన నిధులు సాధించి ఆదర్శంగా తీర్చిదిద్దుతామని, పేదల ఆర్థికాభివృద్ధి కోసం నిస్వార్థంగా సేవలందించే కొండల్ రెడ్డికి ఓట్లు వేయాలని అభ్యర్థించారు.



## లేబర్ కోడ్స్ వ్యతిరేక పోస్టర్ విడుదల

ఎఐటియుసి జిల్లా ప్రధాన.. కార్యదర్శి బోగే ఉపేందర్



ప్రజాపక్షం / కాగజ్ నగర్ : ఈ నెల 12న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ సిర్పూర్ కాగజ్ నగర్ పేపర్ మిల్ గేటు ముందు కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం వాల్ పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం పేపర్ మిల్ సెక్యూరిటీ ఆఫీసర్ రమాకాంత్‌కు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్, సిఐటియుసి జిల్లా కార్యదర్శి రాజేందర్, టిఆర్ఎస్‌కేవి జిల్లా అధ్యక్షుడు అంబాల ఓదెలు మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఎస్‌పిఎం ఫ్యాక్టరీలో వెంటనే గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించాలని, స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు రూపాయలు చెల్లించాలని, కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం పాత కార్మిక చట్టాలను మార్చడం అన్యాయమని విమర్శించారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, అసంఘటిత రంగ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేసి ప్రభుత్వమే నేరుగా వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఐఎన్‌టియుసి నాయకులు కలికోట రమణయ్య, అల్లి రాజయ్య పాల్గొన్నారు.

## ఎస్‌సి, ఎస్‌టి కేసులో తూప్రాన్ డిఎస్‌పి విచారణ



ప్రజాపక్షం/శివ్వంపేట : మండలంలోని లింగోజిగూడ గ్రామంలో గత నెలలో నమోదైన ఎస్‌సి, ఎస్‌టి కేసులో గురువారం తూప్రాన్ డిఎస్‌పి నరేందర్‌గౌడ్ బ హిరంగ విచారణ చేపట్టారు. ఎస్ఐ మధుకర్‌రెడ్డితో కలిసి లింగోజిగ గ్రామపంచాయతీ పరిధిలోని మంత్రాలమ్మ, రేణుక ఎల్లమ్మతల్లి దేవాలయం వద్ద గ్రామస్థుల సమక్షంలో బాధితులను కేసులోని సాక్షులను విచారించి వివరాలను సేకరించి వీడియో రికార్డు చేయించారు. డిఎస్‌పి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని లింగోజిగూడ గ్రామానికి చెందిన ఇటీవలే గెలుపొందిన సర్పంచ్ బాసంపల్లి అమృతఅశోక్‌గౌడ్ గత నెల 30న మంత్రాలమ్మ దేవాలయం వద్ద మొక్కులు చెల్లించి విందు భోజనాలు ఏర్పాటు చేయగా అందుకు పిల్లుట్ల గ్రా మానికి చెందిన హంసాన్‌పల్లి నర్సింహారెడ్డి మరికొంత మందితో కలసి హాజరయ్యారు. ఇదే కార్యక్రమానికి లింగోజిగూడ తండాకు చెందిన మాలోత్ వేణు హాజరుకాగా అందరి ముందు తనను నర్సింహారెడ్డి కులంపేరుతో దూషించడ మే కాకుండా వికలాంగుడవని అవహేళన చేశారని మాలోత్‌వేణు ఫిర్యాదు చేయడంతో శివ్వంపేట పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ మధుకర్‌రెడ్డి ఎస్‌సి, ఎస్‌టి కేసును నమోదు చేశారన్నారు. ఎస్‌సి, ఎస్‌టి కేసులో సమగ్ర విచారణ జరిపినట్టు ఆయన తెలిపారు. గ్రామాలలో అందరు కలసి ఎలాంటి గొడవలు లేకుండా ఉండాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మధుకర్‌రెడ్డి, పిల్లుట్ల సర్పంచ్ బుర్ర మురళీగౌడ్, లింగోజిగూడ సర్పంచ్ బాసంపల్లి అమృతఅశోక్‌గౌడ్, మాజీ సర్పంచ్ మెగావత్ రవినాయక్, పంచాయతీ కార్యదర్శి మహిపాల్, పోలీసు సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## నిర్మల్ మునిసిపాలిటీపై గులాబీ జెండా ఎగరాలి

ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : నిర్మల్ మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గులాబీ శ్రేణుల్లో ఉత్సాహం నింపారు.మున్సిపాలిటీపై బీఆర్ఎస్ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కేసీఆర్ లా కష్టపడి పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.వార్డుల్లో జోరుగా ప్రచారం ఈరోజు నిర్మల్ మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డు అభ్యర్థి గుల్లే రాజన్న,19వ వార్డు అభ్యర్థి కర్రోళ్ల లక్ష్మి కి మద్దతుగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గడపగడప కార్యక్రమం నిర్వహించారు.ఇంటింటికి తిరుగుతూ స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుంటూ,కారు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు.

కెసిఆర్ చేసిన అభివృద్ధిని గుర్తుంచుకోవాలి

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,నిర్మల్‌ను జిల్లాగా మార్చి అభివృద్ధి పథంలో నడిపించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కే దక్కుతుందని గుర్తు చేశారు.జిల్లా అభివృద్ధిని కాంక్షించే వారు కేసీఆర్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.నిర్మల్ పట్టణ సమగ్ర వికాసం కేవలం బీఆర్ఎస్ తోనే సాధ్యమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో నిర్మల్ నియోజకవర్గ ఇంచార్జి రాంకిషన్ రెడ్డి,పార్టీ ముఖ్య నాయకులు,కార్యకర్తలు,వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఢిల్లీ చరిత్ర సృష్టించేనా!

## టాస్ గెలిచిన ఆర్‌సిబి




మహిళల ప్రీమియర్ లీగ్ నాలుగో సీజన్ విజేత ఎవరో మరికాసేపట్లో తేలనుంది. రెండో సీజన్ విజేత రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తో ఢిల్లీ క్యాపిటల్స్ అమీతుమీకి తేల్చుకోనుంది. మూడుసార్లు ఆఖరి మెట్టుపై చతికిలపడిన ఢిల్లీ.. ఈసారి కప్‌ను ఒడిసిపట్టాలనే కసితో ఉంది. క్రికెట్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న టైటిల్ పోరులో టాస్ గెలిచిన స్మృతి మంధాన బౌలింగ్ ఎంచుకుంది. గత మూడు సీజన్లలో ఎలిమినేటర్ విజేతనే ట్రోఫీ వరించింది. ఈ సంప్రదాయం కొనసాగితే గుజరాత్ జెయింట్స్ దెబ్బకొట్టి.. ఫైనల్‌కు దూసుకొచ్చిన ఢిల్లీ కప్ కల సాకారమైనట్టే. లీగ్ దశలో చెరొక మ్యాచ్ గెలిచిన ఆర్‌సిబి, ఢిల్లీ.. ఆఖరి పంచ్‌కు సిద్ధమయ్యాయి. బ్యాటర్ గౌతమీ అందుబాటులో లేకపోవడంతో ఆల్‌రౌండర్ పూజా వస్త్రాకర్ బెంగళూరు తుది జట్టులోకి వచ్చింది. ఢిల్లీ జట్టు ఏ మార్పులు చేయకుండా ఆడుతోంది.

**ఢిల్లీ క్యాపిటల్స్ తుది జట్టు :** లిజెల్లీ లీ(వికెట్ కీపర్), షఫాలీ వర్మ, లారా వొల్వార్ట్, జెమీమా రోడ్రిగ్స్(కెప్టెన్), మరిజానే కాప్, చిన్నెల్లీ హెన్రీ, నికీ ప్రసాద్, స్నేహ్ రానా, మిన్ను మణి, శ్రీ చరణి, నందిని శర్మ.

**ఆర్‌సిబి తుది జట్టు :** గ్రేస్ హ్యారిస్, స్మృతి మంధాన(కెప్టెన్), జార్జియా వోల్, రీచా ఘోష్(వికెట్ కీపర్), రాధా యాదవ్, నడినే డీక్లెర్క్, పూజా వస్త్రాకర్, అరుంధతి రెడ్డి, సయాలీ సత్ఘరే, శ్రేయాంక పాటిల్, లారెన్ బెల్.

## బిసిసిఐ మాజీ అధ్యక్షుడికి లైన్ క్లియర్..

### తొమ్మిదేళ్ల నిషేధం ఎత్తివేసిన సుప్రీం కోర్టు!

భారత క్రికెట్ నియంత్రణ మండలి మాజీ అధ్యక్షుడు అనురాగ్



ఠాకూర్‌కు సుప్రీం కోర్టులో ఊరట లభించింది. ఆయన పై కొనసాగుతున్న నిషేధాన్ని గురువారం అత్యున్నత న్యాయ స్థానం ఎత్తివేసింది. దాంతో, బిసిసిఐ కార్యకలాపాల్లో పాల్గొనేందుకు ఠాకూర్‌కు మార్గం సుగమమైంది. నిషేధం కారణంగా 2017 నుంచి క్రికెట్ వ్యవహారాలకు దూరమైన ఠాకూర్ తనకు ఊరట కల్పించాలని సుప్రీం కోర్టులో సవాల్ చేశారు. గురువారం ప్రధాన న్యాయమూర్తి ఇందియా సూర్యకాంత్, జస్టిస్ జయ్మాల్య బాగ్చీలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణకు చేపట్టింది. ఠాకూర్‌పై విధించిన నిషేధం జీవితకాలం కొనసాగదని, ఇప్పటికే ఆయన తొమ్మిదేళ్ల క్రికెట్ కార్యకలాపాలకు దూరమయ్యారని ధర్మాసనం పేర్కొంది.

## వరల్డ్‌కప్‌లో కోహ్లీ, రోహిత్ ఎందుకు ఆడొద్దు?




రాబోయే వన్డే వరల్డ్ కప్‌లో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలకు అవకాశం దక్కేనా ? అనే ప్రశ్న అభిమానులను వెంటాడుతూనే ఉంది. వన్డే ఫార్మాట్‌లో మాత్రమే కొనసాగుతున్న రోకో అనుభవం ప్రపంచకప్‌లో భారత జట్టుకు చాలా అవసరమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ సైతం ఇదే మాట అంటున్నాడు. 2027 వన్డే ప్రపంచకప్‌లో కోహ్లీ, రోహిత్ ఎందుకు ఆడొద్దు అని మహీ భాయ్ ప్రశ్నించాడు. టి–20లు, టెస్టులకు వీడ్కోలు పలికిన విరాట్ కోహ్లీ, రోహిత్‌శర్మలు వన్డేల్లో మాత్రమే ఆడుతున్నారు. వచ్చే ఏడాది ప్రపంచకప్‌తో కెరీర్ ముగించాలనే ఆలోచనల్లో ఉన్న ఈ ద్వయం కల నెరవేరుతుందా?అనేది ప్రశ్నార్థంగా మారింది. ఈనేపథ్యంలో.. ధోనీ తన హయాంలో ఆడిన విరాట్, రోహిత్‌కు మద్దతు పలికాడు. ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న మహీ వయసు అనేది ఒక అంశం మాత్రమే. ఫామ్, ఫిట్నెస్.. ఈరెండే చాలా కీలకం.కాబట్టి ప్రస్తుతం ఫామ్‌తో, ఫిట్‌గా ఉన్న విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలు వచ్చే వన్డే ప్రపంచకప్‌లో ఎందుకు ఆడకూడదు? అని ప్రశ్నించాడు. వయసు 30 దాటినంత మాత్రాన వారిద్దరూ వచ్చే ప్రపంచకప్ ఆడకూడదా? రోకో భవితవ్యాన్ని నిర్ణయించాల్సింది మనం కాదు. వారే నిర్ణయం తీసుకోవాలి. ఫామ్‌తో, ఫిటెనెస్‌తో ఉండి జట్టును గెలిపిస్తున్నప్పుడు వారిని అడ్డుకోవడం దేనికి? అని తన అభిప్రాయం వెలిబుచ్చాడు ప్రస్తుతం రోహిత్ 38 ఏళ్లుండగా.. కోహ్లీకి 37 ఏళ్లున్నాయి. నిరుడు ఆస్ట్రేలియా పర్యటనతో వన్డే పగ్గాలు శుభమన్ గిల్‌కు అప్పగించడం.. యువకులను సానబెట్టాలనుకోవడం వంటివి కోహ్లీ, రోహిత్‌లకు సవాల్ విసురుతున్నాయి. హెడ్‌కోచ్ గౌతం గంభీర్‌తో విరాట్, హిట్‌మాన్ అంటీ ముట్టనట్టే ఉంటున్నారు. చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ సైతం రోకోకు వరల్డ్‌కప్‌లో అవకాశం ఇస్తాడనే నమ్మకం లేదు. ఫామ్‌లో ఉండేందుకు దేశవాళీ క్రికెట్‌లోనూ ఆడుతున్న ఈ లెజెండ్స్‌కు వరల్డ్‌కప్‌లో అవకాశమిచ్చి గౌరవంగా వీడ్కోలు పలకాల ని విశ్లేషకులు అంటున్నారు.

## పోటీ కోసం జికె

## ప్రపంచంలో అతి పొడవైన నది ఏది?

- భారతదేశం అంతరిక్షానికి వెళ్లిన తొలి వ్యక్తి ఎవరు?
  రాకేష్ శర్మ
- భారతదేశ రాజధాని ఏది?
  న్యూఢిల్లీ
- భారత రాజ్యాంగం ఎప్పుడు అమలులోకి వచ్చింది?
  26 జనవరి 1950
- భారత జాతీయ పక్షి ఏది?
  నెమలి
- భారత జాతీయ జంతువు ఏది?
  పులి
- భారత జాతీయ పుష్పం ఏది?
  కమలం
- భారత జాతీయ వృక్షం ఏది?
  మర్రిచెట్టు
- భారత జాతీయ గీతం రచించినవారు ఎవరు?
  రవీంద్రనాథ్ ఠాగూర్
- భారత జాతీయ గీతం పేరు ఏమిటి?
  జన గణ మన
- భారత జాతీయ గీతం ఆలపించడానికి ఎంత సమయం పడుతుంది?
  52 సెకన్లు
- ప్రపంచంలో అతి పెద్ద ఖండం ఏది?
  ఆసియా
- ప్రపంచంలో అతి పెద్ద మహాసముద్రం ఏది?
  పసిఫిక్ మహాసముద్రం
- ప్రపంచంలో అతి పొడవైన నది ఏది?
  నైల్ నది
- ప్రపంచంలో అతిఎత్తైన పర్వత శిఖరం ఏది?
  మౌంట్ ఎవరెస్ట్
- ప్రపంచంలో అతి చిన్న దేశం ఏది?
  వాటికన్ సిటీ
- భారతదేశంలో అతి పొడవైన నది ఏది?
  గంగా
- భారతదేశంలో అతి పెద్ద రాష్ట్రం (విస్తీర్ణం ప్రకారం) ఏది?
  రాజస్థాన్
- భారతదేశంలో అతి చిన్న రాష్ట్రం ఏది?
  గోవా
- భారతదేశంలో అతి పొడవైన ఆనకట్ట ఏది?
  హిరాకుడ్ డ్యామ్
- భారతదేశంలో అతి ఎత్తైన జలపాతం ఏది?
  జోగ్ జలపాతం
- భారతదేశ తొలి రాష్ట్రపతి ఎవరు?
  డా. రాజేంద్ర ప్రసాద్
- భారతదేశ తొలి ప్రధాని ఎవరు?
  జవహర్‌లాల్ నెహ్రూ
- భారతదేశ తొలి మహిళా ప్రధాని ఎవరు?
  ఇందిరా గాంధీ
- భారతదేశ తొలి మహిళా రాష్ట్రపతి ఎవరు?
  ప్రతిభా పాటిల్
- భారతదేశ తొలి మహిళా ఐపిఎస్ అధికారి ఎవరు?
  కిరణ్ బేడీ
- సూర్యుడు ఏ గ్రహ కుటుంబానికి చెందాడు?
  సౌర కుటుంబం
- భూమికి సహజ ఉపగ్రహం ఏది?
  చంద్రుడు
- సౌర కుటుంబంలో అతి పెద్ద గ్రహం ఏది?
  బృహస్పతి
- ఎర్ర గ్రహం అని ఏ గ్రహాన్ని అంటారు?



  మంగళ గ్రహం
- భూమి సూర్యుని చుట్టూ ఒకసారి తిరగడానికి పట్టే కాలం ఎంత?
  365 రోజులు
- భారతదేశ కరెన్సీ పేరు ఏమిటి?
  రూపాయి
- రూపాయి చిహ్నం (₹) రూపకర్త ఎవరు?
  ఉదయ్ కుమార్
- భారతీయ రిజర్వ్ బ్యాంక్ (RBI) స్థాపించబడిన సంవత్సరం?
  1935
- భారతదేశ జాతీయ క్రీడ ఏది?
  హాకీ
- ఒలింపిక్స్‌లో అత్యధిక బంగారు పతకాలు గెలిచిన క్రీడాకారుడు ఎవరు?
  మైకేల్ ఫెల్ప్స్
- ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) ప్రధాన కార్యాలయం ఎక్కడ ఉంది?
  జెనీవా
- ఐక్యరాజ్యసమితి (UNO) స్థాపించబడిన సంవత్సరం?
  1945
- ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయం ఎక్కడ ఉంది?
  న్యూయార్క్
- నోబెల్ బహుమతులు ఎవరి స్మారకంగా ఇవ్వబడతాయి?
  ఆల్ఫ్రెడ నోబెల్
- నోబెల్ శాంతి బహుమతి ఎక్కడ అందజేస్తారు?
  ఒస్లో (నార్వే)
- భారతదేశంలో అతి పెద్ద సరస్సు ఏది?
  చిలికా సరస్సు
- డెక్కన్ పీఠభూమి ఏ రాష్ట్రాల్లో విస్తరించి ఉంది?
  దక్షిణ భారత రాష్ట్రాలు
- భారతదేశంలో ఎడారి ప్రాంతం ఏది?
  థార్ ఎడారి
- పంచాయతీ రాజ్ వ్యవస్థ ప్రవేశపెట్టిన రాష్ట్రం ఏది?
  రాజస్థాన్
- భారతదేశంలో అత్యధిక జనాభా కలిగిన రాష్ట్రం ఏది?
  ఉత్తరప్రదేశ్
- విద్యుత్‌ను కనుగొన్న శాస్త్రవేత్త ఎవరు?
  బెంజమిన్ ఫ్రాంక్లిన్
- కంప్యూటర్ పితామహుడు ఎవరు?
  చార్లెస్ బాబేజ్
- టెలిఫోన్‌ను కనుగొన్నవారు ఎవరు?
  అలెగ్జాండర్ గ్రాహమ్ బెల్
- రేడియోను కనుగొన్నవారు ఎవరు?
  గుగ్లియెల్మో మార్కోని
- ఇంటర్నెట్ పితామహుడు ఎవరు?
  వింట్ సర్ఫ్
- భారతదేశ తొలి ఉపగ్రహం పేరు ఏమిటి?
  ఆర్యభట్ట
- ఇస్రో ప్రధాన కార్యాలయం ఎక్కడ ఉంది?
  సమాధానం: బెంగళూరు
- చంద్రయాన్1 ఏ సంవత్సరంలో ప్రయోగించారు?
  2008

# కమ్యూనిస్టు కూటమి గాలి వీస్తోంది






సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

**ప్రజాపక్షం/కొత్తగూడెం :** కార్పొరేషన్ ఎన్నికల్లో కమ్యూనిస్టు కూటమి గాలి వీస్తోందని, 60 డివిజన్ల వ్యాప్తంగా విశేష స్పందన లభిస్తోందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు అన్నారు. స్థానిక సిపిఐ కార్యాలయం శేషగిరి భవన్‌లో గురువారం దళిత సంఘాల ఐక్య సంఘటిత వేదికతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా శ్రేయస్సే తమకు ధ్యేయమని, తమకు పదవులు, అధికారం ముఖ్యం కాదన్నారు. కార్పొరేషన్ సాధించుకోవడం ద్వారా తన చిరకాల స్వప్నం సాకరమైందని, తద్వారా పాల్వంచ నుంచి సుజాతనగర్ వరకు అనూహ్యమైన అభివృద్ధి జరగనుందని, పరిశ్రమలు రానున్నాయని, ఉపాధి అవకాశాలు పెరిగి ప్రజల జీవనవిధానం మెరుగు పడుతుందన్నారు. ఇప్పటికే రూ.100 కోట్ల నిధులు వచ్చాయని, వాటితో కార్పొరేషన్ వ్యాప్తంగా అభివృద్ధి కొనసాగుతోందన్నారు. ఈ ఎన్నికల్లో సీట్ల సర్దుపాటు విషయంలో సమన్యాయం పాటించామని, జనరల్ స్థానాల్లో సైతం ఎస్‌సిలను నిలిపామని, బిసి, మైనార్టీలకు సముచిత గౌరవం దక్కిందన్నారు. ఇది అందరి ఎర్రజెండా అని, ఈ ఎర్రజెండాను గెలిపించుకోవడం ద్వారా అభివృద్ధి మరింత సాధ్యమవుతుందన్నారు. సిపిఐ, టిడిపి, దళిత సంఘాల ఐక్య సంఘటిత వేదిక కలిసి కష్టపడి పనిచేసి తమ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకుందామన్నారు. కాంగ్రెస్‌కు మనకు ఎలాంటి వైరం లేదని, సీట్ల సర్దుబాటు విషయంలో సంఖ్యాపరమైన సమస్య తలెత్తడంతో సిపిఐ కూటమి 60 సీట్లలో పోటీకి వెళ్లిందన్నారు. విధాన పరమైన విధానాల వల్లే విడివిడిగా పోటీ చేస్తున్నామని, రాష్ట్ర వ్యాప్తంగా కలిసే ఉన్నామని స్పష్టం చేశారు.




కమ్యూనిస్టులది ఏముందిలే అనటం అవివేకం అని, ప్రజాస్వామ్య ప్రభుత్వంలో ఎవరి పనులు వారివే అని గుర్తు చేశారు. 12వ వార్డు అభ్యర్థిని నాగలక్ష్మి ,13వ వార్డు అభ్యర్థిని పి.ఇందిరా ప్రియదర్శిని, 15వ వార్డు అభ్యర్థిని కె.సాహితి ఎన్నికల గుర్తు కంకి కొడవలికి ప్రజలు అత్యధిక ఓట్లు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. విలేకరుల సమావేశంలో కూసపాటి శ్రీనివాస్, బొమ్మెర శ్రీనివాస్, రత్నకుమారి, మేదిని లక్ష్మి, బొంకూరి పరమేష్, ఇటికల మొగిలి, దాసరి సారథి, ఎర్ర కామేష్, మాతంగి సంతోష్, పీక కృష్ణ, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

### సిపిఐలో 50 కుటుంబాలు చేరిక

భారత కమ్యూనిస్టు పార్టీలో ప్రకాష్‌నగర్‌కు చెందిన 50 కుటుంబాల వారు చేరారు. పల్లపు సాగర్, పల్లపు విజయ్ కుమార్, బోదాసు రామ్ ప్రసాద్, ఆధ్వర్యంలో చేరిన వారికి ఎమ్మెల్యే కూనంనేని ఎర్రకండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ కార్పొరేషన్ ఎన్నికల్లో సిపిఐ బలపరిచిన అభ్యర్థుల విజయం కోసం కృషి చేయాలని కోరారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే కూనంనేని చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులమై సిపిఐలో చేరినట్లు తెలిపారు. కార్పొరేషన్ ఎన్నిక ల్లో సిపిఐ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా పాల్గొన్నారు.

## ప్రచారంలో సిపిఐ అభ్యర్థుల ముందంజ



**ప్రజాపక్షం/పాల్వంచ :** 27 ఏండ్లుగా ఎన్నికలు ఎరుగని పాల్వంచ పట్టణ ప్రజలకు ఎన్నికలు తీసుకొచ్చిన ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పట్ల ప్రజలు సానుకూలంగా ఉన్నారు. దీంతో కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పాల్వంచ డివిజన్ పరిధి 27 డివిజన్‌లలో పోటీ చేస్తున్న సిపిఐ, తెలుగుదేశం పార్టీల అభ్యర్థులు ప్రచారంలో దూసుకెళుతున్నారు. పాల్వంచ రెండవ డివిజన్ లో సిపిఐ అభ్యర్థిని పగిడిపల్లి ఆదిలక్ష్మి , మూడవ డివిజన్ నుండి గుగులోత్ కల్పనలకు ప్రశాంత్‌నగర్ కాలనీ, వెంగళరావు కాలనీలలో ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. నాలుగో డివిజన్‌లో రావుల స్వాతి ప్రచారాన్ని ఉదృతంగా కొనసాగిస్తున్నారు. 6వ డివిజన్ నుండి బరిలో నిలుచున్న సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి ఉప్పుశెట్టి రాహుల్‌కు మద్దతుగా ఎఐఎస్‌ఎఫ్ నాయకులు, కార్యకర్తలు విస్తృత ప్రచారం చేస్తున్నారు. 40వ, డివిజన్ నుండి మరోసారి పోటీ చేస్తున్న పట్టణ కార్యదర్శి అడుసుమిల్లి సాయిబాబ పట్ల ప్రజలు, వ్యాపార వర్గాలు సానుకూల ధృక్పథాన్ని ప్రదర్శిస్తున్నారు. గతంలో మున్సిపల్ కౌన్సిలర్‌గా పనిచేసిన ఆయన పలు అభివృద్ధి పనులు చేపట్టారు. 35వ, డివిజన్ నుంచి నామా కీర్తి తెలుగుదేశం, సిపిఐ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రచారం సాగిస్తున్నారు. 37 డివిజన్ నుండి డాక్టర్ కమల తణ ప్రచారంలో చాపకింద నీరులా దూకుపోతున్నారు. పాత పాల్వంచ ఏరియాలోని 46,47 డివిజన్‌లలో గుర్రం వెంటేశ్వర్లు, మహమ్మద్ జిలానీబేగంల ప్రచారం దూసుకుపోతున్నారు. 45వ, డివిజన్‌లో విద్యావేత్త గౌతమి క్రిష్ణ గొల్లగూడెం, ఒడ్డుగూడెం తదితర కాలనీలలో ప్రచారంలో ముందంజలో ఉన్నారు. 39వ, వార్డు నుంచి మహమ్మద్ అస్లాం ప్రత్యర్థులకు గట్టి సవాల్ విసురుతున్నారు. 38 డివిజన్ నుండి చెరుకూరి శేఖర్ బాబు ప్రజల్లో కలిసిపోయి కంకీ కొడవలి గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరుతున్నారు. పట్టణ ప్రజలకు సుపరిచితులు వీసంశెట్టి విశ్వేశ్వరరావు 44 డివిజన్‌లో గెలుపు దిశగా దూసుకుపోతున్నారు.









## సిపిఐ అభ్యర్థుల ఇంటింటి ప్రచారం

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** భూపాలపల్లి మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్, సిపిఎంలు బలపరిచిన సిపిఐ కూటమి అభ్యర్థుల్లు 5వ వార్డు అభ్యర్థి గంగసరం శ్రీనివాస్, 24వ వార్డు అభ్యర్థి వేముల జ్యోతి శ్రీకాంత్ ఎన్నికల ప్రచారంలో దూసుకెళ్తున్నారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా ప్రజల సమస్యలను తెలుసుకుంటూ ప్రజా సమస్యలపై పోరాడే సిపిఐ పార్టీకి అవకాశం ఇవ్వాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. కార్యక్రమంలో 24వ వార్డు ఇంచార్జ్ రాజిరెడ్డి, కాంగ్రెస్ నాయకుడు కుప్పగల కిషోర్ రెడ్డి, వార్డు అధ్యక్షులు అశోక్, నాయకులు సాబీర్ ఖాన్, వేముల రాజమౌళి, కుడుదుల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.




## పేదల సమస్యలపై పోరాడేది కమ్యూనిస్టులే : సుధాకర్

### 17వ డివిజన్ సిపిఐ అభ్యర్థి స్వప్నను గెలిపించాలంటూ ఇంటింటి ప్రచారం



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** మున్సిపల్ కార్పొరేషన్‌లోని 17వ డివిజన్ గౌతంనగర్‌లో సిపిఐ తరపున పోటీ చేసిన అభ్యర్థి బి.స్వప్నను ఈనెల 11న జరిగే పోలింగ్‌లో కంకి కొడవలి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి సుధాకర్, నగర కార్యదర్శి ఓమయ్య ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గురువారం స్థానికంగా నిర్వహించిన ప్రచారంలో వారు పాల్గొన్నారు. అనునిత్యం పేదల సమస్యలపై పోరాడుతుంది కమ్యూనిస్టులేనన్నారు. డివిజన్‌లో తాగునీటి, మురికి కాలువలు, రోడ్లు, విద్యుత్ సరఫరా, ఇతర సంక్షేమ పథకాల అమలు కోసం సిపిఐ పని చేస్తుందని ఈసందర్భంగా ఓటర్లను కోరారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు అనిల్, ముత్యాలు, అలీ ఇమ్రాన్, తిరుపతి, సాయన్న పాల్గొన్నారు.

## మల్లన్న సాగర్ నిర్వాసితులకు మద్దతుగా సిపిఐ పోరాటం

### వార్డుల్లో సిపిఐ నేత మంద పవన్ ఇంటింటి ప్రచారం



**ప్రజాపక్షం/గజ్వేల్ :** సర్వం కోల్పోయిన మల్లన్న సాగర్ నిర్వాసితులకు అండగా తమ పార్టీ పోరాటం చేస్తుందని సిపిఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్ పేర్కొన్నారు. గురువారం గజ్వేల్ పరిధిలోని 7, 9, 10, 13 వార్డులలో సిపిఐ బలపరిచిన అభ్యర్థులను ఆశీర్వదించాలని కోరుతూ ఇంటింటి ప్రచారంలో కంకి కొడవలు గుర్తుకు ఓటు వేసి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. మల్లన్న సాగర్ ముంపు గ్రామాలలో సమస్యలపైన పోరాడిన సిపిఐ 013 చట్టం ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని ధర్నాలు, రాస్తారోకోలు చేసినట్లు చెప్పారు. ఈ పోరాటంలో అనేకసార్లు పోలీసులతో లాఠీదెబ్బలు తిని జైలుకు వెళ్లామన్నారు. భూనిర్వాసితుల సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బట్టు దయానందరెడ్డి మాట్లాడుతూ బిజెపి ప్రజలకు భూనిర్వాసులకు చేసింది ఏమీ లేదని, బిజెపికి ఓటు వేస్తే అభివృద్ధి శూన్యమని తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండల గణేష్, పట్టణ కార్యదర్శి స్వర్గం రాజేశం, ఇంచార్జి శివలింగ కృష్ణ, నాయకులు మొట్ట శీను కొండ కింది పోచయ్య, గూడూరు యాదమ్మ, పోతుల శంకరయ్య పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి పోరాటాలు

### ప్రచారంలో సిపిఐ అభ్యర్థిని మేకల అశ్విని దాసు

**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :** మంచిర్యాల కార్పొరేషన్ ఎన్నికల్లో నస్పూర్ మండలం శ్రీరాంపూర్ ప్రాంతంలోని 6వ డివిజన్ నుంచి సిపిఐ అభ్యర్థిని మేకల దాసు సతీమణి అశ్విని గెలుపునకు అత్యంత చేరువలో ఉన్నారు. గతంలో కౌన్సిలర్‌గా పనిచేసిన దాసు ఈ ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారంలో అనేక పోరాటాలు చేసి ప్రజల మనిషిగా గుర్తింపు పొందారు. జాతీయ రహదారి విస్తరణలో ఇళ్లు కోల్పోయిన వారి పక్షాన నిలబడి పోరాడటంతో పాటు వారికి నష్టపరిహారం, ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఇళ్లస్థలాలు ఇప్పించడంలో కీలక పాత్ర పోషించారు. ఈ క్రమంలో ఆయనపై కేసులు నమోదైనా వెనకడుగు వేయకుండా ప్రజల పక్షాన నిలిచారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఈ ప్రాంత ప్రజల దశాబ్దాల కల అయిన ఇళ్ల పట్టాలను ఇప్పించడంలో మేకల దాసు సఫలీకృతుడయ్యారు. అంతేకాకుండా స్థానికంగా ఓపెన్ జిమ్ ఏర్పాటు, రోడ్లు, డ్రైనేజీ, వీధిదీపాల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ నిరంతరం ప్రజల్లో మమేకమయ్యారు.





## పెద్దపులి సంచారం పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

**ప్రజాపక్షం/రఘునాథపల్లి:** గత రెండు రోజులుగా పెద్ద పులి జనగామ జిల్లాలోకి ప్రవేశించి సంచరిస్తుండడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతుండడంతో పాటు వారికి కంటి మీద కునుకు లేకుండా పోతుండడంతో ప్రజలు పెద్ద పులి సంచారం పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఫారెస్ట్ రేంజ్ అధికారి కొండల్ రెడ్డి హెచ్చరించారు. ఇదిలా ఉంటే మొన్న రాత్రి కామారెడ్డి శివారులో గల వ్యవసాయంలో ప్రత్యక్షమైన పెద్దపులి నేడు రూటు మార్చుకుని లింగాలఘనపురం మండలంలోని కుందారం గ్రామ శివారులోని వంట పొలాలలో సంచరిస్తున్నట్లు ఫారెస్ట్ అధికారులు పులి పాదముద్రలు గుర్తించారు. వెంటనే రంగంలోకి దిగిన ఫారెస్ట్ అధికారులు పెద్దపులి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. చుట్టు పక్కల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా రాత్రి సమయాలలో వ్యవసాయ పంట పొలాలకు వెళ్లే రైతులు ఒంటరిగా కాకుండా గుంపులుగా కలిసి వెళ్లాలని, గ్రామ శివారులో ఇండ్లలో ఉంటున్న ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని ఫారెస్ట్ అధికారులు సూచించారు. ఓ వైపు గ్రామాలలో కోతుల బెడదతో ప్రజలు అల్లాడిపోతుంటే, మరోవైపు ఈ పెద్దపులి సంచారంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు.

## ఎస్ఆర్ఎస్పీ కెనాల్‌లో యువకులు గల్లంతు



**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** హనుమకొండ ఎస్ఆర్ఎస్పీ కెనాల్‌లో కేయూ పోలీస్ స్టేషన్ పరిధిలోని యాదవ్ నగర్ దగ్గర ఎస్ఆర్ఎస్పీకెనాలులో ఇద్దరు యువకులు యాస్ ముకుల్ (23),ముస్తాన్ (19) గల్లంతయ్యారు. వారి కోసం గత మూడు రోజులు నుండి ఆచూకీ కోసం కేయూ సర్కిల్ ఇన్స్పెక్టర్ రవికుమార్, 30 మంది ఎం డి ఆర్ ఎఫ్ బృందం కెనాల్ నుండి పైడిపల్లి, కెనాల్ పొడువునా మైలారం రిజర్వాయర్ వరకు వెతుకుతున్నారు. గత మూడు రోజుల నుండి వారి ఆసక్తి కోసం తీవ్రంగా పోలీసులు, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు శ్రమిస్తూ వెతుకుతున్నారు. సిఐ కుమార్ తెలిపిన విధంగా యువకుల ఆచూకీ దొరికే వరకు మూడు రోజుల నుండి కెయు ఎస్ఐ విజయ్ కుమార్, నవీన్, రెండు బృందాలుగా ఏర్పడి దొరికేవరకు వారిని వెతుకుతామని తెలిపారు.

## జనగామ జిల్లాగా ఉండాలంటే బిఆర్ఎస్‌ను గెలిపించాలి: పల్లా

**ప్రజాపక్షం/జనగామ:** జనగామ జిల్లా స్థిరంగా ఉండాలంటే మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థులను కౌన్సిలర్లుగా గెలిపించాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రజల్ని కోరారు. గురువారం జనగామ పట్టణంలోని 13,16,17,18,22,23 వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు చోట్ల ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో సంక్షేమ పథకాలు అటకెక్కాయని మండిపడ్డారు. జనగామ మున్సిపాల్టీ కూడా కుంటుపడిన పరిస్థితి ఉందన్నారు. బిఆర్ఎస్ పాలనలో హామీలు అన్నీ నెరవేర్చామని, కేసీఆర్ అందరికి పెద్దన్నగా అభివృద్ధి పథకాలు అందించారన్నారు. రేవంత్‌రెడ్డికి తిట్లడం తప్ప మరేమీ రావడం లేదన్నారు. తన వ్యక్తిగతంగా కూడా జనగామ నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నానన్నారు. తన నీలిమా హాస్పటల్‌లో ఉచిత వైద్యం అందించడం జరుగుతుందని, కళాశాలలో జనగామ బిడ్డలకు రాయితీ ఇస్తున్నామన్నారు. కాంగ్రెస్ నాయకులు బెదిరింపు రాజకీయాలు చేస్తున్నారని, వారి బెదిరింపులకు బయపడేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు గద్దల నర్సింగరావు, బాల్నె సిద్ధిలింగం, పెద్ది రాజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బండ పద్మ, సువార్త, మల్లిగారి రాజు, ఉడుగుల కిష్టయ్య, రాంప్రసాద్, బండ పద్మ, యాదగిరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సాగు నీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

**ప్రజాపక్షం/నల్లబెల్లి:** రాష్ట్రంలో రైతులకు సాగు నీరు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. గురువారం వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలోని ముచింపుల గ్రామ సమీపంలో రంగాయ్యచెరువు ప్రాజెక్టు కుడి కాల్వకు గోదావరి దేవాదుల ప్రాజెక్టు ఎత్తిపోతల పథకంలో సాగు నీరును ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి విడుదల చేసి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ రబీ సీజన్‌లో పంటలకు సరిపడా సాగు నీరు అందించేలా అధికారులతో మాట్లాడినట్లు తెలిపారు. ఐదు వేల ఎకరాలకు సాగు నీటిని అందించడమే లక్ష్యంగా అధికారులను అప్రమత్తం చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యులు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి ,ఇరిగేషన్ డీఈ ఇంజినీర్ కుమారస్వామి ,ఎసీఈ స్వామి ,నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్ ,ఇఇ నారాయణ ,సుదర్శన్ ,డి ఇ యశ్వంత్ ,కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు చిట్యాల తిరుపతిరెడ్డి ,పార్టీ నాయకులు అజ్మీర తిరుపతి ,మునిందర్ ,బత్తిని మహేష్ పాల్గొన్నారు .

## వట్టేవాగు వనదేవతల దర్శనానికి తరలివచ్చిన భక్తులు



**ప్రజాపక్షం/గూడూరు:** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం వట్టే వాగు జాతరకు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వనదేవతలను దర్శించుకున్నారు.చింతలగట్టు వట్టేవాగు జాతర తిరుగువారం పండుగ అయిపోయిన తర్వాత కూడా భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.365 జాతీయ రహదారి పక్కన ఉన్న వనదేవతల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.వనదేవతలు వన ప్రాంతంలో ఉన్నప్పటికీ భక్తుల దర్శనాలు మరో 20 రోజులు కొనసాగుతాయి.

## చెక్ పోస్టులను తనిఖీ చేసిన డిసిపి అంకిత్ కుమార్



**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** పరకాల మున్సిపాలిటీ ఎన్నికలను పురస్కరించుకొని పరకాల పట్టణ మున్సిపల్ సరిహద్దుల్లో నాలుగు స్టాటిక్ సర్వైలెన్స్ టీంలతో ఏర్పాటు చేసిన హన్మకొండ, హుజూరాబాద్,చలివాగు బ్రిడ్జి వెల్లంపల్లి మార్గాల్లో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్ పోస్టులను ఈస్ట్ జోన్ డిసిపిఅంకిత్ కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్న తీరుపై డిసిపి చెక్ పోస్ట్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. తనిఖీ కేంద్రాల్లో నమోదు చేసిన వివరాలను పరిశీలించారు. డిసిపివెంట పరకాల ఎసిపి సతీష్ బాబు, ఇన్స్పెక్టర్ క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

# హోరెత్తుతున్న మున్సిపల్ ప్రచారం

8న భూపాలపల్లిలో ప్రచారానికి సిఎం రేవంత్ రెడ్డి
*పార్టీల అగ్ర నేతల ప్రచారంతో వేడెక్కిన రాజకీయం

**ప్రజాపక్షం/హనుమకొండ:** మున్సిపల్ ఎన్నికల ప్రచారం హోరెత్తుతున్నది. ఎన్నికల ప్రచారానికి ఆయా పార్టీల అగ్ర నేతలు తరలి వస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 12 మున్సిపాలిటీల ఎన్నికల నేపథ్యంలో రాజకీయ వాతావరణం ఒక్క సారిగా వేడెక్కింది. నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ మంగళవారం ముగియగా.. 260 వార్డు లకు 1,073 మంది బరిలో ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ సిపిఐ, సిపిఎంతో పొత్తులతో సాగుతుండగా, బిఆర్ఎస్, బిజెపిఒంటరిగా పోటీ చేస్తున్నాయి. ప్రచారానికి మరో నాలుగు రోజులే సమయం ఉండ దంతో రాజకీయ పార్టీలు దూకుడు పెంచాయి.మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌కు ఇంకా ఐదు రోజులే ఉండడంతో రెబల్స్ ను దారికి తెచ్చుకునేందుకు కాంగ్రెస్, బిఆర్ఎస్ నేతలు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. కాంగ్రెస్ పార్టీ సిపిఐ, సిపిఎంతో పొత్తులతో పోటీ చేస్తుండగా.. 40 చోట్ల రెబల్స్ బెడద ఉంది. ఒంటరి పోరు చేస్తున్న బిఆర్ఎస్ కు సైతం రెబల్స్ సెగ తాకుతోంది. నర్సంపేట, వర్ధన్నపేటలో ఎనిమిది చోట్ల బిఆర్ఎస్, కాంగ్రెస్ రెబల్స్




ఉన్నారు. మహబూబాబాద్ మున్సిపాలిటీలో కాం గ్రెస్ పార్టీ నుంచి 12 మంది, బిఆర్ఎస్ నుంచి 6 ఆరుగురు రెబల్ అభ్యర్థులుగా పోటీలో ఉండగా, వారితో పార్టీ నేతలు మంతనాలు చేస్తున్నారు. డోర్నకల్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ నుంచి నలుగురు, మరిపెడలో కాంగ్రెస్ నుంచి ఆరుగురు, బిఆర్ఎస్ నుంచి నలుగురు, కేసముద్రంలో కాంగ్రెస్ నుంచి ఒక్కరు, బిఆర్ఎస్ లో ఇద్దరు చొప్పున రెబల్ అభ్యర్థులు పోటీలో ఉన్నారు. వీరందరితో ఆ పార్టీల నేతలు చేస్తున్న ప్రయత్నాలు నేడో రేపో కొలిక్కి రావొచ్చన్న ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కాగా, 12 మున్సిపాలిటీల్లో మొత్తం 260 వార్డులకు ఒక చోట బిజెపి అభ్యర్థి నామినేషన్ తిరస్కరణకు గురికాగా 26 చోట్ల ఆపార్టీ అభ్యర్థులు పోటీలో లేరు.అన్ని మున్సిపాలిటీల్లో ప్రధాన పార్టీల అభ్యర్థుల తోపాటు సిపిఐ, సిపిఎం, బిఎస్‌సి, ఎఐఎఫ్‌బితదితర పార్టీలు, స్వతంత్రులు కూడా ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. ఇదే సమయంలో పుర పీఠాలు లక్ష్యంగా కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి.. ఆ పార్టీల అభ్యర్థుల తరఫున ప్రచారం చేసేందుకు అగ్రనేత లను రంగంలోకి దింపుతున్నాయి. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ పార్ల మెంట్ ఇన్‌చార్జ్ లుగా మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి (వరంగల్), పొన్నం ప్రభాకర్ (మహ బూబాబాద్)ను నియమించింది. వారు జిల్లా మం త్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ముఖ్యనేత లను కలుపుకుని సమన్వయం చేస్తున్నారు. ఎఐసిసి పరిశీలకుడు పి.విశ్వనాథన్ ఉమ్మడి జిల్లాలో బుధ వారం పర్యటించగా.. ఈ నెల 8న సిఎం రేవంత్ రెడ్డి జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలో ఏర్పాటు చేసే సభల్లో పాల్గొని ప్రసంగించనున్నారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ 12 మున్సిపాలిటీలకు ఇన్‌చార్జ్‌లను నియమించారు. మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకరరావు, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ భాస్కర్, అరూరి రమేశ్ అభ్యర్థుల కోసం ప్రచారం నిర్వహిస్తూండగా కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ జిల్లాకు రానున్నారు.బిజెపి నుంచి అభ్యర్థుల గెలుపు కోసం అధ్యక్షులను సమన్వయం చేస్తున్నారని, త్వరలోనే వారి పర్యటన ఉంటుందని చెబుతున్నారు.

## కార్మిక సమ్మెను సక్సెస్ చేయండి

ఎఐటియుసి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ పిలుపు

**ప్రజాపక్షం/ వరంగల్ :** అఖిల భారత కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఫిబ్రవరి 12న జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఎఐటియుసి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ పిలుపునిచ్చారు. వరంగల్ శివనగర్ లోని తమ్మెర భవన్‌లో కార్మిక సమ్మెను విజయవంతం చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడారు నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్ లోకి మార్చి చట్టాలను నిర్వీర్యం చేయడానికి వ్యతిరేకిస్తూ దేశంలోని అఖిలభారత కార్మిక సంఘాలు అన్ని కలిసి ఐక్యంగా ఈ సమ్మెకు పిలుపునివ్వడం జరిగిందన్నారు. వ్యవసాయ నల్ల చట్టాలను తెచ్చి వ్యవసాయ రైతులు తీవ్రంగా దెబ్బతీసిన మోదీ ప్రభుత్వం విద్యుత్తు నూతన చట్టాలతో వినియోగదారులపై ప్రజలపై తీవ్రమైన భారాలు మోపడాని కార్మిక సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ఆయన తెలిపారు. దేశంలో రోజురోజుకు నిరుద్యోగం పెరిగిపోతున్న అరికట్టడానికి కేంద్ర ప్రభుత్వం ఎలాంటి




చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. దేశంలో కార్పొరేటు పెట్టుబడిదారుల దోపిడీ అధికమైందన్నారు. యావత్ కార్మిక వర్గము ఫిబ్రవరి 12న జరిగే సమ్మెలో కార్మికులు రైతులు వ్యవసాయ కార్మికులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని గన్నార రమేష్ పిలుపునిచ్చారు.ఈకార్యక్రమంలో జిల్లా ఆఫీస్ బేరర్స్ సంఘీ ఏలేందర్, ఉప్పుల రవి, తాళ్లపల్లి జాన్ పాల్, బొట్ల శ్రీనివాస్, జిల్లా నాయకులు ఏం శంకర్, బస్కర్ల సతీష్, మధుసూదనా చారి, భవితవ్య, కుమార్, సాయిలు తదితరులు పాల్గొన్నారు

## సమ్మక్క-సారక్క హుండీ లెక్కింపు ప్రారంభం

ప్రారంభించిన రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

**ప్రజాపక్షం/హనుమకొండ :** హనుమకొండ టిటిడి కల్యాణ మండపంలో మేడారం సమ్మక్క– సారక్క వనదేవతల హుండీ లెక్కింపు ప్రక్రియను మంత్రి కొండా సురేఖ అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ మేడారం జాతరకు దేశ విదేశాల నుంచి వచ్చిన భక్తులు సమర్పించిన కానుకలను పూర్తిస్థాయి



భద్రతా చర్యలు, పారదర్శక విధానాలతో లెక్కించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. హుండీ లెక్కింపు ప్రక్రియ మొత్తం సీసీ కెమెరాల పర్యవేక్షణలో, సంబంధిత అధికారుల సమక్షంలో నిబంధనల ప్రకారం నిర్వహించబడుతుందని స్పష్టం చేశారు.భక్తుల విశ్వాసానికి ఎలాంటి లోటు లేకుండా, ప్రతి రూపాయి జాగ్రత్తగా లెక్కించి, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం వినియోగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి కొండా సురేఖ తెలిపారు. మేడారం సమ్మక్క– సారక్క వనదేవతల ఆశీస్సులతో జాతరను విజయవంతంగా నిర్వహించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో దేవాదాణ శాఖ అధికారి ఆర్.సునిత,మేడారం సమ్మక్కసారలమ్మ పూజారులు సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో అభివృద్ధిపై నిర్లక్ష్యం

స్టేషన్ ఘనపూర్‌ప్రచారంలో ఎంపి కడియం కావ్య విమర్శ

**ప్రజాపక్షం/స్టేషన్ ఘన్ పూర్ :** స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రం చాగల్ పరిధిలోని 6,7,8,9 వార్డులలో ఎన్నికల ప్రచారంలో భాగంగా వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య ఇంటింటికి విస్తృత ప్రచారం నిర్వహించారు. ప్రజల గడప గడపకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకుంటూ, ప్రతి కుటుంబాన్ని ఆప్యాయంగా పలకరిస్తూ ప్రచారాన్ని ఉత్సాహంగా కొనసాగించారు.ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ స్టేషన్ ఘనపూర్‌కు మున్సిపాలిటీ రావడంతో అభివృద్ధి మహర్దశ ప్రారంభమైందని, దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందని వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య అన్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఎన్నికైన తరువాతనే స్టేషన్ ఘనపూర్‌కు మున్సిపాలిటీ సాధ్యమైందని గుర్తు చేశారు. మున్సిపాలిటీ ఏర్పడిన వెంటనే 50 కోట్ల నిధులు తీసుకొచ్చి అభివృద్ధి పనులు ప్రారంభించారని తెలిపారు. గత పదేళ్ల పాలనలో బిఆర్ఎస్ ప్రభుత్వం స్టేషన్ ఘనపూర్ పట్టణ అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. తాగునీరు, డ్రైనేజీ, రహదారులు, విద్యుత్ వంటి మౌలిక వసతుల విషయంలో ప్రజలను మోసం చేసిన ఘనత బిఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని ఆరోపించారు. రైతులు, మహిళలు, కార్మికులు, పేద వర్గాల కోసం సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రజా ప్రభుత్వంగా కాంగ్రెస్ పనిచేస్తోందని అన్నారు. స్టేషన్ ఘనపూర్ అభివృద్ధినే తన ధ్యేయంగా చేసుకుని ఎమ్మెల్యే కడియం శ్రీహరి పనిచేస్తున్నారని, వారి నాయకత్వంలో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. ఇప్పటి వరకు రూ.1400 కోట్ల నిధులు తీసుకొచ్చి స్టేషన్ ఘన్ పూర్ నియోజకవర్గాన్ని



అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు.తాను తన ఎంపీ నిధుల నుంచి స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గానికి రూ.3 కోట్ల 50 లక్షల నిధులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. మున్సిపాలిటీ పరిధిలో మరో 500 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయనున్నట్లు తెలిపారు.కాంగ్రెస్ పార్టీ వార్డు అభ్యర్థులకు స్థానిక సమస్యలపై పూర్తి అవగాహన ఉందని, పేద, మధ్యతరగతి కుటుంబాల నుంచి వచ్చిన అభ్యర్థులని చెప్పారు. ఓటును ఆయుధంగా చేసుకుని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించి, మన అభివృద్ధిని మనమే ముందుకు తీసుకెళ్లాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో 6వ వార్డు అభ్యర్థి కనకం రమేష్, 7వ వార్డు అభ్యర్థి అన్నపు సుమలత, 8వ వార్డు అభ్యర్థి చాతర బోయిన సత్యనారాయణ, 9వ వార్డు అభ్యర్థి సొదరపల్లి సంపత్ రాజ్, మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య శిరీష్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాంబాబు, వార్డు అబ్జర్వర్లు ఇన్‌చార్జిలు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాల కుమారస్వామి జాతరలో మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/ములుగు:** ములుగు మండలం అంకన్నగూడెంలో బాల కుమారస్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న జాతరలో మంత్రి సీతక్క గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ సమ్మక్క సోదరుడుగా బాల కుమారస్వామిని కలుస్తారని, సమ్మక్కకు యుద్ధ సమయంలో అండగా బాలగోముడు నిలిచాడని, గంగ్ర గొడ్డలి రూపంతో కొలుస్తారని, కొడిశాల గుట్ట నుండి బాల కుమారస్వామిని తీసుకొచ్చి జాతర ఘనంగా నిర్వహిస్తారని అన్నారు. అనంతరం బాల కుమారస్వామి దేవాలయ మరమ్మత్తు పనులను ఎస్‌డిఎఫ్ నిధుల నుండి రూ.5లక్షల అంచనా వ్యయంతో మంత్రి సీతక్క ప్రారంభించారు.

## అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం



**ప్రజాపక్షం/జనగామ:** అభివృద్ధి సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యమని పాల్వంచ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, జనగామ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇంఛార్జ్ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి అన్నారు. గురువారం జనగామ పట్టణంలోని 6,8,9,10 వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూప్రజా పాలనవచ్చిన తరువాత అనేక సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయన్నారు. రెండు లక్షల వరకు రుణమాఫీ చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ ఒక్కటేనన్నారు. ఎక్కడి నుండో వచ్చిన దొంగ ఓట్ల ఎమ్మెల్యే జనగామను పూర్తగా కలుషితం చేశారని, దొంగ ఓట్లతో ఎమ్మెల్యే అయి జనగామ ప్రశాంతతను దెబ్బ తీస్తున్నారు. మున్సిపాల్టీపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, కొమురవెల్లి దేవస్థానం ఛైర్మన్ గంగం నర్సింహ్మారెడ్డి, వేమళ్ల సత్యనారాయణరెడ్డి, కాగితాపురం మహేందర్‌రెడ్డి, వంగాల మల్లారెడ్డి, వంగాల కళ్యాణి, బడికె ఇందిర, వార్డు అభ్యర్థులు పాల్గొన్నారు.

## భూపాలపల్లి గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరాలి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో 30 వార్డులలో 30 వార్డులు గెలుచుకొని, భూపాలపల్లి గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ధీమా వ్యక్తం చేశారు.మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 9, 10 వార్డులు మహబూబ్ పల్లి , కుందురుపల్లి, పుల్లూరిరామయ్యపల్లిలోసిపిఐ ,సిపిఐ (యం) పార్టీలు బలపరిచిన కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులు అప్పం కిషన్, పుల్లూరి మంజూల మాధవ రావు ల గెలుపు కొరకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బట్టు కరుణాకర్, రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్, సిపిఐ(యం) జిల్లా కార్యదర్శి బందు సాయిలు, ముఖ్య నాయకులు ఆయా వార్డుల ఎన్నికల ఇన్‌చార్జీ లతో కలిసి ఎన్నికల ప్రచారంను నిర్వహించారు. ఈ సందర్భంగా పుల్లూరిరామయ్యపల్లి హనుమాన్ టెంపుల్ సెంటర్ లో నిర్వహించిన పబ్లిక్ కార్నర్ మీటింగ్ లలో ఎమ్మెల్యే మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్



రెడ్డి సహకారముతో భూపాలపల్లి మున్సిపాలిటీలో మౌలిక వసతుల కల్పన కోసం రూ.63 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడం జరిగిందని, భూపాలపల్లి పట్టణాన్ని రాష్ట్రంలోనే అత్యధిక నిధులు తెచ్చి ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతానని అన్నారు. భూపాలపల్లి అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ అధికార పార్టీ వాళ్ళనే సాధ్యమని, కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం ఉమ్మడి అభ్యర్థులు బలపరిచిన 30 వార్డులలో అధిక మెజారిటీతో గెలిపించి భూపాలపల్లి అభివృద్ధికి సహకరించాలని, ఈ నెల 11న జరిగే మున్సిపల్ ఎన్నికల్లో హస్తం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమానికి పెద్ద పీట

**ప్రజాపక్షం/వేలేరు :** నియోజకవర్గంలో ఎలాంటి అవినీతి, అక్రమాలు లేకుండా ప్రజలకు సుపరిపాలన అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు.వేలేరు మండల కేంద్రంలోని రైతు వేదికలో,ధర్మసాగర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన కల్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ చెక్కుల పంపిణి కార్యక్రమానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వేలేరు మండలానికి సంబంధించిన 26మంది కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు 26లక్షల 03వేల 016రూపాయల విలువగల చెక్కులను, ధర్మసాగర్ మండలానికి సంబంధించిన 69మంది కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు 69లక్షల 08వేల 004రూపాయల విలువగల చెక్కులను అలాగే కాజీపేట మండలం రాంపూర్ గ్రామానికి చెందిన 6గురు కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు 06లక్షల 696రూపాయల విలువగల చెక్కులను ఎమ్మెల్యే కడియం శ్రీహరి పంపిణి చేశారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లు అవినీతి, అక్రమాలకు దూరంగా ఉంటూ గ్రామ అభివృద్ధి, గ్రామ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. గ్రామాల అభివృద్ధికి నా వంతు పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. పేదింటి ఆడపిల్లల తల్లిదండ్రులకు కళ్యాణ లక్ష్మి పథకం కొంత ఆర్థిక వెసులుబాటును కల్పిస్తున్నదని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదని అన్నారు. ఇంట్లో ఆడపిల్ల పెళ్లి చేయాలి అంటే తల్లిదండ్రులు చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, కానీ ఇవాళ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ఒక లక్ష 116 రూపాయలు ఎంతో భరోసా ఇస్తుందని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఈ రెండు సంవత్సరాల కాలంలో రైతు సంక్షేమపైన, మహిళా సంక్షేమం పైన ప్రత్యేకించి పేద వర్గాల సంక్షేమం పైన దృష్టి పెట్టి కొత్తగా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టడం జరిగిందని అన్నారు. వాస్తవంగా




రాష్ట్ర ప్రభుత్వం పైన అప్పుల భారం ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి పేద వర్గాల సంక్షేమనికి, సంక్షేమ పథకాల అమలుకు పెద్ద పీట వేస్తున్నారని తెలిపారు. గత 15ఏళ్ళు ఎమ్మెల్యేగా ఉన్న వ్యక్తి ఎం చేశాడో మనందరికి తెలుసని తెలిపారు. ఇక మన నియోజకవర్గానికి గొప్ప చరిత్ర ఉందని పనులు, పథకాలు, పదవులు అమ్ముకున్నారని ఆరోపించారు. ఆ చెడ్డ పేరును తొలగించి అవినీతి రహితమైన పాలన అందించేందుకు కృషి చేస్తున్నానని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇల్లు నిర్మాణంలో గాని, కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల విషయంలో గాని సిఎంఆర్‌ఎఫ్ విషయంలో గానీ ప్రభుత్వ పథకాల విషయంలో గాని ఎవరు కూడా ఒక్క రూపాయి వేరే వారికి ఇవ్వవలసిన అవసరం లేదని సూచించారు. మీకు రావలసిన ప్రభుత్వ పథకాలు మీ ఇంటికే వస్తాయి, మీ దగ్గరికి వస్తాయని తెలిపారు. అవినీతి అక్రమాలను తగ్గించి సుపరిపాలన అందిస్తూ ఈ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో వేగంగా ముందుకు తీసుకుపోవాలనే ఆలోచనతోనే ముందుకు వెళ్తున్నామని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధిలో, సంక్షేమ పథకాల అమలులో మీ అందరి సహకారం కావాలని, మీ అందరి భాగస్వామ్యం కూడా కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దా ర్లు, సర్పంచులు, ఇతర ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో నిరసన



**ప్రజాపక్షం/ మధిర :** చేవెళ్ల బార్ అసోసియేషన్‌కు చెందిన యువ నాయ్యవాది స్వప్నను అత్యంత దారుణంగా హత్య చేసిన ఘటనను ఖండిస్తూ మధిర బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నల్లబ్యాడ్జీలను ధరించి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి.పుల్లారావు మాట్లాడుతూ న్యాయ వృత్తిపై, న్యాయ పాలనపై దాడులు జరగటం అమానుషమని, ఈ ఘటన తీవ్రమైన ఆందోళన కలిగిస్తోందని అన్నారు. న్యాయవాదుల భద్రత, గౌరవం, వృత్తి స్వేచ్ఛను కాపాడేందుకు ప్రతిఒక్కరూ ఎలాంటి సంఘటనలను ఖండించాలని, న్యాయవాదులపై జరుగుతున్న దాడులను ఇకపై సహించబోమని, హత్యకు గురైన స్వప్న కుటుంబానికి న్యాయం జరిగేంత వరకు పోరాటం కొనసాగిస్తామని అన్నారు. ఇలాంటి సంఘటనలు పునారవృతం కాకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు వాసంశెట్టి కోటేశ్వరరావు, వాసిరెడ్డి వెంకటేశ్వర రావు, దిరిశాల జగన్మోహన్‌రావు, కట్టా పూర్ణచంద్రరావు, నంబూరు జనార్ధన్‌రావు, కావూరి రమేష్, టి.వెంకట్రావు ఎం.సతీష్, జింకల రమేష్, టి.వెంకట్రావు, రమణ, కోట రమేష్, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

## ఉపాధ్యాయులకు బాసటగా పెన్షనర్లు




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జాతీయ విద్యా రంగంలో సమస్యలు పరిష్కరించాలని ఏఐ జాక్టో ఆధ్వర్యంలో వేలాది మంది ఉపాధ్యాయులు ఢిల్లీ బాట పట్టారు. వారికి బాసటగా ఎస్‌జిపిఏటి ఆధ్వర్యంలో పెన్షనర్లు గురువారం అంబేద్కర్ సెంటర్‌లో సంఘీభావం తెలిపారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ పరీక్షను రద్దు చేయాలని, ఎన్‌ఈపి 2020ను ఉపసంహారించాలని, పాఠశాలల రద్దు లేదా కలపటాన్ని ఆపాలని, ఎంఎల్‌సి ఎన్నికల్లో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు ఓటు హక్కు కల్పించాలని, ఉపాధ్యాయ సంఘాల డిమాండ్లను సత్వరమే పరిష్కరించాలని పెన్షనర్ల సంఘం నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జిపిఏటి ఖమ్మంజిల్లా శాఖ అధ్యక్షులు పరిశ పుల్లయ్య, కార్యదర్శి రాయల రవి కుమార్, సంఘం బాధ్యులు కృష్ణకుమారి, తాడి అంజలి, బెల్లం రాధాకృష్ణ, నాగప్రసాద్, సుధాకర్, హుస్సేన్, నారాయణ, వెంకటనర్సయ్య, వెంకటేశ్వర్లు, అంజన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఇవిఎం గోదాంను తనిఖీ చేసిన కలెక్టర్

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఆర్డిఒ కార్యాలయం ప్రాంగణంలో ఉన్న ఈవిఎం గోదామును జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు భద్రతకు సంబందించి ప్రతీ నెల తనిఖీ చేయడం జరుగుతుందని చెప్పారు. సిసి కెమేరాల పనితీరును పరిశీలించినట్లు చెప్పారు. గోదాము పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, అనుమతి లేనిదే ఎవ్వరినీ లోనికి రానివ్వొద్దని సెక్యూరిటీ గార్డుకు తెలిపారు.అనంతరం తనిఖీ రిజిష్టర్‌లో సంతకం చేశారు. ఈ తనిఖీల వెంట ఎన్నికల సూపరింటెండెంట్ రంగ ప్రసాద్, ఎన్నికల స్బిబంది నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి పట్టివేత



**ప్రజాపక్షం/భద్రాచలం :** అక్రమంగా తరలించుకుపోతున్న 15.07 కేజీల గంజాయిని ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెట్ అధికారులు గురువారం పట్టుకున్నారు. వివరాల ప్రకారం స్థానిక ఆర్‌టిఏ చెక్‌పోస్టు సమీపంలో సాధారణ తనిఖీలు నిర్వహిస్తుండగా టిజి 08 హెచ్‌క్యు 9088 నెంబరు గల కారు వేగంగా వస్తోంది. కారును ఆపి సోదాలు చేయగా అందులో 15.07 కేజీల ఎండు గంజాయి ఉన్నట్లు గుర్తించారు. ఈ గంజాయిని ఒడిస్సా నుండి హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు నిందితులు విచారణలో వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా జీడిమెట్లకు చెందిన రఘు విష్ణోవి, శేఖర్ రామ్ అనే నిందితులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి కారు, రెండు సెల్ ఫోన్లు స్వాదీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించారు.

## మండలాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

కలెక్టర్ జితేష్ వి పాటిల్




**ప్రజాపక్షం/గుండాల :** మండాలాభివృద్ధిలో ప్రజలు, ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని, అప్పుడే మండలం పూర్తి స్తాయిలో అభివృద్ధి దిశగా నడుస్తోందని జిల్లా కలెక్టర్ జితేష్‌వి పాటిల్ అన్నారు. యాస్పిరేషన్ బ్లాక్‌లో బాగంగా గురువారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రినందు సంపూర్ణ అభియాన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో విధిగా హెల్త్ క్యాంపులను నిర్వహించి వ్యాధినిర్ధారణ కొరకు రక్త నమూనాలను తీసుకొని క్షయ నివారణ కొరకు ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. సర్పంచులు విధిగా అంగన్‌వాడి కేంద్రాలను, పాఠశాలలను సందర్శించి అక్కడి వసతులను పరిశీలించాలని , అంగన్‌వాడి కేంద్రాలలో పిల్లలకు అందించే పౌష్టి కాహారం సక్రమంగా అందుతుందా లేదా అని చూడాలని అన్నారు. అలాగే గ్రామాల్లో పశువులకు రోగనిరోదక టీకాలను వేయాలని పశువైద్యాధికారులకు సూచించారు. చదువుకొని ఉపాధిలేక ఖాళీగా ఉన్న నిరుద్యోగ యువతకు వేతనంతో కూడిన ఉచిత శిక్షణ ఇప్పించి ఉద్యోగ అవకాశం కల్పిస్తామని మండలంలోని నిరుద్యోగులు అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలని సూచించారు. ఆస్పత్రిలో ఏర్పాటు చేసి స్టాల్స్‌ను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిఇఒ నాగలక్ష్మి, డిఎంఅండ్‌హెచ్‌ఒ తుకారం, సిపిఒ సంజీవరావు, జిల్లా సంక్షేమాదికారిస్వర్ణకుమారిలెనీన, జిల్లా పశువైద్యాదికారి వెంకటేశ్వరావు, సిడిపిఒ మంగతాయారు, తహసీల్దారు ఖాసీం, ఎంపిడిఒ బాలరాజు, వైద్యాదికారి మనీష్‌రెడ్డి, సుదీప్, సర్పంచులు, అంన్‌వాడి టీచర్లు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు దూరమవుతున్న సాంప్రదాయ ఓటు!

పెరిగిన వలస పెత్తనం



**ప్రజాపక్షం/ ఖమ్మం :** తరతరాలుగా కాంగ్రెస్ పార్టీకి అంకితమై పనిచేస్తున్న కుటుంబాలు అనేకం పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా పార్టీ జెండా కిందనే పనిచేసే వారు. అవకాశవాద రాజకీయాలకు తావివ్వకుండా పార్టీ నిర్ణయాన్ని శిరోధార్యంగా భావించే వారు. అటువంటి ఖచ్చితమైన సాంప్రదాయ ఓటు ఇప్పుడు కాంగ్రెస్‌కు దూరమవుతుంది. అవకాశ వాద వలస రాజకీయాలలో సనాతన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇమడలేకపోతున్నారు. హనుమంతుని ముందు కుప్పిగంతులు వేసినట్లు అనేక అనేక సంఘటనలను చూసి ఎదుర్కొని పార్టీని నిలబెట్టే వారి ముందు వలస నేతలు పార్టీ గురించి, పార్టీ నిర్ణయాల గురించి చెబుతుంటే విస్తుపోతున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్‌లో ఇమడలేక మరో పార్టీ మారలేక క్రమేపి క్రియాశీలక రాజకీయాలకు దూరమవుతున్నారు. 20 సంవత్సరాల కాలంలో మూడు పార్టీలు మారి ఇటీవల కాంగ్రెస్‌లో చేరి కౌన్సిలర్‌గా పోటీ చేసేందుకు కాంగ్రెస్ బీఫాం పొంది ఆ వార్డులో కాంగ్రెస్ పుట్టుక, ఎదుగుదల, బలోపేతానికి నేనే కారణం కర్త, కర్మ, క్రియ అన్ని నేనే అని చెబుతుంటే ఆ వార్డులో కేసులను, అధికార పార్టీ ఒత్తిళ్లను అధిగమించి పార్టీని నిలబెట్టిన వారు అవాక్కు అవుతున్నారు. కాంగ్రెస్‌లో ఉన్నందుకు ఇబ్బంది పెట్టినవారే ఇప్పుడు కాంగ్రెస్‌లో చేరి వీరంగం చేస్తుంటే గతంలో పడిన ఇబ్బందులను తలచుకుని ఆవేదన చెందుతున్నారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా వాళ్లదే పెత్తనం అయితే మన కెందుకు రాజకీయాలు అనే భావన సాంప్రదాయ కాంగ్రెస్ వా దుల్లో బలపడుతుంది. అధికారంలో లేనప్పుడు, ఏ ప దవి రానప్పుడు ఇండ్లకు వచ్చి కూర్చున్న నేతలు కనీసం కన్నెత్తి చూడటం లేదన్న ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**వలసలు తెచ్చిన మార్పు :**
రాజకీయాల్లో అవకాశవాదులు ఏ ఎండకు ఆ గొడుగు పట్టే వారు ఎక్కవయ్యారు. వివిధ మార్గాలలో డబ్బులు సంపాదించి రాజకీయాల్లోకి వచ్చిన వారు అధికారమే పరమావధిగా భావిస్తున్నారు. ఏ పార్టీ అధికారంలో ఉంటుందో ఏ పార్టీకి జై కొడుతున్నారు, ఏ అధికార ప్రతినిధులుగా ఉన్నారో వారి వెనక చేరి తమ అవసరాలను నెరవేర్చుకునేందుకు మొత్తం వ్యవస్థలను తప్పుదారి పట్టిస్తున్నారు. అధికారం రాగానే బెల్లం చుట్టూ ఈగల్లా ముసురుకుంటూ మరొకరికి అవకాశం ఇవ్వడం లేదు. ఇది అప్పటి బిఆర్‌ఎస్‌లో పనిచేసిన వారిని ఇప్పుడు అనేక దశాబ్దాల పాటు కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసిన వారు అధికార యావ తప్ప మరొకటి లేని వారితో ఇబ్బంది పడుతున్నారు. అక్రమాలను సక్రమం చేసుకునేందుకు అధికార పార్టీలో చేరడం జరుగుతుందన్న ఆరోపణలు వినవస్తున్నాయి. పదేళ్ల బిఆర్‌ఎస్ పాలనలో అధికారానికి ఆ పార్టీ ప్రజాప్రతినిధులకు ఎవరు దగ్గరగా ఉన్నారో రెండేళ్ల కాంగ్రెస్ పాలనలోనూ వారే ఇప్పుడు అధికార పీఠానికి దగ్గరగా ఉన్నారు. జెండాలు మోసిన వారు ఎప్పటిలా కార్యకర్తల్లాగానే మిగిలిపోయారు.

**శృతిమించుతున్న పెత్తనం :**
అధికార కాంగ్రెస్‌లో అసలు కంటే కొసరు పెత్తనం ఎక్కువైంది. అధికారాన్ని చెలామణి చేస్తున్న కొందరు తమ పెత్తనాన్ని కాపాడుకునేందుకు మరొకరిని దరి చేరనివ్వడం లేదు. ప్రజాప్రతినిధుల చుట్టూ చేరి అసలైన క్యాడర్‌ను, పార్టీని నమ్ముకుని ఉండేవారిని దూరం చేస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా వలస నేతల శృతిమించిన పెత్తనం కారణంగా కాంగ్రెస్‌కు నష్టం జరిగే అవకాశం ఉంది. అధికారాన్ని గుంజుకోవాలని, వాడుకోవాలని, అనుభవించాలని చూసే వారు అడ్డదారులు తొక్కుతున్నారు. రూపాయి ఖర్చు పెట్టి పది రూపాయలు గుంజే ఆలోచనల్లో ఉన్న వారితో ఏ పార్టీకైనా ప్రమాదమే. దశాబ్ద కాలంలో పలు నియోజక వర్గాల్లో నేతలు ఇటువంటి వారితో నష్టపోయినా కాంగ్రెస్ నాయకుల్లో మార్పు రాకపోవడం శోచనీయం.

# ప్రచారంలో దూసుకుపోతున్న నామా కీర్తి

35వ డివిజన్‌లో విస్తృత ప్రచారం
పనిచేసే పార్టీలకే పట్టం కట్టాలి
రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు
ముత్యాల విశ్వనాధం



**ప్రజాపక్షం/పాల్వంచ :** నిత్యం ప్రజా క్షేత్రంలో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడే పార్టీలను ఎన్నికలలో గెలిపించి పట్టం కట్టాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాధం కోరారు. 35వ డివిజన్ నుండి పోటీ చేస్తున్న తెలుగుదేశం, సిపిఐ మిత్ర పక్షాల అభ్యర్థి నామా కీర్తి విజయాన్ని కాంక్షిస్తూ గురువారం జోరుగా ప్రచారం నిర్వహించారు. మొదటగా సీతారామపట్నం నుండి భారీ ర్యాలీ నిర్వహించా రు. సీతారామపట్నం, రామాలయం మీదుగా ప్రి యదర్శిని కాలని, జ్యోతినగర్ వరకు సాగింది. ర్యాలీకి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. సీతారామపట్నం శాఖ కార్యదర్శి తం తెనపల్లి వెంకన్నగౌడ్, తెలుగుదేశం నాయకులు మేదరమెట్ల నారాయణలు ముందున్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ఓట్లను అభ్యర్థించా రు. డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్నటువంటి పలు సమస్యల పరిష్కారానికి పాటుపడతానని అభ్యర్థి నామా కీర్తి అన్నారు. ఎలాంటి అవినీతికి ఆస్కారం లేని విధంగా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నడుచుకొంటానని అన్నారు.

**సిపిఐ అభ్యర్థికి ఓటేసి గెలిపించాలి:**
సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సబ్యులు ముత్యాల విశ్వనాధం మాట్లాడు తూ ... గత పాలకులు తమ స్వార్థంతో పాల్వంచకు ఎన్నికలు తీసుకురాలేదని ఆరోపించారు. దీనితో అభివృద్ధికుంటుపడిందని అన్నారు. దీనికి పరిష్కారం చూపుతూ ఎంఎల్‌ఎ కూనంనేని పాల్వంచకు ఎన్నికలు తీసుకొచ్చారని చెప్పారు. ఆయనకు మద్దతుగా ఓటర్లు సిపిఐ, తెలుగుదేశం మిత్రపక్షాల అభ్యర్థులను గెలిపించాలని కోరారు. విద్యావంతురాలు, సమస్యలను పసిగట్టి పరిష్కారం కోసం పాటుపడే నామా కీర్తిని గెలిపించి డివిజన్ అభివృద్ధికి బాటలు వేసుకోవాలని కో రారు. ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు సహకారంతో సమస్యలను పరిష్కరించే విధంగా పాటుపడతామని స్పష్టం చేశారు. పాల్వంచ పట్టణానికి ఇప్పటికే కోట్ల నిధులు మంజూరు చేసి అభివృద్దిని పరుగులు పెట్టిస్తున్నారని, కార్పొరేషన్ స్థాయికి తగ్గట్టుగా పరిశ్రమల స్థాపనకు ఎంఎల్‌ఎ కూనంనేని తీవ్రంగా శ్రమిస్తున్నారని తెలిపారు. దేశంలో అత్యున్నత విశ్వవిద్యాలయం ఎర్త్ యూనివర్సిటి, మరో 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన విద్యుత్ కేంద్రం, కోట్ల నిధులతో బైపాస్ రహదారులు తీసుకొచ్చారని తెలిపారు. అవినీతికి తావులేని, నీతివంతమైన పాలన అందిస్తున్న కూనంనేని సాంబశివరావుని బలపరుస్తూ కంకికొడవలి గుర్తుపై ఓట్లేసి నామా కీర్తిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు వైఎస్.గిరి, టిడిపి సీనియర్ నాయకులు చావా సత్యనారాయణ, నాయకులు, నిమ్మగడ్డ రమణ, కేవి. రావు, మండెపుడి హనుమంత రావు, చేకూరి నాగేశ్వరరావు, కార్యకర్తలు కల్లోజి సుమంత్, సాయిగౌడ్, పవన్, అల్లి శశి కుమార్, నామా ప్రసాద్, గుర్రం వెంటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## భావితరాలను దృష్టిలో పెట్టుకుని మధిర అభివృద్ధి

మాజీ ఎంఎల్‌ఎ కొండబాల కోటేశ్వరరావు



**ప్రజాపక్షం/ మధిర :** భావితరాలను దృష్టిలో పెట్టుకుని మధిర పట్టణాన్ని, నియోజక వర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క కృషి చేస్తున్నారని మున్సిపల్ ఎన్నికల ఇన్‌చార్జి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, టిడిపి రాష్ట్ర నాయకులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం తెలిపారు. గురువారం మధిరలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మధిర చరిత్రను ఈ ప్రాంత విశిష్టతను భావితరాలకు అందించడంతో పాటు ఈ ప్రాంత అభివృద్ధికి తొలిసారి 2009లో శాసనసభ్యులుగా ఎన్నికైన ప్రస్తుత డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క అభివృద్ధి కోసం పాటుపడుతున్నారని అన్నారు. మేజర్ గ్రామ పంచాయతీగా ఉన్న మధిరను పట్టణీకరణ దిశగా అడుగులు వేయించేందుకు నగర పంచాయతీగా మార్పు చేసి ప్రత్యేక నిధులు కేటాయించడం జరిగిందని అన్నారు. మధిర అభివృద్ధే లక్ష్యంగా సుదీర్ఘమైన ప్రణాళిక కలిగిన భట్టి విక్రమార్క డిప్యూటీ సిఎం బాధ్యతలు స్వీకరించిన తర్వాత మధిరలో అభివృద్ధి పనులకు సంబంధించి ఇప్పటికే సుమారు రూ.600 కోట్ల నిధులతో భూమి పూజలు చేయడం జరిగిందని అన్నారు. ప్రస్తుతం జరుగుతున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తెలుగుదేశం పార్టీ కలిసి పోటీ చేస్తున్నాయని, ఈ కూటమి అభ్యర్థులను గెలిపించడం ద్వారా ప్రజలు మధిర అభివృద్ధికి మద్దతుగా నిలవాలని వారు కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు మిర్యాల రమణగుప్తా, సూరంశెట్టి కిషోర్, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బొర్రా ఉమ గెలుపు.. ప్రజా సంక్షేమానికి మలుపు



**ప్రజాపక్షం/వైరా :** బొర్రా ఉమమ్మ గెలుపు మున్సిపాలిటీ అభివృద్ధికి మలుపు అని మూడో వార్డు ప్రజలు ముక్త కంఠంతో చెబుతున్నారు. స్వర్గీయ బొర్రా వెంకటేశ్వర రావు కోడలు బొర్రా ఉమాదేవి కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థిగా మూడో వార్డులో పోట ఈచేశారు. ప్రచార పర్వంలో పర్యటిస్తున్న బొర్రా ఉమాదేవికి స్వచ్ఛందంగా ప్రజల నుంచి పెద్ద ఎత్తున మద్దతు లభిస్తూ ఉంది. మాజీ జెడ్పిటిసి విధులు నిర్వహించిన బొర్రా ఉమాదేవి రాజకీయ కుటుంబంలో ఆణిముత్యం, మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు బొర్రా రాజశేఖర్ వైరా మున్సిపాలిటీలో తిరుగులేని నేతగా ప్రజల అభిమానాన్ని చూరగొన్నారు. ఆయన సతీమణి ఉమాదేవి గెలుపుకు గడపగడపకు పార్టీ శ్రేణులు స్వచ్ఛందంగా ప్రచారం నిర్వహిస్తూ ఉమమ్మ గెలుపుతో మరింత అభివృద్ధి వార్డులో జరుగుతుంది. మున్సిపాలిటీలోనే అభివృద్ధి కోసం పరితపించే కుటుంబం బొర్రా కుటుంబం అని ప్రజలు తెలుపుతున్నారు. ఈ నెల11న జరిగే మున్సిపాల్ ఎన్నికల్లో ఉమాదేవి చేతి గుర్తుపై ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని జోరుగా ప్రచారం కొనసాగిస్తున్నారు. ఉమాదేవి ప్రచారానికి గడపగడపకు స్వాగతం పలుకుతూ హారతి పలుకుతున్నారు. ప్రచార పర్వంలో నుదుట తిలకందిద్ది ఉమ్మమను స్వాగతిస్తున్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో వసతులు మెరుగు పరచాలి

రోగులకు మెరుగైన
వైద్య సేవలను అందించాలి
కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం జనరల్ ఆసుపత్రిలో ప్రజల అవసరాలకు అనుగుణంగా వసతులు మెరుగుపరిచి రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్‌లోని ప్రజ్ఞా సమావేశ మందిరంలో గురువారం ఖమ్మం జనరల్ ఆసుపత్రి పనితీరు, ఆసుపత్రిలో ఉన్న పెండింగ్ అభివృద్ధి పనులపై కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అదనపు కలెక్టర్ పి. శ్రీజ, ఖమ్మం కార్పోరేషన్ కమిషనర్ అభిషేక్ అగ్రస్య లతో కలిసి వైద్యాధికారులు, మున్సిపల్ మిషన్ భగీరథ, సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా ఖమ్మం ఆసుపత్రిలో వసతులు మెరుగుపర్చాల్సిన అవసరం ఉందన్నారు. ఆసుపత్రిలో పారిశుధ్య నిర్వహణ సిబ్బంది, వైద్యులు అందుబాటులో ఉండటం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని ఈ పద్ధతిలో వెంటనే మార్పులు రావాలన్నారు. రెండు వారాలకు ఒకసారి ఆసుపత్రి పనితీరుపై ఖమ్మం కార్పోరేషన్ కమిషనర్ రివ్యూ నిర్వహించాలన్నారు. ఆసుపత్రిలోని 10 స్పెషల్ రూమ్ మరమ్మతు పనులు మున్సిపల్ కార్పోరేషన్ ద్వారా చేపట్టి 15 రోజుల్లో పూర్తి చేయాలన్నారు. ఎమర్జెన్సీ సమయంలో వినియోగించేందుకు జిజిహెచ్ వద్ద ఐదు లక్షల రూపాయలు నిరంతరం అందుబాటులో ఉంచుతామని ఏ విభాగంలోనైనా వైద్య పరికరాలు, యంత్రాలు అవసరం ఉంటే వెంటనే కొనుగోలు చేయాలన్నారు. ఆసుపత్రిలో రూ. 1.65 కోట్లతో చేపట్టిన మరుగుదొడ్లను నెల రోజుల్లో పూర్తి చేసి వాటి నిర్వహణకు కూడా చర్యలు తీసుకోవాలన్నారు. ఆసుపత్రిలో ఆర్ఎంవోలను నియమించి పాలన వ్యవహారాలు వారికి అప్పగించాలని కలెక్టర్ సూచించారు. ఒపి రిజిస్ట్రేషన్ కోసం ప్రత్యేక బ్లాక్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ముగ్గురు డేటా ఎంట్రీ ఆపరేటర్లను తాత్కాలిక ప్రతిపాదికన నియమించాలని తెలిపారు. లిఫ్ట్ మరమ్మతులు పూర్తి కాకపోవడం పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. వారం రోజుల్లో లిఫ్ట్ పనులు పూర్తి చేయాలన్నారు.పారిశుధ్య పనితీరు సరిగ్గా లేదంటూ సంబంధిత ఏజెన్సీలకు నోటీసులు జారీ చేయాలని, పారిశుధ్యం మెరుగు కానీ పక్షంలో ఏజెన్సీని రద్దు చేయాలని డిఎంఈకి లేఖ రాయాలన్నారు. ఆసుపత్రిలో ఎఫ్ఆర్ఎస్ విధానంలో పారిశుధ్య సిబ్బంది హాజరు నమోదయ్యేలా వ్యవస్థ ఏర్పాటు చేయాలన్నారు. దాని ఆధారంగా జీతాలు చెల్లించాలన్నారు. ఈ సమావేశంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నరేందర్, వైద్యశాఖ ఈఈ ఉమామహేశ్వరరావు, మున్సిపల్ సహాయ కమిషనర్ అనిల్‌కుమార్, వివిధ విభాగాల వైద్యాధికారులు, మిషన్ భగీరథ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ముమ్మరంగా సిపిఐ అభ్యర్థుల ప్రచారం

నిరంతర ప్రజా సేవకులను
గెలిపించండి
సిపిఐ నేతలు బాగం హేమంత్‌రావు,
దండి సురేష్ పిలుపు



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ప్రజా సేవకులుగా ప్రజల మధ్యలో ఉండే సిపిఐ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని, సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంత్‌రావు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ఓటర్లకు పిలుపునిచ్చారు. గురవారం ఏదులాపురం మున్సిపాలిటీ ఎన్నికలలో భాగంగా 19, 20, 21, 29, 30, 31, 32 డివిజన్లలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రజెండాల రెపరెపల నడుమ అభ్యర్థులతో కలిసి గడగడపకు వెళ్లి ఆశీర్వదించాలని ఓటర్లను కోరారు. అనంతరం వారు మాట్లాడుతూ...కమ్యూనిస్టులు ఏ రోజు అధికారం కోసం వెంపర్లాడలేదని, కేవలం పేద ప్రజల పక్షానే అండగా నిలిచినట్లు పేర్కొన్నారు. బూర్జువా పార్టీలు అధికారం చేజిక్కించుకొని, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తుంటే అడ్డుకున్నామన్నారు. ఎదిరించేవాడు లేకుంటే బెదిరించే వారిదే రాజ్యం అన్న రీతికి కమ్యూనిస్టులు కళ్లెం వేశారన్నారు. ఇలా అధికారపక్ష ఆగడాలను ప్రశ్నిస్తూ కొరకరాని కొయ్యగా ఎర్రజెండా ప్రజా గొంతుకయ్యిందన్నారు. బ్యాంకులు జాతీయం చేయడంతో పాటు అనేక హక్కులను తీసుకువచ్చిన పాలనను ప్రజలకు చేరువ చేసిన ఘనత కమ్యూనిస్టులకే దక్కుతుందన్నారు. అధికారం లేకున్నా ప్రభుత్వాలను ప్రశ్నించి, అభివృద్ధిలో అగ్రగామిలో ఉంచినట్లు తెలిపారు. అలాగే ప్రభుత్వాల నుంచి రావాల్సిన పథకాలను ప్రజలకు చేరవేయడంలో కమ్యూనిస్టులు కీలకంగా పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. బడుగు, బలహీనవర్గాలు, తాడిత, పీడిత ప్రజల ఆపద్బాంధవులు కమ్యూనిస్టు పార్టీలేనన్నారు. కావున కంకి కొడలి గుర్తుపై ఓటేసి ప్రశ్నించే గొంతుకలను ప్రజలు ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పుచ్చకాయల కమలాకర్, అజ్మీరా రామ్మూర్తి, ప్రజాపక్షం బ్యూరో ఇంచార్జ్ ఏనుగు వెంకటేశ్వరరావు, కార్పొరేటర్ బిజీ క్లైమేట్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు బానోత్ రాంకోటీ, చెరుకుపల్లి భాస్కర్, వెంపటి సురేందర్, ఐఏఎల్ జాతీయ సమితి సభ్యుడు ఓరుగంటి శేషగిరి, సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, మున్సిపాలిటీ నాయకులు, వార్డుల సిపిఐ కార్యదర్శులు, యువజన సంఘం సభ్యులు, మహిళా సమాఖ్య సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కల్లంలోని మిర్చి దొంగతనం

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** కల్లంలో ఆరబోసిన మిర్చిని గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన సంఘటన మండల పరిధిలోని చిమ్మపుడి గ్రామంలో చోటు చేసుకుంది. బాధిత రైతు గంగిరెడ్డి విజయ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం విజయ్‌రెడ్డి కోటపాడు సమీపంలో నాలుగు ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని మిర్చి పంటను సాగు చేస్తున్నాడు. కూలీలతో ఇటీవల మిరపకాయలను ఏరించి కోటపాడు వద్ద గల మామిడితోట సమీపంలో కల్లంలో ఆరబోశాడు. గురువారం ఉదయం విజయ్ రెడ్డి కల్లం వద్దకు వెళ్లి చూడగా ఆరబోసిన మిర్చిలో ఓ పక్కన మిరపకాయలన్ని చెల్లాచెదురై ఉన్నాయి. గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు రైతు విజయ్‌రెడ్డి తెలిపారు. సుమారు మూడు క్వింటాళ్ల మిరపకాయలను దొంగిలించారన్నారు. దుశ్చర్యలకు పాల్పడుతున్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలని రైతు కోరారు.

## జాతీయ రహదారుల్లో ప్రమాద ప్రదేశాల గుర్తింపు ఎలా?: ఖమ్మం ఎంపి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జాతీయ రహదారులు , ఎక్స్‌ప్రెస్‌వేల్లో ప్రమాదాలు అధికంగా జరుగుతున్న నేపథ్యంలో వాటి గుర్తింపు నివారణ చర్యలపై ఖమ్మం ఎంపి రామసహాయం రఘురాంరెడ్డి పార్లమెంట్‌లో గురువారం ప్రశ్నించారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రదేశాలను ఏ ప్రమాణాలతో గుర్తిస్తున్నారని, వాటిపై కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలేమిటని ఆయన ప్రశ్నించారు. దీనికి జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ లిఖిత పూర్వకంగా సమాధానమిచ్చారు. జాతీయ రహదారులు ఎ క్స్‌ప్రెస్‌వేల్లో ప్రమాద ప్రదేశాల గుర్తింపును రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అందే నివేదికల ఆధారంగా చేపడుతున్నట్లు తెలిపారు. మరణాలు, తీవ్ర గాయాలకు దారితీసే నిర్దిష్ట సంఖ్యలో ప్రమాదాలు జరిగిన ప్రాంతాలను ప్రమాద బ్లాక్ స్పాట్‌లుగా గుర్తిస్తున్నామని స్పష్టం చేశారు. సమాచారాన్ని సమగ్రంగా సేకరించి విశ్లేషించేందుకు ఎలక్ట్రానిక్ డిటైల్డ్ యాక్సిడెంట్ రిపోర్ట్ (ఇడిఎఆర్) వ్యవస్థను అమల్లోకి తీసుకు వచ్చినట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు. ఈ వ్యవస్థ ద్వారా దేశ వ్యాప్తంగా ప్రమాదాల డేటాను ఒకే వేదికపై సేకరించి విశ్లేషించడం సాధ్యమవుతుందన్నారు. దీని ఆధారంగా ప్రమాద ప్రదేశాల గుర్తింపు, నివారణ చర్యల అమలు, తీసుకున్న చర్యల పర్యవేక్షణతో పాటు ప్రమాదాలకు సంబంధించిన బీమా క్లెయిమ్‌లను వేగంగా పరిష్కరించేందుకు కూడా ఇది ఉపయోగపడుతుందని కేంద్ర మంత్రి వివరించారు.

12
ప్రజాపక్షం
Telugu National Daily
ఖమ్మం
శుక్రవారం
06-02-2026
www.prajapaksham.in

భూమిక ప్రధాన పాత్రలో సారా అర్జున్, నాజర్, రోహిత్, విఘ్నేశ్ గవిరెడ్డి కీలక పాత్రలు పోషించిన చిత్రం 'యుఫోరియా'. రాగిణి గుణ సమర్పణలో నీలిమ గుణ, యుక్తా గుణ నిర్మాతలుగా సెన్సేషనల్ డైరెక్టర్ గుణ శేఖర్ తెరకెక్కించిన ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 6న విడుదల చేయబోతోన్నారు. ఈ క్రమంలో ప్రీ రిలీజ్ ప్రెస్ మీట్ నిర్వహించారు.

రీల్

# స్వశక్తితో ఎదగాలని కోరుకుంటున్నా..

## డైరెక్టర్ బాబీ కొల్లి



మాస్ మహారాజా రవితేజ సోదరుడి తనయుడు, నటుడు రఘు కుమారుడు మాధవ్ హీరోగా పరిచయమవుతున్న సినిమా. 'మా రెమ్మ. ఈ చిత్రంతో మంచాల నాగరాజు దర్శకుడిగా పరిచయమవుతున్నారు. మయూర్ రెడ్డి బండారు మోక్ష ఆరట్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌కు మంచి రెస్పాన్స్ వచ్చిం ది. తాజాగా టీజర్‌ను లాంచ్ చేశారు. ఒక అంటువ్యాధి గ్రామాన్ని చు ట్టుముట్టి, ప్రజలు, పశువుల ప్రాణాలను బలిగొంటుంది. గ్రామస్తులు తమ గ్రామ దేవత మారెమ్మ తల్లిని ప్రార్థిస్తారు. ఆ దేవతకు సంబంధించిన పవిత్ర ఎద్దును కాపాడే బాధ్యత హీరోది. అయితే ఒక రోజు ఆ ఎద్దు అనూహ్యంగా అదృశ్యమవుతుంది. ఇక్కడినుంచే కథ కీలక మలుపులు తిరుగుతుంది. ఇది మాధవ్‌కు తొలి చిత్రమైనప్పటికీ, అతను ప్రస్తుత ప్రేక్షకుల అభిరుచులకు అ నుగుణంగా ఉండే కథను ఎంచుకున్నాడు. పూర్తిగా రూరల్ లుక్‌లో కనిపించిన మాధవ్, తన ఇంటెన్స్ నటనతో ఆకట్టుకున్నాడు. అతనికి జోడీగా దీపా బా లు నటించగా, గ్రామ పెద్ద పాత్రలో సీనియర్ నటుడు వినోద్ కుమార్ బలమైన ముద్ర వేశారు. తన తొలి ప్రయత్నంలోనే దర్శకుడు మంచర్ల నాగరాజు తెలంగాణలో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా గ్రామీణ నేపథ్యంలో అద్భుతమైన కథను సిద్ధం చేశారు. సినిమాటోగ్రాఫర్ ప్రశాంత్ అంకిరెడ్డి గ్రామీణ వాతావరణాన్ని అద్భుతంగా చూపించారు. సంగీత దర్శకుడు ప్రశాంత్ ఆర్ విహారి పవర్ ఫుల్ నేపథ్య సంగీతంతో ఉత్కంఠను పెంచారు. దేవ్ రాథోడ్ ఎడిటర్, రాజ్‌కుమార్ మురుగేశన్ ఆర్ట్ డైరెక్టర్.మొత్తం మీద ఈ టీజర్ సినిమాపై అంచనాలను భారీగా పెంచింది. 'మారెమ్మ' చిత్రం త్వ రలోనే థియేటర్లలో విడుదల కానుంది.ఈ కార్యక్రమంలో డైరెక్టర్ బాబి కొల్లి మాట్లాడుతూ రవితేజతో జర్నీ చేస్తున్నప్పుడు మాధవ్‌ని చూస్తూ ఉండేవాణ్ణి. రవితేజ ఎలాంటి బ్యాగ్రౌండ్ లేకుండా వచ్చారు. అలాగే మాధవ్ కూడా తన కాళ్ళ మీద తనే నిలబడాలని ఆయన కోరుకుంటున్నారు. ఈ టీజర్‌లో మ్యూజిక్ నాకు చాలా నచ్చింది. హీరో మాధవ్ మాట్లాడుతూ లాస్ట్ ఇయర్ ఇదేటైంకి షూటింగ్ మొదలుపెట్టాం.ఇప్పుడు టీజర్‌తో మీ ముందుకు రావడం చాలా హ్యాపీగా ఉంది. నాగరాజు టీజర్‌ని అద్భుతంగా చూపించారు. ఈ స్క్రిప్ట్ రావడం లక్కీగా ఫీల్ అవుతున్నాను. విజువల్స్ చాలా అద్భుతంగా వచ్చాయి. హీరోయిన్ దీపా మాట్లాడుతూ నేను తమిళ అమ్మాయిని. ఇప్పుడిప్పుడే తెలుగు నేర్చుకుంటున్నాను. ఇది నా ఫస్ట్ తెలుగు సినిమా. నాకు ఈ అవకాశం ఇచ్చిన దర్శక నిర్మాతలకు ధన్యవాదాలు. డైరెక్టర్ నాగరాజు మాట్లాడుతూ ఇందులో ఉండే ప్రతి క్యారెక్టర్ కనెక్ట్ అవుతుంది. కో ప్రొడ్యూసర్ కుశాల్ రెడ్డి మాట్లాడుతూ మేమందరం కొత్తవాళ్లైనప్పటికీ ఒక అద్భుతమైన టీంతో వర్క్ చేశాం.దర్శకుడు నాగరాజుకి అభినందిస్తున్నాను. ఈ సినిమాలో వికాస్ వశిష్ట , వినోద్ కుమార్, వికాస్ వశిష్ట, దయా నంద్ రెడ్డి,రూపా లక్ష్మి తదితరులు నటించారు. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఉమేష్ విలాసాగరం, డిపిఒ ప్రశాంత్ అంకిరెడ్డి, సంగీతం ప్రశాంత్ ఆర్ విహారి,ఎడిటర్ దేవ్ రాథోడ్ఆర్ట్ డైరెక్టర్: రాజ్ కుమార్ మురుగేషన్, యాక్షన్ డైరెక్టర్: నటరాజ్, కొరి యోగ్రాఫర్ సాగ్గీ సాగర్,సాహిత్యం మిట్టపల్లి సురేందర్, కమల్ ఎస్లావత్.

# 'సుమతీ శతకం' విడుదలకు సిద్ధం

## 'ప్రెస్‌మీట్'లో హీరో అమర్‌దీప్ చౌదరి



విజన్ మూవీ మేకర్స్ బ్యానర్‌పై రూపొందిన 'సుమతీ శతకం' విడుదలకు సిద్ధమైంది. సాయి సుధాకర్ కొమ్మాలపాటి నిర్మాణంలో, ఎం.ఎం. నాయుడు దర్శకత్వంలో తెరకెక్కించారు. అమర్‌దీప్‌చౌదరి, శైలి చౌదరి జంటగా నటించిన ఈ చిత్రం ఫిబ్రవరి 6న విడుదల కానుంది. మైత్రి మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని డిస్ట్రిబ్యూట్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో చిత్ర బృందం ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ ప్రెస్ మీట్ లో మాట్లాడుతూ హీరో అమర్‌దీప్ చౌదరి మాట్లాడుతూ 'ఒక సామాన్య స్థాయి నుండి మొదలై ఎన్నో సంవత్సరాలు కష్ట పడి ఈరోజు ఇక్కడ వరకు వచ్చాను. సుమతీ శతకం ద్వారా మీ ముందుకు వచ్చాను. ఒక్క ఛాన్స్, ఒకే ఒక్క ఛాన్స్ ఇచ్చి చూడండి. నన్ను నేను నిరూపించుకుంటాను. నాకు ఈ సినిమాతోనే మంచి పేరు రావాలని కోరుకుంటున్నాను. కన్నడలో కెవిఎన్, తమిళ్ లో జికె డిస్ట్రిబ్యూటర్స్ ఈ సినిమాను రిలీజ్ చేస్తున్నారు 'అని చెప్పారు.హీరోయిన్ శైలి చౌదరి మాట్లాడుతూ ఈ సినిమాలో నటించడం ఒక అదృష్టంగా భావిస్తున్నాను.ఈ ప్రెస్ మీట్‌లో దర్శకుడు ఎం.ఎం. నాయుడు, నిర్మాత కొమ్మలపాటి సాయిసుధాకర్, నటి శైలజ, సంగీత దర్శకుడు సుభాష్ ఆనంద్, నటుడు తేజ, పాల్గొన్నారు.

# 'బుల్లెట్ సునీల్'గా రాజశేఖర్



హీరోగా పలు సినిమాలతో జనాన్ని అలరించిన రాజశేఖర్ ఇప్పుడు కొన్ని సినిమాల్లో సపోర్టింగ్ రోల్స్ చేస్తున్నాడు. అంకుశం వంటి సినిమాలతో టాప్ స్టార్‌గా ఎదిగిన రాజశేఖర్ చాలా కాలంగా ఆయన హీరోగా నటించిన సినిమాలు పెద్దగా ఆడకపోవడంతో ఇప్పుడు క్యారెక్టర్స్ చేసేందుకు సిద్ధమైయ్యారు. ఈ క్రమంలో శర్వానంద్ హీరోగా బైకర్ సినిమాలో రాజశేఖర్ కీలకపాత్రను పోషిస్తున్నారు. ఈ సినిమాలో బులెట్ సునీల్ గా రాజశేఖర్ కనిపిస్తారు. అభిలాష్ రెడ్డి కంకర దర్శకత్వంలో యువీ క్రియేషన్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. రాజశేఖర్ పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రం నుంచి రాజశేఖర్ పాత్ర బుల్లెట్ సునీల్‌ను పరిచయం చేస్తూ గ్లింప్స్ ను రిలీజ్ చేశారు.గ్లింప్స్ పవర్ ఫుల్ వాయిస్ ఓవర్‌తో మొదలవుతుంది. మాజీ మోటోక్రాస్ రేసర్ సునీల్ – 'బుల్లెట్ సునీల్'గా పాపులర్. 18 ఇండియన్ ఛాంపియన్‌షిప్స్, 57 సౌత్ జోన్ టైటిల్స్, 100కుపైగా రేస్ విజయాలతో అద్భుతమైన ట్రాక్ రికార్డ్ తనది. అయినా అతడి ప్రయాణం అక్కడితో ఆగిపోలేదు. ఇండియన్ రేసర్లు ఓడిపోయేవాళ్లే అన్న భావన అతడిని కలచివేస్తుంది. ఆ అభిప్రాయాన్ని చెరిపేసి, రేసింగ్ సర్క్యూట్‌లో భారతదేశానికి ఉన్న నిజమైన శక్తిని ప్రపంచానికి నిరూపించాలని నిశ్చయించుకుంటాడు.గత విజయాలు గురించి ఆలోచించకుండా, సునీల్ తన అనుభవాన్ని మళ్ళీ పోరాటంలోకి మళ్లిస్తాడు. ఆ పాత్రకు రాజశేఖర్ ఇచ్చిన ఇంటెన్సిటీ, తపన, ఎమోషనల్ డెప్త్ ఆ ప్రయాణాన్ని మరింత ప్రభావవంతంగా నిలబెట్టాయి.ఈ సినిమాలో శర్వానంద్ సరసన మాళవిక నాయర్ హీరోయిన్‌గా నటిస్తోంది.ఈ చిత్రం ఏప్రిల్ 3న థియేట్రికల్ రిలీజ్ కానుంది. సినిమాటోగ్రఫీ: జె. యువరాజ్, సంగీతం: గిబ్రాన్, ఎడిటింగ్: అనిల్ కుమార్ పి, ప్రొడక్షన్ డిజైన్: రాజీవన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడక్షన్: ఎన్. సందీప్, ఆర్ట్ డైరెక్టర్ ఎ. పన్నీర్ సెల్వం పని చేస్తున్నారు.బ్రహ్మాజీతో పాటు బాలివుడ్ నటుడు అతుల్ కులకర్ణి కీలకపాత్రల్లో నటించారు.

# సైన్స్ ఫిక్షన్ మూవీ 'కిల్లర్'



జ్యోతి,పూర్వాజ్, లీడ్‌రోల్స్ లో నటిస్తున్న సినిమా 'కిల్లర్'. మనీష్ గిలాడా, చంద్రకాంత్ కొల్లు, విశాల్ రాజ్, అర్చన అనంత్, గౌతమ్ చక్రధర్ కొప్పిశెట్టి ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాను థింక్ సినిమా, ఏయూ అండ ఐ స్టూడియోస్ బ్యానర్స్ పై పూర్వాజ్ , పద్మనాభ రెడ్డి.ఎ. నిర్మిస్తున్నారు. ఉర్వీశ్ పూర్వజ్ సమర్పకులుగా వ్యవహరిస్తున్నారు. పూర్వాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా నుంచి విలన్ క్యారెక్టర్‌లో టాలెంటెడ్ యాక్టర్ మనీష్ గిలాడను పరిచయం చేశారు. ప్రతినాయకుడిగా మనీష్ గిలాడ పవర్ ఫుల్ లుక్ లో ఆకట్టుకుంటున్నారు.ఈ చిత్రానికి డిఒపి జగదీశ్ బొమ్మిశెట్టి, మ్యూజిక్ ఆశీర్వాద్, సుమన్ జీవ, చీఫ్ ఎడిటర్ బి.మనోజ్ కుమార్,ఆర్ట్ డైరెక్షన్ మణి, యాక్షన్ కొరియోగ్రఫీ రాజ్ కుమార్ గంగపుత్ర, లైన్ ప్రొడ్యూసర్స్ దశరథ మాధవ్, సీతారామారావు,ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ డిఎస్ బాష.

# ఇలాంటి కాన్సెప్ట్ ఇప్పటివరకూ రాలేదు



నవీన్ చంద్ర, దివ్య పిళ్లై ప్రధాన పాత్రల్లో కరుణ కుమార్ రచన, దర్శకత్వం వహించిన సైకలాజికల్ హారర్ మూవీ హనీ. ఓ వీ ఏ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రవి పీట్ల, ప్రవీణ్ కుమార్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రాన్ని శేఖర్ స్టూడియోస్ సమర్పిస్తోంది. సైకాలజికల్ డెప్త్, సోషల్ రిలవెన్స్, హారర్ అంశాలతో రూపొందిన 'హనీ' ఫిబ్రవరి 6న థియేటర్ లో రిలీజ్ అవుతుంది. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మేకర్స్ ట్రైలర్ ని లాంచ్ చేశారు. ఈ సందర్భంగా దర్శకుడుడైరెక్టర్ కరుణ కుమార్ మీడియాతో మాట్లాడారు. సాహిత్యం కోసం చీకటి అనే కథ రాశాను. దాన్ని సినిమా తీద్దామని మా నిర్మాతలు వచ్చారు. హనీ సినిమాలో పిల్లి మాయ అనే ఒక వస్తువుని శోధించి సాధించే ఒక వ్యక్తి జీవితం చూపించాం. మెదడు అంతా చీకటి ఉన్నా మనసుల మధ్య జరిగిన ఒక కథ. నిజ జీవిత సంఘటన నుంచి స్ఫూర్తిగా తీసుకుని సినిమా చేయడం జరిగింది. మనిషి మెదడు కంటే పెద్ద దయ్యం లేదనేది ఈ సినిమా సారాంశం. కొత్త కథలు చేయడానికి ఎప్పుడూ ముందుండే నవీన్ చంద్ర ఈ సినిమా కథ చెప్పిన వెంటనే ఒప్పుకున్నారు. ఇందులో ఎప్పుడు చూడని నవీన్ చంద్రని చూడబోతున్నారు. అలాగే రాజా రవీందర్ పాత్ర కూడా చాలా కొత్తగా ఉంటుంది. అలాగే దివి, దివ్య అందరు కూడా ఒకరికి మించి ఒకరు చేశారు. ఇలాంటి కాన్సెప్టు ఇప్పటివరకు ఇండియన్ సినిమాలో రాలేదు. ఫిబ్రవరి 6వ తేదీన సినిమా విడుదలవుతుందన్నారు. గతంలో నేను చేసిన పలాస సినిమా సూపర్ డూపర్ హిట్ అయింది. నేను తీసిన ఒక్కో సినిమా ఒక్కో వైవిధ్యమైన కథతో తీస్తున్నాను. పలాస ఒక గ్రామంలో జరిగే కథ అయితే, మట్కా మరో కొత్త రకం కథ. ఇప్పుడు హని సినిమా కూడా కొత్తరకమైన కథ, కథనంతోనే తెరకెక్కించాను. దివి చాలా అద్భుతమైన నటి. తను తప్పకుండా పెద్ద స్టార్ అవుతుంది. దివ్య కూడా చాలా చక్కగా నటించింది. ఇది ఆలోచన రేకెత్తించే సినిమా. డివోపి మ్యూజిక్ డైరెక్టర్ అద్భుతమైన వర్క్ ఇచ్చారు. ఇందులో ఉన్న పాప కూడా చాలా చక్కగా నటించింది. ఈ కథ చెప్పినప్పుడు నవీన్ చంద్ర ఒప్పుకోవడం చాలా ఆనందంగా ఉంది. ఆయన నాపై పెట్టుకున్న నమ్మకాన్ని నేను నిలబెట్టుకున్నానని అనుకుంటున్నాను. ఈ సమాజంలో ఆశ కోసం ప్రజలు ఏవేవో చేస్తున్నారు. ఇందులో ఒక డార్క్ సొసైటీని చూపించాము. తప్పకుండ ప్రతి పేక్షకున్ని ఈ సినిమా అలరిస్తుంది. ఆలోచింపజేస్తుంది.

# 13కు మారిన 'స్కై' విడుదల




స్కై అనే సినిమా విడుదల వాయిదా పడింది. ఈ సినిమాను ఈనెల 6వ తేదీన విడుదల చేస్తున్నట్టు ముందుగా ప్రకటించారు. కానీ కొన్ని ఆర్థిక పరమైన సమస్యల వల్ల విడుదల వాయిదా పడినట్టు పరిశ్రమలో చర్చ జరుగుతోంది. 6వ తేదీన విడుదల కావలసిన ఈ సినిమాను ఎట్టకేలకు 13వ తేదీని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. మురళీ కృష్ణంరాజు, శృతి శెట్టి, ఆనంద్ ప్రధాన పాత్రల్లో వేలార్ ఎంటర్ టైన్ మెంట్ స్టూడియోస్ బ్యానర్ పై నాగిరెడ్డి గుంటక, శ్రీలక్ష్మి గుంటక, మురళీ కృష్ణంరాజు, పృథ్వీ పెరిచర్ల నిర్మిస్తున్న సినిమా 'స్కై'. పృథ్వీ పెరిచర్ల దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంతో శివ ప్రసాద్ అనే కొత్త మ్యూజిక్ డైరెక్టర్ ఇండస్ట్రీకి పరిచయమవుతున్నారు. 'స్కై' సినిమా ఫిబ్రవరి 6న గ్రాండ్‌థియేట్రికల్ రిలీజ్ కు రావాల్సిఉండగా వాయిదా పడింది. అనివార్య కారణాలతో వాయిదా పడిన ఈ సినిమాను ఈ నెల 13న రిలీజ్ చేస్తున్నట్లు నిర్మాతలు ప్రకటించారు. మురళీ కృష్ణంరాజు, శృతి శెట్టి, ఆనంద్ భారతి, రాకేశ్ మాస్టర్, ఎంఎస్, కెవిల్ కెమణి బమ్మ, తదితరులు నటించారు. ఈ చిత్రానికి డిఒపి రసూల్ ఎల్లోర్, ఎడిటర్ సురేష్ ఆర్స్, డైలాగ్స్ , స్టోరీ పృథ్వీ పెరిచెర్ల, మురళీ కృష్ణంరాజు, మ్యూజిక్ శివ ప్రసాద్, పాటలు పృథ్వీ పెరిచెర్ల, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్ స్వాతి పెన్మెత్స, లిఖిత గుంటక.

# కూలీలు మృతి (మొదటి పేజీ తరువాయి)

స్థలికి హుటాహుటిన చేరుకున్న సహాయక బృందాలు సెర్చ్ ఆపరేషన్‌లో నిమగ్నమయ్యారని ఆమె తెలిపారు. ఈ భారీ పేలుడు ప్రమాద ఘటన థాంగ్స్కు ఏరియాలో జరిగిందని డిజిపి వెల్లడించారు.ఇప్పటివరకు 16మంది మృతదేహాలను కనుగొన్నామని, బొగ్గుగనిలో సంభవించిన భారీ పేలుడు సమయంలో ఎంతమంది కూలీలు చిక్కుకుపోయి ఉంటారనే ఖచ్చితమైన సమాచారం ఇప్పటి వరకు తెలియలేదన్నారు. అయితే ఎక్కువమంది కూలీలు చిక్కుకుపోయి ఉంటారన్న భయాందోళనను ఆమె వ్యక్తంచేశారు. పేలుడులో ఒక వ్యక్తి తీవ్రగాయాలతో ఉన్నది గమనించి వెంటనే అతడిని సుత్నుగా ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తీసుకెళ్లి ప్రాథమిక చికిత్స జరిపించిన వెంటనే మెరుగైన చికిత్స కోసం షిల్లాంగ్‌లోని హాస్పిటల్‌కు తరలించడం జరిగిందని ఈస్ట్ జైంతియా హిల్స్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ వికాష్ కుమార్ చెప్పారు. ఈ పేలుడు అక్రమ బొగ్గుగని తవ్వకాలు జరుపుతున్న స్థలంలో సంభవించిందని అనుమానిస్తున్నామని, అయితే అది అక్రమ మైనింగ్ అయి ఉంటుందని విశ్వసిస్తున్నామని వికాష్‌కుమార్ తెలిపారు. ఆ గని అక్రమంగా నిర్వహిస్తున్నారా? అని అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ 'అవును.. అది అలాగే కనిపిస్తోంది' అని ఎస్‌పి కుమార్ చెప్పారు. కారణం ఏమిటన్నది ఇప్పటివరకూ నిర్ధారణ కాలేదని, అయితే ఈ భారీ పేలుడు ఘటనపై విచారణ జరుగుతోందని వివరించారు. పర్యావరణ న ష్టం, భద్రతా ప్రమాదాలను పేర్కొంటూ మేఘాలయలో రాట్‌హోల్ కోల్ మైనింగ్ ఇతర అశాస్త్రీయ మైనింగ్ పద్ధతులపై జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జిటి) 2014లో నిషేధం విధించింది. అదే సమయంలో అటువంటి పద్ధతుల ద్వారా సేకరించిన బొగ్గు అక్రమ రవాణాను కూడా పరిమితం చేసింది. రాట్‌హోల్ మైనింగ్‌లో భాగంగా కార్మికులు సాధారణంగా 3 నుంచి 4 ఫీట్ల ఎత్తులో ఉన్నటువంటి ఇరుకైన టన్నెల్స్‌లోకి ప్రవేశించి తవ్వకాలు జరుపుతారు. క్షితిజ సమాంతర (హారిజంటల్) టన్నెల్స్‌ను తరచుగా 'రాట్‌హోల్స్' టన్నెల్స్ అని పిలుస్తుంటారు. ప్రతీ ఒక్కటి ఒక వ్యక్తికి మాత్రమే సరిపోతుంది. 2014 తర్వాత సుప్రీంకోర్టు ఆ నిషేధాన్ని సమర్థించింది. శాస్త్రీయ , పర్యావరణ రక్షణలతో కూడిన పద్ధతుల ద్వారానే మైనింగ్‌కు అనుమతించింది.

# మా దృష్టికి తేండి (మొదటి పేజీ తరువాయి)

ఏర్పాటు చేయడానికి అత్యున్నత న్యాయస్థానం 4 వారాల సమయం ఇచ్చింది. ప్రకాశ్ సింగ్ కేసులో సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం డిజిపి నియామకానికి ప్రతిపాదనలు పంపడానికి అనేక రాష్ట్రాలు, యుపిఎస్‌సి తీవ్ర జాప్యం చేస్తున్నాయని ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ ద్విసభ్య ధర్మాసనం పూర్తిగా సమర్థించింది. పోలీస్ సంస్కరణలకు సంబంధించిన ప్రకాశ్ సింగ్ కేసులో యుపిఎస్‌సి ఎంప్యానెల్ చేయబడిన ముగ్గురు సీనియర్ మోస్ట్ ఐపిఎస్ ఆఫీసర్స్ నుండి డిజిపిల ఎంపికను తప్పనిసరిచేస్తూ సుప్రీంకోర్టు మార్గదర్శకాలను నిర్దేశించింది. వారికి రెండు సంవత్సరాల స్థిర పదవీకాలాన్ని నిర్దేశించింది. డిజిపి ఎంపికను నిర్ధారించే విషయంలో మెరిటోరియస్, సీనియర్ అధికారులు జాప్యం చేస్తున్నారని యుపిఎస్‌సి ధర్మాసనానికి విన్నవించింది. అనేక రాష్ట్రాలు అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలను పూర్తిగా పెడచెవినపెట్టి డిజిపి నియామక ప్రతిపాదనను జాప్యం చేస్తూనే ఉన్నాయని రెగ్యులర్ నియామకానికి బదులుగా యాక్టింగ్ డిజిపిని నియమించడం ద్వారా తాత్కాలిక ఏర్పాటును చేసుకునేందుకు ప్రాధాన్యతను ఇస్తున్నాయని యుపిఎస్‌సి వివరించింది. ప్రకాశ్‌సింగ్ కేసులో జారీచేసిన ఆదేశాలను ధిక్కరించకుండా చూసుకోవడానికి డిజిపి నియామకానికి సకాలంలో ప్రతిపాదనలు పంపించాలని యుపిఎస్‌సి రాష్ట్ర ప్రభుత్వాలకు లేఖ రాయడానికి తాము అధికారం ఇస్తున్నామని ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ ధర్మాసనం తెలిపింది. రాష్ట్రాలు సకాలంలో ప్రతిపాదనను సమర్పించని పక్షంలో ప్రకాశ్ సింగ్ కేసులో దరఖాస్తును దాఖలు చేయాలని సుప్రీంకోర్టు యుపిఎస్‌సిని ఆదేశించింది.తెలంగాణ హైకోర్టు జనవరి 9న ఇచ్చి ఆదేశాలను సవాల్‌చేస్తూ యుపిఎస్‌సి దాఖలు చేసిన పిటిషన్‌ను ధర్మాసనం విచారించింది. సుప్రీంకోర్టు జారీచేసిన మార్గదర్శకాల ప్రకారం రాష్ట్రం ప్రారంభించిన ప్రక్రియను కొనసాగించడం ద్వారా తెలంగాణ డిజిపి ఎంపిక ప్రక్రియ మొత్తాన్ని 4 వారాలలోపు పూర్తి చేయాలని హైకోర్టు కమిషన్‌ను కోరింది. ప్రకాశ్‌సింగ్ కేసులో సుప్రీంకోర్టు నిర్దేశించిన గడువులోపు ప్రతిపాదనను సమర్పించకపోవడంలో తెలంగాణ రాష్ట్రం వైపునుండి తీవ్రమైన లోపం ఉందని సుప్రీంకోర్టులో విచారణ సందర్భంగా యుపిఎస్‌సి న్యాయవాది ఆరోపించారు. తెలంగాణలో చివరి రెగ్యులర్ డిజిపిని 2015లో నియమించారని, ఆ అధికారి 2017లో పదవీవిరమణ చేశారని యుపిఎస్‌సి సుప్రీంకోర్టుకు తెలిపింది. యుపిఎస్‌సి వీలైనంత త్వరగా ఎంప్యానల్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటుచేసి, తెలంగాణ రాష్ట్రానికి డిజిపి నియామకం కోసం సిఫార్సు చేయాలని మేము ఎలాంటి సందేహం లేకుండా భావిస్తున్నామని ధర్మాసనం పేర్కొంది. ఇది చేయడానికి అత్యున్నత న్యాయస్థానం యుపిఎస్‌సికి అవసరమైన మరో 4 వారాల సమయాన్ని మంజూరు చేసింది.

# నివారణే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

విద్యావేత్తలు, దేశవ్యాప్తంగా ఉన్న సైబర్ భద్రతా నిపుణులు పాల్గొన్నారు. సైబర్ నేరాల నివారణ, దర్యాప్తు, బాధితులకు మద్దతు విషయంలో తెలంగాణ సాధిస్తున్న నాయకత్వానికి ప్రతీకగా 'షీల్డ్2026' నిలుస్తుందని నిర్వాహకులు తెలిపారు. ప్రభుత్వం, పోలీస్ శాఖ, పరిశ్రమలు, విద్యా సంస్థలు, స్టార్టప్‌లు, పరిశోధనా సంస్థల మధ్య సమన్వయానికి ఈ కాంక్లేవ్ జాతీయ వేదికగా మారిందన్నారు. ఈ సందర్భంగా సిఎస్ కె. రామకృష్ణారావు మాట్లాడుతూ పాలన, ప్రజా సేవలు, కీలక మౌలిక సదుపాయాలపై పెరుగుతున్న సైబర్ ముప్పులను ఎదుర్కోవాలంటే బలమైన, విధానపరమైన సమన్వయం అవసరమని పేర్కొన్నారు. పరిపాలనలో అన్ని స్థాయిల్లో సైబర్ భద్రతను అంతర్భాగం చేయాల్సిన అవసరం ఉందన్నారు. డిజిపి బి. శివధర్ రెడ్డి మాట్లాడుతూ సైబర్ నేరాల స్వరూపం వేగంగా మారుతోందని, కేసుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో అధునాతన దర్యాప్తు సాంకేతికతలు, ప్రత్యేక శిక్షణ, అంతరశాఖల సహకారం అవసరమని చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా టిజిసిఎస్‌బి అభివృద్ధి చేసిన ఏఐ ఆధారిత బహుభాషా సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ 1930 సారథి, సహాయక వ్యవస్థ, వేగవంతమైన, ఏకీకృత సైబర్ నేరాల దర్యాప్తుకు రూపొందించిన ప్లాట్‌ఫారమ్ సెంటినెల్(సిసిఐటి)తో పాటు పిల్లలపై లైంగిక వేధింపుల (సిఎస్ఇఎఎమ్) డిజిటల్ సాక్ష్యాలను ఆటోమేటెడ్‌గా ప్రాసెస్ చేసే ఏఐ వ్యవస్థ సిసైట్ వంటి కీలక డిజిటల్ కార్యక్రమాలను సిఎస్ ఆవిష్కరించారు.

### చైల్ ప్రొటెక్షన్ యూనిట్ ఫలితాలు..

'షీల్డ్ 2025'లో ప్రారంభించిన చైల్ ప్రొటెక్షన్ యూనిట్ (సిపియు) ద్వారా గణనీయమైన ఫలితాలు సాధించామని అధికారులు తెలిపారు. సిపియు ఏర్పాటుకు ముందు 37 కేసులు మాత్రమే నమోదు కాగా, ఏర్పాటు తర్వాత 1.20 లక్షలకు పైగా టిప్ లైన్లను ప్రాసెస్ చేసి, 866 కేసులు నమోదు చేసి, 421 మందిని అరెస్టు చేసినట్లు వెల్లడించారు. కాంక్లేవ్‌లో ఏర్పాటు చేసిన టెక్నాలజీ ఎక్స్‌పీరియన్స్ జోన్ (టిఇజెడ్) ప్రధాన ఆకర్షణగా నిలిచింది. రోబోటిక్ డాగ్స్, హ్యూమనాయిడ్ రోబోలు, డ్రోన్‌కౌంటర్ డ్రోన్ టెక్నాలజీ, ఫ్లైట్ సిమ్యులేటర్లు, ఏఐ ఆధారిత భద్రతా పరిష్కారాలను ప్రదర్శించారు. 'షీల్డ్2026'లో భాగంగా జాతీయ సైబర్ ఇన్నోవేషన్ ఛాలెంజ్ 'సైఫర్ స్ప్రింట్'ను నిర్వహించారు. దేశవ్యాప్తంగా 500కు పైగా బృందాలు పాల్గొనగా, 17 ఫైనలిస్ట్ జట్లు వాస్తవ సైబర్ సవాళ్లకు పరిష్కారాలను ప్రదర్శించాయని పేర్కొన్నారు. విజేతలకు రూ. 5 లక్షల గ్రాంట్‌తో పాటు టిజిసిఎస్‌బితో కలిసి పనిచేసే అవకాశం లభించనుందని వివరించారు. 2025లో తెలంగాణలో సైబర్ క్రైమ్ ఫిర్యాదులు 6 శాతం తగ్గాయని, ఆర్థిక నష్టం 23 శాతం తగ్గిందని అధికారులు తెలిపారు. సుమారు రూ. 534 కోట్లు స్తంభింపజేసి, 47 వేల మంది బాధితులకు రూ. 367 కోట్లు తిరిగి అందించినట్లు వెల్లడించారు.

### భవిష్యత్‌కు భద్రత టిజిసిఎస్‌బి లక్ష్యం..

టిజిసిఎస్‌బి డైరెక్టర్ శిఖా గోయెల్ మాట్లాడుతూ పరిశ్రమలు, విద్యా సంస్థలతో కలిసి భవిష్యత్‌కు సిద్ధమైన సైబర్ భద్రతా పర్యావరణ వ్యవస్థ నిర్మించడమే లక్ష్యమని తెలిపారు. కార్యక్రమాన్ని టిజిసిఎస్‌బి ఎస్‌పి హర్షవర్ధన్ వోటు ఆఫ్ థ్యాంక్స్‌తో ముగించారు. షీల్డ్ అనేది కేవలం సమావేశం కాదని, తెలంగాణ, దేశ భవిష్యత్ సైబర్ భద్రతకు ఒక మిషన్ అని నిర్వాహకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన, ఆర్‌బిఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వాసుదేవన్, ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్య, టిజిపిఎ డైరెక్టర్ అభిలాష బిస్త్, సంజయ్ కుమార్ అగర్వాల్,డిజి (రాజస్థాన్), నీరజ, ఎడిజి(పంజాబ్), సాయి మనోహర్,ఎడిజి (ఎంపి), భువాన్ రిభూ,ఐసిపి(ఢిల్లీ) తదితరులు పాల్గొన్నారు.




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com